




ESTD: 1999 www.voodayam.com

# వుదయం

ఖమ్మం | 12-01-2026 సోమవారం | సంపుటి : 13 | సంచిక : 104 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily


Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal — Follow us on







## రేపు అన్వేషణ్ ప్రయోగం



**శ్రీహరికోట:** శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో ప్రతిష్టాత్మక రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పీఎస్ఎల్వీ–సీ62 రాకెట్ ప్రయోగానికి సంబంధించి మధ్యాహ్నం 12:17 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 22 గంటల పాటు కౌంట్‌డౌన్ కొనసాగనుంది. ఇస్రో శాస్త్రవేత్తలు పీఎస్ఎల్వీ–సీ62 రాకెట్ ద్వారా ఇఒఎస్ ఎన్ఐ శాటిలైట్‌ను అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ ప్రయోగం ద్వారా 8 విదేశీ, 7 స్వదేశీ ఉపగ్రహాలను ఒకేసారి కక్ష్యలోకి పంపనున్నారు. ఈ ప్రయోగం భారత అంతరిక్ష పరిశోధనలో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. ఇఒఎస్ ఎన్ఐ శాటిలైట్‌కు ఇస్రో శాస్త్రవేత్తలు 'అన్వేషణ్' అనే నామకరణం చేశారు. ఈ శాటిలైట్ భూపరిశీలనలో అత్యాధునిక సాంకేతికతతో పనిచేయనుంది. ఈ ఉపగ్రహం ద్వారా భూపరిశీలన, దేశ రక్షణ రంగానికి అవసరమైన సమాచారం, వాతావరణ మార్పుల అధ్యయనం, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలు అందించ

మిగతా 12లో

# ఆ మంత్రులెవరు?

## నియోజకవర్గాలు మరిచి కీచులాటలు


## ముగ్గురు మంత్రులపై వేటు?

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

'హస్తం'లో హల్ చల్ మొదలైంది. రాష్ట్ర కేబినెట్ లో పలువురు మంత్రుల వ్యవహార తీరు వివాదస్పదమవుతున్నది. గడిచిన రెండేళ్ల పాలనలో నియోజకవర్గాల అభివృద్ధి కోసం చేసిందేం లేకపోగా.. వేరే వ్యవహారాలు పెరిగిపోతున్నాయన్న టాక్ బలంగా నడుస్తోంది. ఇప్పటికే పలువురు మంత్రులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయా మంత్రుల తీరుపై ఇంటిలిజెన్స్ అధికారులు సైతం ఇటీవల సీఎంకు నివేదిక ఇచ్చినట్లు విస్తృత ప్రచారం జరుగుతున్నది. సొంత పార్టీ నేతలపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు, తాజా పరిణామాలను సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం దృష్టికి వెళ్లారు. అదే సమయంలో ఏఐసీసీ సైతం తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎం, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ కు దిశానిర్దేశం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదీలా వుంటే.. అధిష్టానం ఆదేశాలతో సీఎం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలాంటి చర్యలు తీసుకుంటారోననే చర్చ ఆసక్తికరంగా మారింది. మరోవైపు త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేర్పులు ఉంటాయనే చర్చ అధికార పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.

పలువురు మంత్రులు వివాదాల్లో చిక్కుకున్నారు. వాటి నుంచి బయటపడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి బంధువు భూమి కబ్జా చేయగా.. సదరు మంత్రి ఏకంగా ఆ అధికారినే బదిలీ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే మద్యం హోలోగ్రామ్స్ టెండర్లలో అవినీతికి పాల్పడ్డారనే అపవాదును మరో మంత్రి మూటగట్టుకున్నారు. తాజాగా ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఓ మంత్రి ఏకంగా మహిళా ఐఏఎస్ అధికారితో ప్రేమాయణం సాగిస్తున్నారనే ప్రచారం అధికార పార్టీని ఇరకాటంలో పడేసింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మరో మంత్రి మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం మంత్రివర్గంలో ముగ్గురు మంత్రుల పనితీరుపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే క్యాబినెట్ పనితీరుపై సర్వే నిర్వహించిన అధిష్ఠానం ముగ్గురు మంత్రులకు కేబినెట్ నుంచి ఉద్వాసన పలకాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికార పార్టీలో చర్చ జరుగుతున్నది. వివాదాస్పద వ్యాఖ్యలు, చర్యలతో పార్టీకి, ప్రభుత్వానికి సమస్యగా మారడం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్ర,చారం జరుగుతున్నది. వారికి ఉద్వాసన పలకాలనే యోచనలో అధిష్ఠానంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీరి తొలగింపుతో ఖాళీ అయ్యే మూడు స్థానాలతో పాటు మరో నలుగురిని కొత్తగా క్యాబినెట్‌లోకి తీసుకుంటారని, రెండు బెర్తులను మళ్లీ ఖాళీగానే ఉంచుతారని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో పదవి కోల్పోయేది ఎవరో, కొత్తగా మంత్రులు అయ్యే మంత్రులెవరో అన్న ఉత్కంఠ నెలకొంది. మరోవైపు... కేబినెట్ లో బీసీ సామాజిక వర్గం నుంచి ఓ మంత్రిని తప్పించి.. ఆ స్థానంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ కు చోటు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

### ఒక బీసీ మంత్రిని తొలగించి మహేశ్ గౌడ్‌కు చోటు



## ఇరాన్ ఉద్రిక్తం



### అమెరికా దాడి చేసే సూచనలు


- నిరసనకారులకు ట్రంప్ అండ

**తెహ్రాన్:** ఇరాన్‌లో నిరసనలు తీవ్రమవుతూ, ఇతర దేశాల వీధుల్లోకి వ్యాపిస్తుండటంతో, ఇరాన్‌కు వ్యతిరేకంగా తీసుకోవలసిన సైనిక చర్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వివరణ ఇచ్చినట్లు పలువురు అమెరికా అధికారులు న్యూయార్క్ టైమ్స్‌తో అన్నారు. గత నెల చివర్లో ప్రారంభమైన ప్రదర్శనల పట్ల తెహ్రాన్ హింసాత్మక ప్రతిస్పందనపై వాషింగ్టన్ నుండి వచ్చిన హెచ్చరికల నడుమ అమెరికాలో రూపొందుతున్న వ్యూహాల గురించి వార్తలు వస్తున్నాయి. ఇవి ఇరాన్ మతాధికారులకు ప్రత్యక్ష సవాలుగా మారాయి. అమెరికా అధ్యక్షుడు ఇంకా అంతిమ నిర్ణయం తీసుకోలేదని, ఒకవేళ ఇరాన్ ప్రభుత్వం అణచివేతను తీవ్రతరం చేస్తే పరిమిత దాడులు చేయాలని గంభీరంగా ఆలోచిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెహ్రాన్‌లో గల స్థావరాలు సహా ఇరాన్ భద్రతా సేవలపై లక్ష్యిత చర్యను తీసుకోవడం సహా పలు ప్రత్యామ్నాయలను అధ్యక్షుడి ఎదుట ఉంచినట్టు అధికారులు చెప్తున్నారు.

#### ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్న ఇరాన్ అశాంతి

ఇరాన్ సరిహద్దుల ఆవల కూడా ఈ అశాంతి ప్రతిధ్వనిస్తోంది. శుక్రవారం నాడు, లండన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపైకి ఒక నిరసనకారుడు ఎక్కి, ఇస్లామిక్ రిపబ్లిక్ జెండాను దించి, చింపేసి, ఆ స్థానంలో 1979 ముందు ఉన్న సింహం, సూర్యుడు చిహ్నాలు కలిగిన జెండాలను ఎగురవేశాడు.

మిగతా 12లో



## 108 గుర్రాలతో సోమనాథ్ శౌర్య యాత్ర

### ప్రధాని మోడీకి భారీగా ప్రజా స్పందన

**సోమనాథ్ :** ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం సోమనాథ్‌లోని మహాదేవుడి ఆలయాన్ని సందర్శించుకొని, పూజలు చేశారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం గుజరాత్ వచ్చిన ఆయన ఉదయం శౌర్యయాత్రలో పాల్గొన్నారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో భాగంగా ఈ యాత్రను నిర్వహించారు. ఈ క్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విదేశీ దురాక్రమణదారుల నుంచి సోమనాథ్ ఆలయాన్ని రక్షించేక్రమంలో తమ ప్రాణాలు అర్పిం టచిన యోధులకు గుర్తుగా ఈ శౌర్యయాత్ర నిర్వహించారు. దానిలో భాగంగా మోదీ ఆ యోధులకు నివాళులు అర్పించారు. ఈ యాత్రకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు.. మోదీ, మోదీ అని నినాదాలు చేస్తూ ప్రధాని కి స్వాగతం పలికారు. ఇక ఇక్కడ 108 అశ్వాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వాటిని ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా తీసుకువచ్చారు. ఆలయం వైపు వెళ్తున్న ప్రధానికి అవి ఎస్కార్ట్‌గా మారినట్లు ఆ సన్నివేశం తలపించింది. అనంతరం మోదీ సోమ్‌నాథ్ ఆలయానికి చేరుకొని, పూజలు నిర్వహించారు.

## ఉష

వుదయం సాహిత్యం

2వ పేజీలో చూడండి

## ప్రధాన పట్టణాల్లో ఇద్దరు తహశీల్దారులు

- భూ సర్వేలు, ధరణీ సమస్యల నేపథ్యంలో నిర్ణయం
- త్వరలోనే మంత్రివర్గంలో నిర్ణయం
- పెద్దపల్లి పర్యటనలో మంత్రి పొంగులేటి



**వుదయం, పెద్దపల్లి :** రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో పరిపాలనను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. జనాభా ఎక్కువగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఇకపై అదనపు తహశీల్దార్లను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లాలో పర్యటించిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకటిన్నర లక్షల నుండి రెండు లక్షల జనాభా ఉన్న పట్టణాలు చాలా ఉన్నాయన్నారు. ఇంత భారీ జనాభాకు కేవలం ఒక్కరే తహశీల్దార్ ఉండటంతో రెవెన్యూ సేవల్లో జాప్యం జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. భూముల సర్వేలు, ధరణి సమస్యలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం జరగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ ప్రతిపాదనను త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదిస్తామని చెప్పారు. దీంతో పట్టణాల్లో పనుల భారం తగ్గి, సామాన్యులకు త్వరగా సేవలు అందుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతోనే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే జోరు కొనసాగుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని తిరస్కరిస్తున్నా.. మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తామని కేటీ ఆర్ పగటి కలలు కంటున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. సొంత కుటుంబంలోని ఆడబిడ్డకు న్యాయం చేయలేని వారు, ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు.

## మేడారం పనులు 15లోపు పూర్తి

- ఈ జాతర మన ఆత్మ గౌరవ ప్రతీక : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**వుదయం, మేడారం :** మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరను ప్రపంచానికి పరిచయం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ జాతర కేవలం గిరిజనుల పండుగ మాత్రమే కాదన్నారు. ఇది తెలంగాణ గుండె చప్పుడు ఆత్మ గౌరవ ప్రతీక అని అభివర్ణించారు. ఆదివారం మేడారంలో



పర్యటించిన ఆయన పలువురు మంత్రులతో కలిసి జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

మిగతా 12లో

## పేదల ఇళ్లే కూలుస్తారా?

### మంత్రుల అక్రమ నిర్మాణాలు కనిపించవా?

### రాజేంద్రనగర్ కార్యకర్తల భేటీలో కేటీఆర్



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** రేవంత్ రెడ్డి ఓ అసమర్థత సీఎం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆయనకు అభివృద్ధి చేయడం చేతకాదని చెప్పారు. కేవలం వ్యవస్థలను కూల్చడం మాత్రమే తెలుసని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్ లోని తెలంగాణభవన్ లో రాజేంద్రనగర్ నియోజకవర్గ నేతలతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నడపడం ఈ "సన్నాసుల"తో సాధ్యం కావడం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డికి బూతుల భాష తప్ప మరే భాష రాదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న 'హైడ్రా' తీరును తప్పుబట్టిన ఆయన.... కాంగ్రెస్ మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగిలేటి శ్రీనివాస రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డిలకు చెందిన అక్రమ నిర్మాణాలు హైడ్రా అధికారులకు కనిపించడం లేదా అని నిలదీశారు. పేదవాడి ఇళ్లను కూలగొట్టడమే సీఎం తన లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మంత్రుల ఇళ్లకు వచ్చే సరికి వెనకాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ లో ప్రభుత్వం కట్టిస్తామన్న 'ఇందిరమ్మ ఇళ్లు' ఎక్కడ ఉన్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజలను మోసం చేయడమే తప్ప మరేమీ సాధించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం తన దృష్టిని

మిగతా 12లో

**అమరావతికి కుడి ఎడమ మద్దతు**
అమరావతే సరైన రాజధాని : వెంకయ్య నాయుడు
15 ఏళ్ల తరువాత కూడా రాజధాని రగడ మంచిది కాదు : బివి రాఘవులు

**సచివాలయంలో సస్పెన్స్ థ్రిల్లర్** 12
మంత్రికి తెలియకుండా జీవోలా?: హరీశ్ రావు



**విశాఖలో నడిరోడ్డున యువతిపై దాడి**

**సైబర్ వలలో వృద్ధ దంపతులు** 5
రూ. 15 కోట్లు హాంఫట్

**ప్రీ కాస్ట్ నిర్మాణాలతో కాలుష్యానికి చెక్** 12

## అంతర్జాతీయ సంస్థలకు అమెరికా దూరం : దుష్ప్రభావాలు

దాదాపు 66 అంతర్జాతీయ సంస్థల నుంచి ఉపసంహరించుకోవాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం వల్ల అనేకానేక అంతర్జాతీయ సమస్యలపై ప్రతికూల ప్రభావాన్ని చూపనుంది. ముఖ్యంగా, గ్లోబల్ వార్మింగ్ ఈ భూమిపై జీవనానికి అంతరాయం కలిగించకుండా ప్రతి దేశం చేస్తున్న కృషిపై ఈ ప్రభావం బలంగా కనిపించనుంది. అంతర్జాతీయ సంస్థల నుంచి ఉపసంహరించుకోవాలని అమెరికా నిర్ణయించుకోవడం ఇది తొలిసారి కాదు, అయితే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ పని చేశారు. రానున్న సంవత్సరాలలో అమెరికా భాగస్వామ్యాన్ని కోల్పోనున్న సంస్థల సంఖ్య దృష్ట్యా ట్రంప్ తీసుకున్న నిర్ణయం అసాధారణమైంది.

అయితే, ట్రంప్ వైట్ హౌజ్ తీసుకున్న ఈ నిర్ణయం అనాలోచితమైనది లేదా విచిత్రమైనది కాదు. ఈ ప్రయోజనం కోసం నియమించిన టాస్క్ ఫోర్స్ నెలల తరబడి చేసిన సమీక్షలు, చర్చల ఫలితమే ఇది. సుదీర్ఘంగా ఆలోచించి తీసుకున్న చర్య. అధ్యక్షుడు ట్రంప్ సలహా బృందం జరిపిన చర్చల ఫలితం.

ఈ సంస్థల కోసం సమయాన్ని, శక్తిని, డబ్బును పెట్టుబడి పెట్టడం అన్నది ఆశించిన ఫలితాలను తీసుకురాలేదు లేదా అమెరికా ప్రయోజనాలను నెరవేర్చలేదు అన్న ట్రంప్ సలహాదారుల అవగాహన ఆధారంగా తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం. అయితే, ఈ నిర్ణయాన్ని కొందరు అమెరికన్ వ్యాఖ్యాతలు హాస్యాస్పదమైన, ప్రమాదకరమైన, అనాలోచిత, దురుద్దేశపూర్వక చర్యగా అభివర్ణించగా, మరికొందరు వృధా ఖర్చును నిలవరించేందుకు తీసుకున్న సరైన చర్య అని, అటువంటి సంస్థలు అనేకం నుండి అమెరికా ఉపసంహరిం చుకోవాలని పేర్కొన్నారు. ఈ ఎంపిక అటు ప్రపంచానికీ, అమెరికాకీ హానికరమైన పరిణామాలను తీసుకువచ్చేది. మొదటగా, అంతర్జాతీయ పరిపాలనకు ప్రాథమికమైనదిగా భావించే బహుళపాక్షికతను మరింతగా పలచన చేసే అవకాశం ఉంది. ప్రపంచాన్ని ప్రభావితం చేసే సమస్యల విషయంలో బహుపాక్షిక ఏకాభిప్రాయం కొరవడినప్పుడు, ఒక సూపర్ పవర్ ఏకపక్ష అభిప్రాయాన్ని చేయడం లేదా ఒకటికంటే ఎక్కువ శక్తుల మధ్య ప్రయోజనాల ఘర్షణకు సంబంధించిన పర్యవసానంగా మారుతుంది. ఆమెరికా, ఒకనాటి సోవియట్ యూనియన్ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధకాలంలో నిజమైన బహుపాక్షికత దెబ్బతిన్నది. ఈ రెండు శక్తులు తమ తమ ప్రభావ క్షేత్రాలలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నాయి.




సోవియట్ పతనానంతరం, కొంతకాలం పాటు సాగిన ఏకధృవ ప్రపంచ క్రమంలో అనేక అంతర్జాతీయ అంశాలను అమెరికా నిర్దేశించింది. కానీ, ఈ రెండు కాలక్రమాలలోనూ బహుళపాక్షిక సంస్థలు అంత ప్రతిభావంతం కాకపోయినప్పటికీ, పని చేయడాన్ని కొనసాగించాయి. ఈ సంస్థలు కొంతమేరకు ఈ శక్తివంతమైన దేశాలపై నైతిక ఒత్తిడిని తీసుకురాగలవు కానీ, డజన్ల కొద్దీ అంతర్జాతీయ సంస్థల నుంచి అమెరికా ఉపసంహరణ

మిగతా 12లో

## అశ్లీల పోస్టులపై దారికి వచ్చిన ఎక్స్

- భారతీయ చట్టాలకు అనుగుణంగా ఉంటామని హామీ



**న్యూఢిల్లీ:** అ ంగీకార ం లేకుండా తీసిన అభ్యంతర అశ్లీల చిత్రాలను ఉత్పత్తి చేసిన లేదా పంపిణీ చేసిన 600కు పైగా అ కౌంట ్లను శాశ ్వత ంగా తొలగించడమే కాక, దాదాపు 3,500కు పైగా అభ్యంతరకర చిత్రాలను, వ్యాఖ్యానాలను సోషల్ మీడియా వేదిక ఎక్స్ బ్లాక్ చేసినట్టు తెలుస్తోంది. ఒక ప్రముఖ జాతీయ దినపత్రిక ప్రకారం, తమ కార్యకలాపాలు భారతీయ ఆన్‌లైన్ కంటెంట్ చట్టాలకు అనుగుణంగా ఉంటాయని ఎక్స్ అధికారులకు హామీ ఇచ్చింది. ఇటీవలి కాలంలో ప్రభుత్వం ఎలన్ మస్క్ యాజమాన్యంలోని ఎక్స్ కార్ప్‌కు, దాని ఎఐ చాట్ బాట్, గ్రోక్ ద్వారా అసభ్యకరమైన, లైంగికంగా అసభ్యతను సూచిస్తూ ఉత్పత్తి చేసిన చిత్రాల విషయంలో వారు తీసుకున్న చర్యలపై కార్యాచరణ నివేదికను సమర్పించవలసిందిగా ఆదేశాలు జారీ చేసింది.

మిగతా 12లో

# ఉష
## వుదయం సాహిత్యం

# పది వసంతాల కవితలు

## ఓతలాంతైయార్

150...200 CE


తమిళ సంగమ కవి

ఇంగ్లీషు : మార్తాయాన్ సెల్వీ

తెలుగు అనువాదం : పి. శ్రీనివాస్ గౌడ్


(తమిళ కవి ఓతలాంతైయార్ (otalantaiyar) ను సుమారు క్రీ.శ. 150–200 ప్రాంతానికి చెందినవాడుగా అంచనా వేసారు. అతను తమిళ సంగమ కవిత్వంలోని లోని కపిలర్, పరనార్, ఔవైయ్యార్, నక్కీరర్ లాంటి ఇతర కవులతో పాటు ఐంకుఋనూఋ(ఐదు వందలు) లో కేవలం 'పాలై తిణై' (వియోగం, కష్టాలు ) కవితలను మాత్రమే రచించాడు. ఇది తప్ప ఆయన గురించి ఏమీ తెలియ రావడం లేదు. ఈ పాలై వంద కవితలతో పాటు, ఆయన పేరుతో మరో మూడు కవితలు (కుఋంతొక్కై 12, 21, 329) మాత్రమే ఉన్నాయి. ఈ పాలై వంద కవితల నుంచి ఇళవేనిల్ పత్తు ( పది వసంతకాల కవితలు ) 341 – 350 వరకు చేసిన కవితల అనువాదం ఇది. తలైవ (కథానాయకుడు ) ఇచ్చినమాట ప్రకారం వసంతకాలాని కన్నా ముందే దేశాంతరం నుంచి తిరిగి వస్తానని చెప్పి, ఇంకా రానప్పుడు తలైవి (కథానాయకి) పలుకుతున్న సందర్భంలోనివి ఈ కవితలు)

1.

అతను ఇంకా రాలేదు,
కానీ, మెత్తని ఒండ్రు మట్టి
అలలలలుగా పరుచుకుని
పాయలు వేస్తుంటే..
కోకిల తీయగా జతను పిలుస్తున్న
సమయం వచ్చేసింది –

2.

అతను ఇంకా రాలేదు,
కానీ, నల్లని మొద్దున్న మల్బరీచెట్టు
తన సుగంధాన్ని వెదజల్లుతుంటే..
దాని మందపాటి కొమ్మల్లో
ఝుమ్మంటూ తేనెటీగలు రమించే
సమయం వచ్చేసింది –

3.

అతను ఇంకా రాలేదు,
కానీ, ధృఢమైన అల్లిచెట్ల గుబురు
అందంగా ఉబ్బిన
లావాటి మొగ్గలను కాస్తుంటే..
అవి విచ్చుకొని వికసించే
సమయం వచ్చేసింది –

4.

అతను ఇంకా రాలేదు,
కానీ, సుగంధ పూలతో నిండిన
సీసాకారపు పూల చెట్టు మీద
బొమ్మలాంటి పండు పండితే..
కోసి తీసుకోవలసిన
సమయం వచ్చేసింది –

5.

అతను ఇంకా రాలేదు,
కానీ, మల్లెతీగలు పాకి
పూలని విస్తారంగా పూస్తుంటే..
నల్లని ఒండ్రు పాదులని
శిరోజాల పేటలుగా అలంకరించే
సమయం వచ్చేసింది –



పి.శ్రీనివాస్ గౌడ్


ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపాధ్యాయులుగా పని చేసి, ప్రస్తుతం నిర్మాణ రంగంలో వున్నారు. కవిత్వం, కథ, విమర్శ, అనువాదాలలో కృషి చేస్తున్నారు. ఇప్పటివరకు 9 కవిత్వ పుస్తకాలు వెలువరించారు. 2024లో మార్జినోళ్ళు కథా సంపుటి వెలువరించారు. శ్రీనివాసం– కవిత్వ విశ్లేషణలు వెలువరించారు. కవిత్వ అనువాదంలో 4 పుస్తకాలు వచ్చాయి. ఈ సంవత్సరం మరికొన్ని అనువాదాలు రానున్నాయి.రచనలకు గాను పలు ప్రతిష్టాత్మకమైన అవార్డులు అందుకున్నారు.ప్రస్తుత నివాసం హైదరాబాద్.సెల్ : 9949429449
srinivasgoudpoet@gmail.com


6.

అతను ఇంకా రాలేదు,
కానీ, ఎర్రకన్ను కోయిల
తన జతను పిలుస్తుంటే..
కొమ్మలు సిరులు తొడిగి
బూరుగ చెట్టు పుష్పించే
సమయం వచ్చేసింది –

7.

అతను ఇంకా రాలేదు,
కానీ, కానుగ చెట్టు మొలకలని
మెత్తని ముద్దలా చేస్తే..
పొంగిన మరమరాలు లాగ
దాని చక్కదనం ఇనుమడించే
సమయం వచ్చేసింది –

8.

అతను ఇంకా రాలేదు,
కానీ, సిందూర చెట్టు కొమ్మలన్నీ
పూసిన పూలవంపులతో నిండి..
మా చలువ తోట మొత్తం
సుగంధాలు చిమ్మే
సమయం వచ్చేసింది –

9.

అతను ఇంకా రాలేదు,
కానీ, ఎర్రనిజ్వాల వలె మెరిసే
లేలేత చిగుళ్ళు తొడుగుతూ..
మామిడి కాండపు కొమ్మలన్నీ
కొత్త చివుళ్ళతో నిండిపోయే
సమయం వచ్చేసింది –

10.

అతను ఇంకా రాలేదు,
కానీ, ప్రియురాళ్ళన్ను తియ్యటి మాటలతో
ప్రియులు ఓదారుస్తున్నప్పుడు..
వేపచెట్టు జిలుగుపూత
జలజలా కురిసే
సమయం వచ్చేసింది –

# సంస్కృత లోకోక్తులు : బైబుల్ సామెతలు

సామెతలు ఒక జాతి చరిత్రకు, భాషా సంస్కృతుల ఔన్నత్యానికి ఆనవాళ్ళుగా కనబడతాయి. బహుముఖీనమైన, ,సంపద్వంతమైన మానవానుభవాల గాఢతకు ఆలవాలంగా నిలుస్తాయి. గ్రామీణ ప్రజల వ్యవహారంలోని నిసర్గ సౌందర్యగరిమ సామెతల్లో నిక్షిప్తమయివుంటుంది. పొట్ట పోడిస్తే ఆకలి పేగులుతప్ప అక్షరం ముక్కరాని నిరుపేద ప్రజలు సందర్భానుసారంగా ఇబ్బడిముబ్బడిగా సామెతలను ఉటంకిస్తూ చమత్కార సుందరంగా మాట్లాడుతుంటారు. ప్రతినిత్యం పొలాల్లో పరిశ్రమించే కూలిజనుల నోటి దగ్గర దోసిలి పడితే అచ్చమైన, సామెతలు, సజీవ పలుకుబడులు, నుడికారాలు జలజలా రాలిపడతాయి. అమూల్యమైన ఆ పదసంపదలకోసం నిఘంటువులు కూడా ఆవురావురుమంటూ నోళ్ళుతెరుస్తాయి. జానపద సాహిత్యాన్ని పరిశీలిస్తే సామెతలు లెక్కకు మిక్కిలిగా లభ్యమవుతాయి. జనవ్యవహారంలో అలవోకగా జాలువారే సామెతలను ఒడిసిపట్టుకొని కవులూ రచయితలు తమ రచనలకు కొత్త వన్నెలను ,పఠనీయతను సమకుర్చుకున్నారు. తిక్కనలాంటి మహాకవులతో పాటు, వేమన తదితర శతక కవుల కవితా పాదాలు కాలక్రమంలో సామెతలుగా, లోకోక్తులుగా ప్రసిద్ధికెక్కిన విషయం పరిశోధకులెరిగిన పరమ సత్యం. '' ఏభాష కైనా జవజీవాలు ఆభాషలోని సామెతలు జాతీయాలే. లోకశాస్త్ర కావ్యాది వీక్షణానికి సంక్షిప్త రూపం లోకోక్తి. లోకోక్తి, సామెత రెండూ ఒకటే. అనుభవమంతా రంగరించి పోతపోసిన మాట సామెత. సంభాషణలో సామెత కలిగించే ప్రభావం అత్యధికం'', (డా.నలిమెల భాస్కర్ రచించిన భారతీయ సామెతలు–తెలుగు మలయాళ సమానార్ధకాలు అనే పుస్తకానికి ముందుమాట) అన్నజూలూరి గౌరీశంకర్ మాటల్లో సామెతల విశిష్టత తేటతెల్లమవుతుంది. గోరంత విత్తనం మహావృక్షాన్నివాగ్దానం చేసినట్లుగా ఒక చిన్నసామెత అనంత జీవిత సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. అల్పాక్షర రమణీయతను అందిస్తుంది. సంభాషణ రసవంతం కావడానికి సామెతలు ఎంతగానో దోహదపడతాయి.

వైదిక, పౌరాణిక సాహిత్యంలోని అనేక సంస్కృత శ్లోకాల పాదాలు సూక్తులుగా, విస్తృతప్రాచుర్యంపొంది, లోకోక్తులుగా జనవ్యవహారలో స్థిరపడ్డాయి. ప్రాచీన కాలంలోని సంస్కృత లోకోక్తుల ప్రభావం తెలుగుసామెతల పై స్పష్టంగా కనిపిస్తుంది. పరస్పర విభిన్నమైన మతాల నేపథ్యం లోనుండి వెలువడినందువల్ల సంస్కృత సాహిత్యానికి, బైబుల్ సాహిత్యానికి మధ్య సహజంగానే ఎంతో తాత్త్విక అంతరం కనిపిస్తుంది. అయితే సంస్కృత లోకోక్తులను బైబుల్ సామెతలను తులనాత్మకంగా పరిశీలిస్తే ఎన్నో సారూప్యతలు కూడా కనిపిస్తాయి. వేదాలు, పురాణాల్లో ప్రస్తావించిన భావాలకు బైబుల్ ప్రవచనాలకు కొన్ని అంశాలలో చాలా దగ్గర సంబంధం ఉందని పిస్తుంది..మాట తీరు, జ్ఞాన స ముపార్జ న , మాన వ స oబ oధాలు, జీవ కారుణ్యం,వ్యక్తిత్వవికాసం, తదితర విశ్వజనీనఅంశాలలో సంస్కృతలోకోక్తులకు బైబుల్ సామెతలకు ఎన్నో పోలికలు కనిపిస్తాయి. ' ''మానవజీవితం ధర్మబద్ధంగాను నీతిబద్ధంగా ఉండాలన్న ఆకాంక్ష సంస్కృత లోకోక్తుల్లో కనిపిస్తుందని, సూక్తులు ఉన్మార్గ గాము లైనవారికి సన్మార్గాన్ని ఉపదేశించి వారిజీవితాలకొక దీప్తినికలిగిస్తాయని (సంస్కృత సూక్తిరత్నాకరం పేజి–3)ఆచార్య రవ్వాశ్రీహరి లోకోక్తుల ప్రయోజనాన్నితెలియజేశారు. ''జ్ఞానమును,ఉపదేశమును అభ్యసించుటకును, వివేకసల్లాపములను గ్రహించుటకును, నీతి న్యాయ యధార్ధతలననుసరించుటయందు బుద్ధికుశలత నిచ్చిఉపదేశమునొందుటకును, జ్ఞానములేనివానికి బుద్ధికలిగించుటకును, యౌవనులకు తెలివియు వివేచనయు పుట్టించుటకును తగినసామెతలు'' (పరిశుద్ధ గ్రంథం పేజి .531)అని పరిశుద్ధగ్రంథం బైబుల్ లో సామెతల లక్ష్యాలను వివరిచటంజరిగింది. సంస్కృత లోకోక్తుల, పరిశుద్ధగ్రంథసామెతల ఉమ్మడిలక్ష్యం మాత్రం జ్ఞానోపదేశం, నైతికప్రబోధం.

ఈ నాటి పోటీప్రపంచంలో భావవ్యక్తీకరణసామర్థ్యాల (communication skills) ఆవశ్యకత గురించి విస్తృతమైన చర్చ జరుగుతుంది.. '' నుడిదరే ముత్తిన హార దంతిర బేకు/ నుడిదరే స్ఫటికర సలాక యంతిర బేకు/ నుడిదరే మాణిక్యద దీప్తి యంతిర బేకు'' మాట్లాడితే ముత్యాలహారంకూర్చినట్లుగా, స్ఫటికపు సలాకలాగా,మాణిక్యకాంతిలాగా శివుడు మెచ్చుకొనేలాగా ఉండాలని బసవేశ్వరుడునిర్దేశించాడు.' చారో ఆలంపర్ హు మై ఛాయా హువా/మస్తనద్ హై మేరా ఫర్మాయాహువా''(ఉర్దూసాహిత్యం–సామలసదాశివ పేజి.79) మాట్లాడిన ప్రతిమాట ప్రామాణికంగా ఉండాలని ఉర్దూ కవి మీర్ ప్రతిపాదించాడు. మాటయొక్క తీరుతెన్నులకు సంబంధించిన విలువైన సమాచారం సంస్కృతసాహిత్యంలో లభ్యమవుతుంది. 'ఏకశబ్ద సమ్యక్ జ్ఞత సుప్రయుక్త స్వర్గలోకే కామదేనుర్భవతి'' ఒక మంచిమాట కామధేనువు లాగా కోరిన కోరికలునెరవేరుస్తుందని ప్రాచీన పండితులు పేర్కొన్నారు. సంస్కృత లోకోక్తులను బైబుల్ సామెతలను అధ్యయనం చేస్తే ఎలామాట్లాడాలో,ఎలా మాట్లాడకూడదో అవగతమవుతుంది.



డా.కోయికోటేశ్వరరావు,
9440480274

వాక్పారుష్యం 'ఉగ్రమ్ వచోఅపావదీత్' కఠినమైన వాక్కులను త్యజించాలని యజుర్వేదం శాశిస్తుంది. ''పెదవులనుండి కఠినమైన మాటలు రానీయకుము''(సామెతలు4–24) అని పరిశుద్ధగ్రంథం ఉద్బోధిస్తుంది. వాక్పారుష్యం వాంఛనీయంకాదని తద్వారాఎన్నో అనర్ధాలు కలుగుతాయనే భావన ఈ లోకోక్తిలో సామెత లో వ్యక్తమవుతుంది.

సత్య వాక్యం సత్య సంభాషణ సర్వ ఆమోదకరం. సూనృతవాక్యం గొప్పతనాన్నినన్నయాది కవులు సమున్నతంగా చాటిచెప్పారు. అనేక సంస్కృత లోకోక్తుల్లో సత్యవాక్కుగరిమను ప్రముఖంగా విశదపరిచారు .' సత్యమ్ బ్రూయాత్ ప్రియమ్ బ్రూయాత్' ,' సత్యవక్ష్యామి నానృతం' (అధర్వణవేదం) , 'సత్యపూతామ్ వాదేద్వాచాం' , 'సత్యమేవజయతే నానృతం' తదితర లోకోక్తుల్లో సత్యమే పలకాలని, ప్రియంగా మాట్లాడాలని, అసత్యం అంతరిస్తుందని లోకోక్తుల్లో పండితులు సూచించారు. ''నా పెదవులు యధార్థమైన మాటలు పలుకును. నానోరు సత్యమైన మాటలు పలుకును'(సామెతలు 8–6) 'నిజమాడుపెదవులు నిత్యము స్థిరమై యుండును. అబద్ధమాడు నాలుక క్షణమాత్రమేయుండును' (సామెతలు 12–19) ఇత్యాది బైబుల్ సామెతల తత్త్వం సంస్కృత లోకోక్తులకు అత్యంత సామీప్యంగా దర్శనమిస్తుంది.

సంక్షిప్త సంభాషణ ' అల్పా క్షరమణీయం నీయం యః కథయతి సఖలువాగ్మి' సంక్షిప్తంగా, సౌందర్యశోభితంగా మాట్లాడేవాడే నిజమైన వక్త. 'మితముగా మాటలాడువాడు తెలివికలవాడు(సామెతలు 17–27), '' విస్తారమైన మాటలలో దోషముండక మానదు. తనపెదవులను మూసుకొనువాడు బుద్ధిమంతుడు'( సామెతలు10–19)ఈ సామెతల్లోని భావము పైనపేర్కొన్నసంస్కృతలోకోక్తులకు అనువాదమా అన్నట్లుగాఉంది.

సందర్భోచితసంభాషణ సందర్భానుసారంగామాట్లాడటం ఒక కళ.అసందర్భప్రేలాపనలు హాని చేస్తాయి. ''ప్రస్తావసదృశంవాక్యం, కుర్వాణోనవినశ్యతి'' సమయానికి తగినవిధంగా మాట్లాడే వాడు ఎన్నటికీ చెడిపోడు. ఈఅభిప్రాయాన్ని పరిశుద్ధగ్రంథం కూడా నొక్కి వక్కాణిస్తుంది. ''సమయోచితముగా పలుకబడిన మాట వెండిపళ్ళెంలో ఉంచబడిన బంగారుఫలమువంటిది(సామెతలు 25–12) నాలుకనాగరికతను నేర్పే గురువు . ఒక్కొక్కసారి నాలుకతీరు మూలంగా అనేక చిక్కులను మూటకట్టుకోవాల్సివస్తుంది.. ''బుద్ధిహీనుని నాలుక వానికి నాశనముతెచ్చును. వాని పెదవులు వానికి ఉరితెచ్చును'' (సామెతలు–18–7)అని బైబుల్ హెచ్చరిస్తుంటే, ''జిహ్వయామ్ మరణమ్ ధ్రువమ్'' కొండొకచో నాలుక వల్లమరణం సంభవిస్తుందని సంస్కృతలోకోక్తి హితవు చెబుతుంది. ''జిహ్వేయ అగ్రే మధు మే'' నా వాక్కుమధురంగా ఉండు గాక. ''జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ '' జిహ్వాగ్రంలో సంపద నిలిచి ఉంటుందని లోకోక్తులు తెలియజేస్తుంటే , ''సాత్వికమైన నాలుక జీవ వృక్షం'' (సామెతలు15–4) ''జ్ఞానుల నాలుక ఆరోగ్యదాయకము''(సామెతలు12–18) ఇంచుమించుగా ఇదే భావాన్ని బైబుల్ కూడావిశదపరుస్తుంది. నోటి నాలుకను భద్రం చేసుకొనువాడు శ్రమలనుండి తనప్రాణము కాపాడుకొనునని బైబుల్ సామెతలుఎరుకపరుస్తున్నాయి.

ఉన్నతమైన భావవ్యక్తీకరణ నైపుణ్యాల గురించి,మాటతీరు వల్ల కలిగే లాభనష్టాలగురించి, మాటల తీరుతెన్నులను గురించి సంస్కృత లోకోక్తుల్లో బైబుల్ సామెతల్లో చాలా వరకు ఏకీభావం కనిపిస్తుంది.

జ్ఞానసముపార్జనాప్రాముఖ్యత గురించి సంస్కృత సాహిత్యం విశేషంగాచాటిచెప్పింది. మిగతా భాషా సాహిత్యాల్లో కూడా జ్ఞాన ఆవశ్యకతను విస్తృతంగాప్రస్తావించడం కనబడుతుంది. ''జ్ఞానం ముత్యములకన్నాశ్రేష్ఠమైనది'' (8–11) అని బైబుల్ సామెత. ''జ్ఞానాయ కృత్యం పరమం క్రియాభ్యః'' జ్ఞానార్జనకోసం చేసే ప్రతిపని పనులన్నింటిలో శ్రేష్టమైనదని సంస్కృత లోకోక్తి.ఈరెండు అభిప్రాయాలకు ఎంతో దగ్గరతనంకనబడుతుంది.

''విశ్వావసూని దాశుషేవ్యానశు'' దానం చేసే గుణం ఉన్నవారికి సకలసంపదలు లభిస్తాయి. ''ఔదార్యంకలవారుపుష్టినొందుదురు.నీళ్ళుపోయువానికినీళ్ళు పోయబడును''(సామెతలు11–25) దానగుణం ,పరోపకార దృష్టిలో కూడా సంస్కృత సాహిత్యానికి బైబుల్ సామెతలకు పరస్పర పోలికకలున్నాయి. వివిధ అంశాలలోఈ క్రింది విధంగా ఎన్నో సామీప్యతలను గమనించవచ్చు.

సంస్కృతలోకోక్తి – ''సంతోష ఏవ పురుషస్య పరమ్ విధానం (సంతోషమే మానవునునికి సంతృప్తికరమైన మూలధనం.)

బైబుల్ సామెత – సంతోషము గల మనస్సు ఆరోగ్య కారణము (18–22)

సంస్కృతలోకోక్తి – ''క్షిప్ర మక్రియా మాణస్య, కాలః పిబతి సంపదః'(పనిలోఅలసత్వం చూపితే కాలమే సిరులను హరిస్తుంది)

బైబుల్ సామెత– పనిలో జాగుచేయువాడు నష్టము చేయువానికి సోదరుడు (18–9)

సంస్కృతలోకోక్తి– ''యోజనానామ్ సహస్రాణి ,యాతిగచ్ఛతిపీపీలకా ( నిరంతర ప్రయత్నం ద్వారా చీమ వేయి ఆమడలనైనా అవలీలగా ప్రయాణిస్తుంది)

బైబుల్ సామెత – సోమరీ చీమలవద్దకు పోమ్ము .వాటినడతనుకనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము (6–6)

సంస్కృతలోకోక్తి– క్షుధాతురాణం నరుచిర్నపక్వం (ఆకలితోఉన్నవారు రుచిఉన్నదీ లేనిదీ,ఉడికింది లేనిదీ పట్టించుకోరు)

బైబుల్ సామెత – ఆకలిగొన్నవానికి చేదువస్తువైనను తీయగానుండును(27–8)

సంస్కృతలోకోక్తి– మూర్ఖస్యనాస్తౌషధం(మూర్ఖుని సరిచేయటానికి ఏమందులేదు)

బైబుల్ సామెత – మూర్ఖునితలను రోట్లో వేసి దంచినా అతను మారడు.

ఈ విధంగా సంస్కృత లోకోక్తులను, పరిశుద్ధగ్రంథంలోని సామెతలను తులనాత్మకంగా పరిశీలిస్తే ఎన్నోఅంశాల పట్ల ఏకీభావం దర్శనమిస్తుంది.అమ్మ ఎవరికైనా అమ్మే అయినట్లుగా విశ్వజనీనభావాలు కూడా కాలానికతీతంగా,మతాలకతీతంగా ఒకేరకంగా ఉంటాయన్న పరామసత్యం అవగతమవుతుంది .విభిన్న భాషల్లోని లోకోక్తులను,సామెతలను తులనాత్మకంగా అధ్యయనం చేస్తే వైవిధ్యభరితమైన ఉత్తమ జీవనవిలువలను, సామాజికసేవా దృష్టిని, సమున్నత సంస్కారతత్వాన్ని సమకూర్చుకోవచ్చు.


ఉపయుక్త గ్రంథాలు. 1 సంస్కృత సూక్తి రత్నాకరం – ఆచార్య రవ్వా శ్రీహరి

2 పరిశుద్ధగ్రంథం బైబుల్


3 సంస్కృత సూక్తి సౌరభం – విద్వాన్ తెన్నేటి

4 మంచిమాట– సూర్యప్రసాదరావు


# అనువాదవాదం

**అనువాదాల గురించి మీరు ఏమనుకుంటున్నారు? అనువాదం చేసేవారికి అవి 'సగం పాత్ర'మాత్రమే ఉన్న రచనలా, లేక 'పూర్తి పాత్ర' ఉన్న రచనలా, లేక 'రెట్టింపు పాత్ర' ఉన్న రచనలా?**

జవాబు సంగతి సరే, ఈ ప్రశ్నలే తికమకగా ఉన్నాయనుకుంటున్నారా? అయితే కాస్త వివరిస్తాను చూడండి.



కల్లూరి భాస్కరం
ప్రముఖ పరిశోధకుడు,
విశ్లేషకుడు, జర్నలిస్టు

ముందుగా 'సగం పాత్ర' గురించి. మూలరచన ఎలాగూ సిద్ధంగా ఉంటుంది కనుక అనువాదకుడు చేయవలసిందల్లా దానిని ఇంకో భాషలోకి మార్చడమే. అంటే అతనిపై ఇతివృత్తాన్ని కూర్చుకోవడం, అందుకు తగిన శైలిని నిర్దేశించుకోవడం,మరీ ముఖ్యంగా నవల, కథ, కవిత్వం, నాటకం వగైరాలైతే పాత్రపోషణ, పదప్రయోగం, రసం, శిల్పం వగైరా సృజనకు సంబంధించిన అంశాల భారం ఉండదు కనుక, ఆ మేరకు అనువాదకునిది 'సగంపాత్రే' అనుకోవచ్చా?

రెండోది 'పూర్తి పాత్ర'. అనువాదకునిపై పైన చెప్పిన భారం ఉండదని అనిపించవచ్చు కానీ నిజంగా ఉండదంటారా? మూలరచయిత అన్నీ అమర్చిపెట్టాడు కనుక వేరే భాషలోకి వాటిని యథాతథంగా తీసుకురావడం అంత తేలికైన విషయమేమీకాదు. అనువాదకుడు వాటిని ఆకళించుకోవాలి. ఆకళించుకోవాలంటే వాటిలోకి తను పరకాయప్రవేశం చేయాలి. వాటిలో మూలరచయితతో సమానంగా తను జీవించాలి. చివరికి తనే మూలరచయితగా కూడా మారాలి. ఆవిధంగా అతనిది అనువాదకునిగా, మూలరచయితగా ద్విపాత్రాభినయం అవుతుంది. అందులో మూలరచయితలో, అనగా స్వతంత్రరచయితలో లేని అదనపు శ్రమ, అంటే రెట్టింపు శ్రమ ఉంటుంది. కాదంటారా?


ఇలా చివరికి మూడవదైన 'రెట్టింపు పాత్ర' దగ్గరికి వచ్చాం. అనువాదం కన్నా స్వతంత్రరచన గొప్పదే, నిజమే. కానీ మరోకోణంలో చూసినప్పుడు అనువాదం కూడా అంత తేలిగ్గా తీసుకోవలసినదేమీకాదు. స్వతంత్రరచనలో సృజన ఎక్కువ పాత్ర వహిస్తే అనువాదంలో శ్రమ ఎక్కువ పాత్ర వహిస్తుంది. స్వతంత్రరచయితకు స్వేచ్ఛగా రాసుకునే సౌలభ్యమే ఉంటుంది తప్ప, అనువాదకుడికి ఉన్నట్టు ఇంకొకరి అడుగులో అడుగువేసి నడిచి ఒప్పించవలసిన నిర్బంధాలేవీ ఉండవు. అనువాదకుడిలా ఇంకొకరి సృజనశక్తులలోకి పరకాయప్రవేశం చేయాల్సిన అవసరముండదు. ఆవిధంగా స్వతంత్రరచన ఏకకర్తృకం. అనువాదం ద్వికర్తృకం. అందులో మూల రచయిత, అనువాదకుడు అనే ఇద్దరు కర్తలు ఉంటారు.

ఏమంటారు?!


వుదయం

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1–7–25/5, Risalagadda, RTC X Roads, Hyderabad – 500020


# మరణం ఆయన చివరి చరణం కాదు



అలిశెట్టి అనగానే అందరికి ఎక్కువగా గుర్తుకు వచ్చే కవితలు 'సిటీ లైఫ్'. వీటిని ఎందుకు రాసాడో అతని మాటల్లో ''ధ్వంసమైపోతున్న సమస్త మానవ విలువల్నీ, హింసా రాజకీయాల్ని నిరసించడంతో పాటు నిప్పు కణికల్లాంటి, కన్నీటి గుళికలు ప్రతిరోజు ఆంధ్ర జ్యోతి పాఠకులకు అందించే చిన్న చిన్న కవితలు'' అని ముందుమాటలో చెప్పుకున్నాడు.

### విప్లవాల పురిటిగడ్డ

జగిత్యాలలో 1954 జనవరి 12 న అక్షర సూరీడు అలిశెట్టి తనకు తెలియని ప్రపంచంలోకి అడుగు పెట్టాడు. తండ్రి చిన్నప్పుడే చనిపోతే పెద్ద కుటుంబ భారాన్ని మోస్తూ, జీవనోపాధికి జగిత్యాలలో పూర్ణిమ ఫోటో స్టూడియో ప్రారంభించాడు. పెన్సిల్ తో గీతలు గీయడం అబ్బిన కళను, స్నేహితుల కవితలకు సరిపోయే

అభ్యాసంగా మారింది.1975లో పరిష్కారం పేరుతో అలిశెట్టి రాసిన కవిత తొలిసారి ఆంధ్ర సచిత్రవారపత్రికలో ప్రచురితం అయింది. విప్లవ చరిత్రలో మైలు రాయిగా ఉన్న 1978 జగిత్యాల జైత్రయాత్ర ప్రభాకర్ హృదయాంతరాలలో నిక్షిప్తం అయి ఉన్న కవితావేశాన్ని తట్టి లేపి, దిశానిర్దేశం చేసింది. ఇక ఆయన వెను తిరిగి చూసుకోలేదు. అక్షరాలతోనే సమర శంఖాన్ని పూరించి, చిన్న చిన్న పదాలతో అద్భుత విన్యాసాలు చేయిస్తూ, అన్ని సామాజిక రుగ్మతలను స్పృశిస్తూ, తెలుగు వచన కవితా ఉద్యమ కొత్త బాటకు మార్గ నిర్దేశం చేశాడు.

ప్రభుత్వాలు, పోలీసులు, భూస్వాముల తో వెగలేక, కరీంనగర్ కు తరలి వెళ్ళి, శిల్పి స్టూడియో నిర్వహించాడు.

1982లో భార్య,ఇద్దరు పిల్లలతో కరీంనగర్ నుంచి హైదరాబాద్ కు మకాం మార్చాడు. అక్కడే స్థిరపడ్డారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్ళ పాటు సీరియల్గా సిటీ లైఫ్ పేరుతో హైదరాబాద్ నగరంపై మినీ కవిత్వం రాశాడు. హైదరాబాదీలు మాట్లాడే మాటల్నే వాడుతూ కవితలుగా ఎక్కుపెట్టాడు. ఆరుసంవత్సరాల

మామూలుగా కవులు అక్షరాలను అద్దితే, అలిశెట్టి కవితకు తన చెమటను, ఆపై రక్తాన్ని అద్దాడు. ఊపిరిని ఫణంగా పెట్టి అక్షరానికి ప్రాణ ప్రతిష్ట చేశాడు. సామాజిక సమస్యలపై కలంతో పోరాడి, తన పోరాట మాధ్యమం కవిత్వమే అని భావించి, కెమెరా కన్ను...కుంచె గన్ను...కవాతు పెన్నుల ఏకీకరణతో, కవిత కోసమే బతికాడు. కవిత కోసమే ప్రాణాలిచ్చాడు.

తను శవమై../ఒకరికి వశమై.../తనువు పుండై.../ఒకడికి పండై../ఎప్పుడూ ఎడారై.../ఎందరికో ఒయాసిస్సై..'లో ఉన్నవి మొత్తం పన్నెండు పదాలే. సెక్స్ వర్కర్ల దయనీయ స్థితి గురించి రాసిన అలిశెట్టి కవిత అల్ప పదాలలో అనల్ప భావాలను అద్దుకుని, సుప్రసిద్ధమైనది. వేశ్యల గురించి ప్రస్తావన వచ్చిన అనేక సందర్భాలలో అనేక మందిచే ఉదహరింపబడిన కవిత. హృదయ త్రాసు కవిత ఆయనకు కవిగా మంచి పేరు తెచ్చినదే.

ఉదహరింపు కవితలో ... ప్రతిభలేకపోతే జీవితం వ్యర్థం అని, సాధన చేస్తేనే బండ శిల్పంగా మారుతుందని, కాలానికి వదిలే

పుదు/ఊరంతా పాలేర్లే/ వాళ్ళే/ఊరినించి తరిమికొడితే/నీ బ్రతుకంతా పల్లేర్లే''/అంటూ భూస్వాములను హెచ్చరించడం, అలాగే..''పుస్తకం లోంచి దులిపేసిన అక్షరాల్లా లక్షకి లక్షలు దేశమంతా నిరుద్యోగులై నిండుకున్నారు'' అంటూ నిరుద్యోగం గురించి, తన కవిత్వంలో ముక్కు సూటిగా, పదునుగా, ఘాటుగా, విమర్శించిన భావావేశపు తీరు తెలుగులో`కవిత్వంలో బహు అరుదు.

'''జలగాలు' 'బ్రహ్మ'జెముళ్ళూ/అవకాశవాది 'రూలుకర్రా' 'ఆరణాల కూలీ'/ 'పునాది'లేని 'భవనం' నాచారం 'సన్యాసులూ అంతర్గత కలహాలు, తరుచూ సీఎంల మార్పులు...

ముఖ్యమంత్రులు ఎవరైనా,/అక్షరాలా అరాచకంలో మార్పుండదు'' అని చెపుతూ, కాసు, జలగం, అంజయ్య, భవనం, చెన్నారెడ్డి, ఎన్టీఆర్, నాదెండ్ల ఇలా ఆనాటి ముఖ్యమంత్రుల తీరు పైనా పెన్నును గురి పెట్టాడు.1978లో ప్రకటించిన తొలి కవితా సంకనం 'ఎర్రపావురాలు' లో

''నా గుప్పిట్లో/ మందుతున్న/ఎన్నో గుండెలు .../

రూప మృత్యువు, పభుత్వం సొమ్ము ముట్టననే భీష్మ ప్రతిజ్ఞ కారణంగా, ప్రభుత్వ దావాఖానా మందులు కూడా ముట్టని మొండితనం, వెరసి ఫణంగా పెట్టిన జీవితంలో అలిశెట్టి ఓడిపోయాడు. మృత్యువుకు లొంగి పోయాడు. మరణం నా చివరి చరణం కాదని ప్రకటించిన ప్రభాకర్...కబళించే మృత్యువును ముందే గుర్తించాడు. తెర వెనక లీలగా మృత్యువు కదలాడినట్టు. తెరలు తెరలుగా దగ్గొస్తుంది..తెగిన తీగెలు సవరించడాని కన్నట్టు గబగబా పరిగెత్తుకొచ్చి నా భాగ్యం గ్లాసెడు నీళ్లందిస్తుందని పర్సనల్ పోయెం అనే కవితలో రాసుకున్నాడు. మృత్యువు తన చేతుల్లోకి తీసుకొన్న రోజు కూడా అక్షరాలకు జీవం పోస్తూ, అలిశెట్టి 1993 జనవరి 12 న హైదరాబాద్ లో నిర్జీవుడు అయినాడు.

సమాజ మార్పుని ఆకాంక్షిస్తూ పేదరికానికి బలైన కవి. 'మరణం నా చివరి చరణం' కాదని, సమరమే తన అంతిమ చిరునామా అని ప్రకటించాడు. అందుకేనేమో ఈ అరుదైన కవి అలిశెట్టి పుట్టిన, గిట్టిన తేదీలు ఒకటే అయి, మళ్లీ మళ్లీ పుడుతూ సమాజ పరిస్థితులపై తాను రాసిన కవితల ద్వారా సమరం సాగిస్తూనే ఉన్నాడు.మరణానంతరం కూడా అలిశెట్టి ఆశించినట్లు, అయన భౌతికంగా వదిలి వెళ్ళిన కళాక్షరాలు ఆయనను సజీవంగా ఉంచుతున్నాయి. ఎందరికో మార్గ దర్శనం చేస్తూ, అలిశెట్టి ప్రభాకర్ ఆశయాలకు రూపాలుగా సాగుతూనే ఉన్నాయి. అందుకే అలిశెట్టి మరణం ఆయన చివరి చరణం కాదు.

# ట్రాన్స్ఫార్మర్ చెడిపోయి అంధకారంలో ఉన్న కాలనీవాసులు

**చెడిపోయిన ట్రాన్స్ఫారం తొలగించి కొత్త ట్రాన్స్ఫారం బిగిస్తున్న దృశ్యం**



**వుదయం అందోల్ :**
మెదక్ జిల్లా అల్లాదుర్గంలో ట్రాన్స్ఫార్మర్ చెడిపోవడం ద్వారా రాత్రంతా అంధకారంలో ఉన్న కాలనీవాసులు శనివారం మధ్యాహ్నం నుండి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి రాత్రి మొత్తం చీకట్లోనే గడిపారు.రాత్రికి తినడానికి మొత్తం విద్యుత్ లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు.అనంతరం కాలనీవాసులు ఏఈ లేని ఫోన్లో సంప్రదించగా కరెంట్ లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నట్లు వారికి తెలిపారు.దానితో లైన్ మెన్ ని ఆపరేటర్లను అంతరాయం జరిగిన చోట వెళ్లి చూడాలని ఆదేశించారు.దాంతో చేరుకున్న సిబ్బంది విద్యుత్ సరఫరా ఎక్కడ అంతరాయం లభించకపోవడంతో ఆదివారం కొత్త ట్రాన్స్ఫర్ ను ఏర్పాటు చేశారు.దానితో కాలనీ మొత్తం విద్యుత్ అందడంతో ఏఈ కృతజ్ఞతలు తెలిపారు.

# సమాజ అభివృద్ధిలో యువత ముందుండాలి



- **డివైఎఫ్ఐ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ**
- **నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి**

**వుదయం నాగర్ కర్నూల్ :**
సమాజ అభివృద్ధిలో యువత ముందుండాలని నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు ఆదివారం డివైఎఫ్ఐ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన మహనీయులను ఎల్లప్పుడు స్మరించుకోవాలని ఆయన తెలిపారు దేశం కోసం పనిచేసిన మహనీయుల ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని ఆయన అన్నారు భగత్ సింగ్ రాజు గురు సుకుదేవ్ స్వామి వివేకానంద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహాత్మా గాంధీ సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయుల ఆశయాలతో సమాజ అభివృద్ధిలో యువత ముందుండి చెడు వ్యసనాలకు యువత బానిసలు కావద్దని ఆయన అన్నారు మహనీయుల చిత్రాలతో సూక్తులతో డివైఎఫ్ఐ క్యాలెండర్ రూపొందించడం అభినందించారు భవిష్యత్తులో డివైఎఫ్ఐ యువజన సంఘం సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కుర్మయ్య, ఆంజనేయులు, నాగలక్ష్మి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు


# వనస్థలిపురం క్యాంప్ కార్యాలయంలో మధు యాస్కి గౌడ్‌తో మర్యాద భేటీ



ఈరోజు ఉదయం బి.ఎన్.రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ గారు మరియు యువ నాయకులు మనీష్ గౌడ్ గారు టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మాజీ పార్లమెంట్ సభ్యులు మరియు ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ మధు యాస్కి గౌడ్ గారిని వనస్థలిపురం క్యాంప్ కార్యలయంనందు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలపడం జరిగింది...ఈ సందర్భంలో ఉమేష్ గౌడ్, ప్రమీల, సరస్వతి, గణపతి తదితరులున్నారు...



# గ్రేటర్ హైదరాబాద్



# పీర్జాదిగూడలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

- **ముగ్గులను సందర్శించిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**
- **విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**

**- వుదయం ,మేడిపల్లి:**





సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జి హెచ్ ఎం సి పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడలో బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. రంగు రంగుల ముగ్గులతో ప్రాంతం పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈ ముగ్గుల పోటీలను మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి సందర్శించి పాల్గొన్న మహిళలను అభినందించారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...**
సంక్రాంతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లోని కళాత్మకతను ప్రోత్సహించడంతో పాటు, ప్రజల్లో పండుగ ఉత్సాహాన్ని మరింత పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలతో రూపొందించిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు.


**మొదటి బహుమతి ₹10,000 నగదు – ఆనంత లక్ష్మి, ప్రసన్న**
**- రెండవ బహుమతి ₹6,000 నగదు – సంధ్య, సరిత**
**మూడవ బహుమతి ₹3,000 నగదు – జి. లక్ష్మి, నిహారిక**

ఈ బహుమతులను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి చేతులమీదుగా విజేతలు అందుకున్నారు. అలాగే 10 మందికి ₹1,000/ కన్సలేషన్ బహుమతులు, మరో 20 మందికి ఐటీసీ సంస్థ ద్వారా ప్రత్యేక బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇలాంటి అవకాశం కల్పించిన నాయకులకు, నిర్వాహకులకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాదవి, రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, అలాగే శ్యామల సాయిలు, శ్రీనివాస్ రెడ్డి, శ్యామల శ్రీనివాస్, ఆంజనేయులు, బాలరాజు, జగన్ రెడ్డి, యాసారం శ్రీనివాస్, మునుకుంట్ల కిరణ్ గౌడ్, పాశం నరేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సతీష్ గౌడ్, అశోక్, శేఖర్, ప్రవీణ్ రెడ్డి, బుల్లెట్ శంకర్, ఉపేందర్, వరికల శ్రీనివాస్, కిరణ్ నాయక్, జిలాని పాషా, పింగళి జోగిరెడ్డి, అమర్ పటేల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో మంట పుట్టిస్తున్న దోమకాటు

- **చీకటి పడగానే చలి గజగజ దోమల భజ భజ**
- **నామమాత్రంగానే స్ప్రేయింగ్, ఫాగింగ్**
- **దోమలకు ఆవాసంగా మారిన పీర్జాదిగూడ చెరువులోని గుర్రపు డెక్క**
- **దోమ కాటుతో విష జ్వరాల పాలవుతున్న ప్రజలు**
- **నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్న అధికారుల శైలి**

**వుదయం మేడిపల్లి :**





సాయంత్రం కాగానే పీర్జాదిగూడ డివిజన్ ప్రజలు చలితో పాటు దోమలతో పెద్ద యుద్ధమే చేస్తున్నారు,రాత్రి వేళల్లో దోమల బాధ తట్టుకోలేక ఇంట్లో ఫ్యాన్ వేసుకొందామంటే విపరీతమైన చలి ,అటు చలితో ఇటు దోమలతో డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా పీర్జాదిగూడ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అధికారులు మాత్రం నామమాత్రంగానే ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు, అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర అసహనానికి లోనై,దోమ కాటు వల్ల విష జ్వరాలు ప్రబలుతున్నాయని, వెంటనే చెరువు లోని గుర్రపు డెక్కని తొలగించి తమకు దోమలనుండి విముక్తి కల్పించాలని జి హెచ్ ఎం సి అధికారులకు తమ ఆవేదన తెలిజేస్తున్నారు.దోమల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నాము బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజబోడుప్పల్ సర్కిల్ లో దోమల నివారణకు అధికార యంత్రాంగం గట్టి చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ కమీషనర్ శైలజ తెలిపారు. దోమల నివారణకు సాయంత్రం వేళల్లో డివిజన్ల వారిగా ఫాగింగ్ చేస్తున్నామని,పీర్జాదిగూడ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క దోమలవ్యాప్తికి ప్రధాన కారణమని అన్నారు, గుర్రపు డెక్క నిర్మూలనే లక్ష్యంగా చెరువులో స్ప్రెయింగ్ చేస్తున్నామని ,అతి త్వరలో ఉన్నతధికారుల అనుమతితో గుర్రపు డెక్కని తొలగించే పరికరాన్ని తీసుకొచ్చి దాని సహాయంతో గుర్రపు డెక్క తొలగించడంతో దోమల వ్యాప్తి చెందనీయకుండా శాశ్వత పరిష్కారం ఉంటుందని తెలిపారు.

# డిసిసి అధ్యక్షులుగా ప్రశాంత్ కుమార్ ప్రమాణ స్వీకారం

**వుదయం నారాయణపేట:**
నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా నియామ కం అయిన కె. ప్రశాంత్ కుమా ర్ రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు పట్టణ అధ్యక్షులు ఎండి. సలీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1.00 గంటలకు స్థానిక మెట్రో ఫంక్షన్ హాల్ లో జరిగే ప్రమాణ స్వీకార కార్య క్రమానికి ముఖ్య అతితులుగా రాష్ట్ర మంత్రి వాకి టి.శ్రీహరి,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, నియోజకవర్గ ఇంచార్జీలు ఏనుముల తిరుపతి రెడ్డి, కుంభం. శివ కుమార్ రెడ్డి లతో పాటు ఉమ్మడి జిల్లా డిసీసీ అధ్యక్షులు, గ్రంథాలయా చేర్మెన్లు, తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్ర మానికి జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలఅధ్యక్షులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అందరు కూడా పెద్ద హాజరై దిగ్వి జయం చేయాలని కోరారు.

# వాటర్ పైప్‌ను అందించిన ఐదో వార్డు సభ్యుడు షబ్బీర్

- **అన్ని దానాల కన్నా నీటి దానం మహా గొప్పది**



**వుదయం ఊర్కొండ :**
నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజుఉరుకొండ పేట గ్రామంలో ఐదో వార్డులో ప్రజలకు నీటి కొరతకు ఇబ్బంది ఉన్న తరుణంలో అదే వార్డులో ఉన్న జెట్ మోటర్ నుండి వాటర్ పైపును తీసుకొచ్చి ఆదివారం వార్డు ప్రజలకు అందజేసిన వార్డు సభ్యులు షబ్బీర్ . ఈ కార్యక్రమంలో ఐదవ వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

# శివ దీక్షా స్వాములకు అన్నప్రసాద పంపిణీ



- **నాగర్ కర్నూల్ ఆకారపు వంశీయుల సేవా తత్పరత**

**వుదయం నాగర్ కర్నూల్ :**
మహాశివరాత్రి 2026 ఫిబ్రవరి 15 పురస్కరించుకొని నాగర్ కర్నూల్ ప్రాంతంలో మండల, అర్ధ మండల శివ దీక్ష స్వీకరించిన శివ స్వాములకు నాగర్ కర్నూల్ ఆకారపు వంశీయులు వారి కుటుంబాలచే శివ దీక్ష స్వీకరించిన గురు స్వాములతో వండిన మడి అన్న ప్రసాదం ప్రతిరోజు ఆకారపు వారి శివాలయంలో స్వీకరించాలనీ ఆకారపు విశ్వనాథం ,ఆకారపు శ్రీనాథ్ లు కోరారు.నాగర్ కర్నూల్ లోని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా గల శివాలయంలో ప్రతిరోజు మధ్యాహ్నం శివ స్వాములకు అన్న ప్రసాదం వసతి ఏర్పాటు ఉన్నదని వారు తెలిపారు.ఈ ప్రాంతంలోని శివస్వాములు మడితో కూడిన అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని వారు కోరారు.ఆదివారం నాడు జరిగిన అన్నప్రసాద పంపిణీలో 110 మంది శివ స్వాములు వివిధ ప్రాంతాల నుండి వచ్చి స్వీకరించారని ఆకారపు శంకరయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆకారపు నరసింహస్వామి, సంధ్య, హవీష్,విశ్రాంతఉపాధ్యాయులు బి వేణుగోపాల్,శ్రీనివాస్ గుప్తా, ఓంకార్, రమణ శివ స్వాములు రాము,ఆంజనేయులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# జానో జాగో మహిళా విభాగం



- **రాష్ట్ర అధ్యక్షురాలిగా షేక్ తస్లీమా బేగం**

జానో జాగో సంఘం మహిళా విభాగం తెలంగాణ రాష్ట్ర అపాధ్యక్షురాలిగా షేక్ తస్లీమా బేగం నియమితులయ్యారు. ఈ మేరకు షేక్ తస్లీమా బేగంకు జానో జాగో సంఘం జాతీయ అధ్యక్షులు సయ్యద్ నిసార్ అహ్మద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా తంజీలూర్ రహమాన్ నోమాని ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జానో జాగో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఇమామ్ సాహెబ్,రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ ముంతాజ్, నాయకులు సాజిద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జానో జాగో సంఘం జాతీయ అధ్యక్షులు సయ్యద్ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ ఫాతిమా షేక్ స్ఫూర్తితో రాష్ట్రంలోని ముస్లిం మహిళలను రాజకీయ, విద్య, సామాజిక పరంగా చైతన్యం చేస్తామని, అందుకు తమ సంఘం మహిళా విభాగం పనిచేస్తుందని పేర్కొన్నారు. జానో జాగో సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా తంజీలూర్ రహమాన్ నోమాని మాట్లాడుతూ ముస్లిం మహిళల సమస్యలపై కూడా తమ సంఘం పనిచేస్తుందని అందుకే ప్రత్యేక మహిళా విభాగం ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు.

# సామాజిక సేవలతో సంతృప్తి



**వుదయం నాగర్ కర్నూల్ :**
సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ఎంతో సంతృప్తి లభిస్తుంది అని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వి 108 గవర్నర్ కల్మిచర్ల రమేష్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, మార్కెట్ చైర్మన్ సంజీవ్ యాదవ్ లు అన్నారు. ఆదివారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ కల్వకుర్తి, వాసవి క్లబ్ కల్వకుర్తి సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అన్నదానం చేశారు. వాసవి క్లబ్ గవర్నర్, లయన్స్ క్లబ్ కల్వకుర్తి చార్టర్ ప్రెసిడెంట్ కల్మచర్ల రమేష్ కుమారుడు సాయి తేజస్ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ అడుకు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే రైతుల ఆకలి తీర్చాలని సంకల్పంతో పాటు సామాజిక సేవలో భాగంగా అన్నదానం చేపట్టినట్టు తెలిపారు. మార్కెట్ యార్డ్ కొచ్చిన 400 మంది రైతులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు చిగుళ్ళపల్లి శ్రీధర్, బాదం హరీష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కల్వ హరికృష్ణ, చిదిరే శ్రీనివాస్, గుబ్బ కిషన్, దారముని గణేష్, గోవింద శ్రీనివాస్, అప్పాయిపల్లి శ్రీనివాస్, గుగ్గిళ్ళ శంకర్, పూరి రమేష్, బాదం రాఘవేందర్, పాలకూర్ల రవి గౌడ్, నీలా కోటేశ్వర్, పసుపుల రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

# రేణుక ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీ ఎంపిక



**వుదయం నారాయణపేట :**
జిల్లా కేంద్రంలోని సింగర్ బేస్ వీధిలో వెలసిన రేణుక ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీ ఆదివారం ఎంపిక చేశారు. ఈనెల 27 నుండి ప్రారంభం కానున్న జాతర ఉత్సవాల సందర్భంగా ఈ కమిటీని ఎంపిక చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా పోలేమోని గోవిందు రాజు, సభ్యులుగా గుట్టమీద నర్సింలు, తోట్ల భీమప్ప, జంగిటి నారాయణ, శేఖర్ గౌడ్, పోలేముని భీమప్ప, మొగులప్ప, కోనంగిరి హనుమంతు, కోస్గి వెంకటరెడ్డి, పోలేమోని వెంకటేష్, జంగిటి శ్రీనివాస్, లను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈనెల 27న జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాల అలంకరణతో ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ,పోలెమోని శ్రీనివాస్, రాజ్ కుమార్, పీ నర్సిరెడ్డి ఆలయ పూజారులు మహిళలు భజన మండలి భక్తులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి వైజ్ఞానిక సదస్సుకు ఎంపికైన యుక్తశ్రీ

- **ధరూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని యుక్తశ్రీ రాష్ట్ర స్థాయిలో జరిగిన వైజ్ఞానిక సదస్సులో ఇంత చిన్న వయస్సులో ఎంతో దూర దృష్టితో ఆలోచించి రైతులకు ఉపయోగపడే విదంగా స్మార్ట్ ఫార్మింగ్ ప్రాజెక్టును తయారుచేసి అత్యుత్తమ ప్రతిభను చాటుకున్న విధ్యాతినిని సన్మాణించిన సర్పంచ్.**



**వుదయం గద్వాల:**
జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రానికి చెందిన యుక్తశ్రీ అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో జరిగిన వైజ్ఞానిక సదస్సులో రైతులకు ఉపయోగపడే స్మార్ట్ ఫార్మింగ్ ప్రాజెక్టును తయారుచేసి ప్రదర్శించి అత్యుత్తమ ప్రతిభ చాటుకొని దరూరు మండలానికే గర్వకారణంగా నిలిచి జాతీయ స్థాయి వైజ్ఞానిక సదస్సుకు ఎంపికై జోగులాంబ గద్వాల జిల్లా రైతులకే కాక జాతీయ స్థాయిలో ఉన్న ప్రతీ రైతు గర్వించదగ్గ రైతు బిడ్డగా నిలవడం గర్వకారణమని దరూరు మండల సర్పంచ్ విజయ్ కుమార్ మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా ధరూర్ మండల పంచాయతీ సర్పంచ్ శ్రీ విజయకుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు వైజ్ఞానముపై ప్రతిభ చాటుకున్న యుక్తశ్రీను కన్న తల్లి దండ్రుల జీవితం ధన్యమైందని ఈ విద్యార్థిని ప్రతిభ వల్ల మిగతా విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవడమే కాక ఆదర్శవంతంగా నిలిచే విధంగా ప్రతీ విద్యార్థులు చదువుకొని వారి కుటుంబం గర్వించె విధంగా తయారై గ్రామానికే కాకుండా దేశము గర్వించదగ్గ విద్యార్థులుగా తయారవ్వాలని కోరుకుంటున్నానని చెప్పడం జరిగింది. ఈ అమ్మాయిని ఘనంగా సన్మానించి ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈదన్న, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి , భాస్కర్ రెడ్డి , చిరు , బాలరాజు , గోపాల్ రెడ్డి , వెంకటేశ్వర్ రెడ్డి , రాజు, రంగన్న , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బీజేపీ నేత ఎడ్ల రమేష్




- **కిష్టారెడ్డిపేట్ నూతన జీహెచ్ఎంసీ డివిజన్**

**వుదయం సంగారెడ్డి జిల్లా:**
కిష్టారెడ్డిపేట్‌ను నూతన (GHMC) డివిజన్గా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్ల రమేష్ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. అఖిలపక్ష నాయకులు చేపట్టిన ఈ దీక్షకు భారీగా ప్రజల మద్దతు లభిస్తుండగా, బీజేపీ తరఫున ఎడ్ల రమేష్ సంఘీభావం ప్రకటించడం గమనార్హంగా నిలిచింది., ప్రజలకు మౌలిక వసతులు సక్రమంగా అందించాలంటే కిష్టారెడ్డిపేట్‌ను ప్రత్యేక జీహెచ్ఎంసీ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత విభజన వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీస సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆయన అన్నారు. ప్రజల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిగణలోకి తీసుకొని కిష్టారెడ్డిపేట్‌ను నూతన డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు.ఈ రిలే నిరాహార దీక్షలో అఖిలపక్ష నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షను విజయవంతం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలి

- **బిజెపి శ్రేణులకు ఎంపీ అరుణ దిశా నిర్దేశం**

**వుదయం నారాయణపేట :**



మున్సిపల్ ఎన్నికల లో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ లను గెలుచుకుని బిజెపి సత్తా చాటాలని పాలమూరు ఎంపి డి కే.అరుణ బిజెపి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో సత్య యాదవ్ గెస్ట్ హౌస్ లో జరిగిన పుర ఎన్ని కల సన్నాహక సమావేశం జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ పాల్గొని మాట్లాడుతూ జిల్లా లోని ఏడు పురపాలక సంఘాలలో కార్యకర్తలందరూ కలి సికట్టుగా పనిచేసి భారతీయ జనతా పార్టీ జెండా ఎగుర వేయాలని అన్నా రు.అభ్యర్థులను వార్డు మెంబర్లుగా మున్సిపల్ చైర్మన్లగా గెలిపిస్తే అభివృద్ధికి అడుగులు వేసినట్టు ఉంటుందని అన్నారు.ప్రజలు చాలా శ్రద్ధగా ప్రధాని నరేంద్ర మోడీ పథకాలకు ఆకర్షింపబడి ఓటు వేయడానికి వారి సిద్ధంగా ఉన్నారని అన్నా రు.అందరూ కలిసి పనిచేసే వారి వారి ఆశీర్వాదాలు తీసుకొని పురపాలక సంఘ సభ్యులుగా చైర్మన్లుగా గెలిచి రావాలని పిలుపునిచ్చారు. గతంలో జరిగిన కొన్ని పొరపాట్లు ఈ ఎన్నికల్లో జరగ కుండా చూడాలని అన్నారు.ప్రతి వార్డులో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే పార్లమెంటు సభ్యురాలిగా ప్రధాని నరేంద్ర మోడీ నిధులను మీ మీ వార్డులలో మీ మీ నగరాలలో వరదలుగా పారి అభివృద్ధిచెందుతాయని అన్నారు. ఈ సమావేశంలో పురపాలక సంఘాల ఇన్చార్జులు కొత్త కాపు రతన్ పాండు రెడ్డి,బలరామిరెడ్డి భాస్కర్ అమర చింత ఆత్మకూర్లు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి,మద్దూర్ కోసిగి నాగుల పల్లి ప్రతాప్ రెడ్డి కొడంగల్ పున్నము చంద్ లాహోటి, కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ అదనపు న్యాయవాది నందు నామాజీ కృష్ణ చైతన్య జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యాంసుందర్ గౌడ్ ,జిల్లానాయకులు రఘు రామయ్య గౌడ్ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సత్య రఘుపాల్ రెడ్డి,పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్, మిర్చి వెంకటయ్య వెంకట రాములు బిల్డర్ మదన్ అడ్వకేట్ కర్నేస్వామి సుజాత కృష్ణ, జయమ్మ పాల్గొన్నారు.

# క్రీడలు దేహదారుఢ్యతను పెంపొందించేందుకు దోహదపడతాయి



**వుదయం,హైదరాబాద్:**
రాచూర్ సర్పంచ్ గున్నేళ్ల శ్రీనివాస్ మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో స్వర్గీయ కొంగల రాఘవేందర్ స్మారకార్థం వాలీబాల్ తాలు క స్థాయి టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ను సర్పంచ్ శ్రీని వాస్ మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు జర్న లిస్ట్ మల్లేష్ ముదిరాజ్ వార్డు సభ్యులు రమేష్ ముదిరాజ్ చంద్రశేఖర్ తదితరులు ప్రారంభిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ రాఘవేందర్ స్మారకార్థం యువకులు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వ హించడం అభినం దనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో క్రీడాకా రులు యువకులు ప్రేమ్ సాగర్ సురేందర్ గౌడ్ బాలకృష్ణ ప్రహ్లాద్ శ్రావణ్ కేశవులు జయరాం సాయి శివ గౌతమ్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మేడారానికి బారులు తీరిన భక్తులు



- కిక్కిరిసిన సమ్మక్క-సారలమ్మ గద్దెలు
- మధ్యాహ్నం వరకే మూడు లక్షల మంది రాక

మేడారం, జనవరి 11 (వుదయం ప్రతినిధి) : మేడారం మహా జాతర మరో 18 రోజులు ఉండగానే ఆదివారం భక్తజనం మేడారానికి పోటెత్తింది. శనివారం సాయంకాలం నాలుగు గంటల నుంచి భక్తజనం మేడారం వైపు పరుగులు పెట్టగా ఆదివారం తెల్ల వారుజామున మూడు గంటల నుండి వేలాది వాహనాలు మేడారం వైపు పరుగులు పెట్టాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకే మూడు లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించు కోవడానికి గద్దెల ప్రాంతంలో బారులు తీరారు. ఒకవైపు ఆరుగురు మంత్రులు మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడానికి వస్తున్న క్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాటు చేయగా జిల్లా యంత్రాంగం భక్తుల ఏర్పాటులో నిమగ్నమైంది.గోవిందరావుపేట మండలం బాసర గ్రామం నుంచి నార్లాపూర్ వరకు వాహనాలు నిలిచిపోకుండా పలు దారుల గుండా మేడారం వైపు భక్తులను తరలించడానికి చర్యలు తీసుకున్నారు. జంపన్న వాగు కు చేరుకున్న వాహనాలను గద్దెల ప్రాంతానికి నేరుగా వెళ్లకుండా పలు ప్రాంతాల ద్వారా తరలించారు. ఈ క్రమంలో భక్తులు అనేక ప్రయాసలకు గురై గద్దెల ప్రాంతానికి చేరుకున్నారు. గద్దెల ముందు దాదాపు కిలోమీటర్ వరకు భక్తజనం అమ్మవార్ల దర్శనం కోసం క్యూ లైన్ లో నిలబడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు సంక్రాంతి సెలవులు రావడంతో మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తండోపతండాలుగా భక్తులు మేడారం వైపు పరుగులు పెట్టారు.ఆదివారం ఉదయం 3 గంటల నుంచి ప్రారంభమైన దర్శనాలు సాయంత్రం మూడు గంటల వరకు యధావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. కాగా, జిల్లా కేంద్రానికి సమీపంలోని ములుగు గట్టమ్మ వద్ద భక్తుల సందడి నెలకొని ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో నుంచి పలు వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో వచ్చే భక్తులు గట్టమ్మ తల్లి వద్ద తలవంచందే ముందుకు సాగలేదు. దీంతో గట్టమ్మ తల్లి పరిసర ప్రాంతాలు భక్తులతో నిండిపోయింది. మేడారం, ఘట్టమ్మ తల్లి దేవాలయం వద్ద ఇసుక వేస్తే రాలనంత భక్తజనం నెలకొని ఉంది.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



(వుదయం జిల్లా ప్రతినిధి): మహాదేవపూర్ మండలంలోని బొమ్మాపూర్ గ్రామంలో సర్పంచ్ చీర్ల చంద్రశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ వెన్నపురెడ్డి సురేందర్ రెడ్డి,లు ఆదివారం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు గ్రామంలో ఇటీవల కుటుంబాన్ని పరామర్శించి తమ వంతు సహాయంగా రైస్ బ్యాగ్,తోపాటు ఆర్థిక సాయం అందజేశారు ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు సుద్దాల పృథ్వి, ముల్కల మనోహర్, గోసిక నగేష్ పీక బాపు, గుండు పోషయ్య, మర రవి, సకినాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి




వరంగల్ టౌన్, జనవరి 11 (వుదయం ప్రతినిధి) : వడ్డే ఓబన్న జయంతి పురస్కరించుకొని వరంగల్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారి కార్యాలయంలో "వడ్డే ఓబన్న" చిత్ర పటానికి పూలమాలలు వేసి వారి జయంతిని ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత, అధికారులు, సిబ్బంది, తెలంగాణ వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయోగ సామాగ్రికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

**డీఐఈఓ కార్యాలయంలో 16 లోగా సమర్పించాలి**

వరంగల్, జనవరి 11 (వుదయం జిల్లా ప్రతినిధి): వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఫిబ్రవరి 2 వ తేదీ నుండి నిర్వహించబోయే ప్రయోగ పరీక్షల నిమిత్తం జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ సామాగ్రి పంపిణీకి సీల్డ్ టెండర్లు/ కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలియజేసారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన జిల్లా ల్యాబ్ సామాగ్రి సమీకరణ కమిటీ ( డిస్ట్రిక్ట్ ల్యాబ్ ప్రొక్యూర్ మెంట్ కమిటీ ) ఆధ్వర్యంలో అర్హులైన ప్రయోగ సామాగ్రి పంపిణీదారుల నుండి సీల్డ్ టెండర్/ కొటేషన్ల దరఖాస్తులు ఆహ్వానించనైనది. నిర్ణిత షెడ్యూల్ ప్రకారం టెండర్/ సీల్డ్ కొటేషన్ దరఖాస్తుల అమ్మకం తేదీ 12 నుండి 16 వరకు (ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 3 గం ల వరకు), సీల్డ్ కొటేషన్ (బాక్సు) తెరిచే తేదీ : 17వ రోజు 4 గం.లకు ల్యాబ్ మెటీరియల్ బిడ్డర్ల చివరి ఎంపిక తేదీ 17 న నిర్ణయించబడింది. సంబంధిత పంపిణీదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు సంస్థ రిజిస్ట్రేషన్, జీఎస్టీ, ఆదాయం, వార్షిక టర్నోవర్ తదితర ధృవీకరణ పత్రాలు సమర్పించాలి. దరఖాస్తు ప్రక్రియ, తదితర వివరాల కొరకు ఇంటర్ విద్య కార్యాలయంలో సంప్రదించవలెను.


## భీమనాధుని సత్యనారాయణ ఎన్నిక అభినందనీయం



జయశంకర్ భూపాలపల్లి జనవరి 11(వుదయం జిల్లా ప్రతినిధి): పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భీమనాధుని సత్యనారాయణ ఎన్నిక అభినందనీయమని పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కీర్తి రాజమౌళి అన్నారు ఆదివారం పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కీర్తి రాజమౌళి ఆధ్వర్యంలో నాయకులు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భీమనాధని సత్యనారాయణ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా కీర్తి రాజమౌళి మాట్లాడుతూ ప్రజా సేవ భావం ఉన్న సామాజిక కార్యకర్త బీసీ సంఘం నాయకుడైన భీమనాధుని సత్యనారాయణ ఇటీవల జరిగిన పద్మశాలి జిల్లా సంఘం ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు సత్యనారాయణ ప్రజలకు అందించే సేవలను గుర్తించి బీసీ సంఘంతో పాటు జాతీయ చేనేత సంఘంలో పద్మశాలి సంఘంలో గౌరవంతో కూడిన పదవులు సత్యనారాయణకు దక్కాయ్ అని అన్నారు రానున్న కాలంలో ప్రజలకు సేవా అందిస్తూనే ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెయింటర్స్ అసోసియేషన్ భూపాలపల్లి కార్యదర్శి కాజీపేట నరేష్, తోపాటు గట్టయ్య, అక్కపల్లి సంపతు, తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుల కోసమే సామాజిక న్యాయ వేదిక

**క్యాలెండర్ ను ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు ఏషబోయిన సాంబయ్యయాదవ్**




హనుమకొండ, జనవరి 11 (వుదయం జిల్లా ప్రతినిధి) : హన్మకొండ ప్రెస్ క్లబ్ లో సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏషబోయిన సాంబయ్య యాదవ్ అధ్యక్షతన రాష్ట్ర, జిల్లా,జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాలెండర్ ను సామాజిక న్యాయ వేదిక అధ్యక్షులు డాక్టర్ భగీరథ్ తో కలిసి ఆవిష్కరణ చేశారు డాక్టర్. భగీరథ్ మాట్లాడుతూ వైద్యం లోనుసామాజిక న్యాయం జరుగాలన్నారు. ఆరోగ్యశ్రీ లో దీర్ఘకాల రోగులను కూడా చేర్చి న్యాయం చేయాలని డాక్టర్ భగీరథ్ తెలిపారు. ప్రజా క్షేమం కోసం పాలన చేస్తున్న ప్రభుత్వంలో అట్టడుగు వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరుగాలని కోరారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఏష బోయిన సాంబయ్య యాదవ్ రాష్ట్ర ప్రధాన సలహాదారు కొమ్మినేని భూపాల్ రావు జాతీయ నాయకులు సికెఎం కాలేజి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మండల సాంబయ్య ఎంఆర్ పి ఎస్ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్ మాదిగ వడ్డెర న్యాయ వేదిక జాతీయ అధ్యక్షులు ఆలకుంట్ల ఎల్లన్న వడ్డెర సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చల్లా లింగయ్య. గట్ల రాజన్న పద్మశాలి న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మార్గం ఎల్లయ్య వడ్డెర న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు టి. వీరబాబు పెరిక కుల న్యాయ వేదిక నాయకులు అచ్చ వినోద్ కుమార్ న్యాయ వేదిక వరంగల్ జిల్లా అధ్యక్షులు సంగ వెంకట్రజం హన్మకొండ జిల్లా అధ్యక్షులు దామెరుప్పుల శంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు జున్ను సదయ్య యాదవ్ దేవన బోయిన కుమార్ యాదవ్ గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు జున్ను సదానందం యాదవ్ కోరే రవి యాదవ్ లంబాడి న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు దేవా రజక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ పరమానందం మహిళా నాయకురాలు పబ్బ ఉమా రాజేందర్ జోడుముంతల అనితా తడితర్నాయకులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ పెరేడ్ కి విష్ణు వర్ధన్ ఎంపిక



పరకాల (వుదయం ప్రతినిధి): సాధారణ గ్రామీణ కుటుంబంలో పుట్టి పెరిగిన కూస విష్ణు వర్ధన్ దేశ రాజధాని లో జరుగుతున్న గణతంత్ర పెరేడ్ సన్నద్ధ శిబిరానికి ఎంపిక కావడం అందరికీ గర్వ కారణంగామా ముఖ్యంగా ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగానూ ఉన్నదని ప్రో ఛాన్సలర్ ఆచార్య పి. రవీందర్ రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి లో మైసమ్మగూడా గ్రామంలో ని మల్లా రెడ్డి డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న విష్ణువర్ధన్ విశ్వవిద్యాలయంలోని జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) లో స్వచ్ఛంద కార్యకర్తగా చేరడం జరిగిందని వివిధ సందర్భాలలో ఎన్ ఎస్ ఎస్ వారు నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాడని అన్నారు.గణతంత్ర దినోత్సవ నాటి పెరేడ్ కి విష్ణు వర్ధన్ ఎంపిక కావాలని యాజమాన్యం సిబ్బంది విద్యార్థుల తరపున ఆచార్య రవీందర రెడ్డి ఆకాంక్షించారు..

వ్యవసాయాధారిత కుటుంబంలో కూస సుమలత, కూస జనార్దన్ ల సంతానంగా జన్మించి హనుమకొండ జిల్లా పరకాల మండలం పోచారం గ్రామం నుండి వచ్చి స్వశక్తి తో కష్టపడి మెకానికల్ ఇంజనీరింగ్ విద్యని అభ్యసిస్తున్న విష్ణువర్ధన్ ఎన్ ఎస్ ఎస్ సేవా కార్యక్రమాలలో సైతం అదే నిబద్ధత తో పాల్గొంటాడని ఎం ఆర్ డీ యూ లో ని ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డా॥ రాజా రెడ్డి అన్నారు. ఈ అంకిత భావం అతనిని గుజరాత్ రాష్ట్రం లో ని పటాన్ పట్టణం లో ని శ్రీ హేమచంద్ర ఆచార్య ఉత్తర గుజరాత్ విశ్వవిద్యాలయం లో గత అక్టోబర్ 31 నుండి నవంబర్ 9 వ తేదీ వరకు జరిగిన క్యాంపు లో తెలంగాణ రాష్ట్రం తరపున దేశ రాజధాని లో తదుపరి జరిగే క్యాంపుకి ఎంపిక అయ్యేలా చేసిందని అన్నారు.

## మున్నూరు కాపు ఎన్నిక ఏకగ్రీవం



ఖానాపురం, (వుదయం ప్రతినిధి): మండలంలోని బుధరావుపేట గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడు శేరి మధు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దూదిరెడ్డి ఉత్తయ్య తెలిపారు. గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా శేరి మధు, ఉప అధ్యక్షులు పసునూరి రమేష్, చెంచల కృష్ణ, ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి వెంకటేశ్వర్లు, సహాయకార్యదర్శులు రాగం తిరుపతి, వాసంశెట్టి వెంకటనారాయణ, కోశాధికారి పసునూరి సురేష్, కార్యవర్గ సభ్యులు శేరి రమేష్, సుంకరనేని నాగేశ్వర్ రావు, పసునూరి వెంకటేశ్వర్లు, పిల్లల రమేష్, పసునూరి రాములు, శేరి సంజీవ, తెడ్డు సంపత్, తూటి మధు, శేరి శ్రీనివాస్, ఉమ్మెటి యాదగిరిలను ఏకగ్రీవ ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్, మండల నాయకులు నాగిశెట్టి ప్రసాద్, మహాలక్ష్మి వెంకటనర్సయ్య, లింగని వెంకటేశ్వర్లు, ఉప్పు రాజు, లాదెల్ల ఎల్లయ్య, జల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

## సింహగర్జనకు తరలిన ఓసీలు




ఖానాపూరం, (వుదయం ప్రతినిధి): హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నిర్వహించే ఓసీల సింహగర్జన భారీ బహిరంగ సభకు మండలం నుండి భారీగా ఓసీలు సింహగర్జన బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఓసి బాధ్యులు మల్యాల పోశెట్టి, కుంచారపు వెంకట్ రెడ్డి, రెడ్డి నాగార్జున్ రెడ్డి, గుండా రామకృష్ణ, చూడి లింగారెడ్డి, దేవినేని వేణుకృష్ణ, వల్లభనేని కిరణ్, ఎడ్ల వీరారెడ్డి, కృష్ణమూర్తి, కొరిటల శ్రీనివాసరావు, గోగినేని శ్రీనివాసరావు, మన్నెం సాంబశివరావు, తుకాని సత్తి రెడ్డి, గర్నెపెల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మారని సింగరేణి కార్మికుల బ్రతుకులు

- ఇన్కమ్ టాక్స్ పేరుతో కార్మికుని నిలువు దోపిడి
- ఏ ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు చంద్రగిరి శంకర్



భూపాలపల్లి, వుదయం ప్రతినిధి: ప్రభుత్వలు మారిన సింగరేణి కార్మికుల బ్రతుకులు మారడం లేదని,ఇన్కమ్ టాక్స్ పేరుతో కార్మికుడిని నిలువు దోపిడి చేస్తున్నారని ఏఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు చంద్రగిరి శంకర్ అన్నారు.ఈ సందర్భంగా చంద్రగిరి శంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ దేశానికి వెలుగులు పంచే సింగరేణి ... ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికులకు జీవితాల్లో మాత్రం వెలుగులు నింపడం లేదని అన్నారు. ఇన్కమ్ టాక్స్ పేరుతో కార్మికులు సంవత్సర వేతనంలో నాలుగు నెలల వేతనం మొత్తం కూడా ఇన్కమ్ టాక్స్ రూపంలో కట్టడం జరుగుతుందని, సింగరేణి సంస్థ గత రెండు సంవత్సరాల నుండి సిఎంపిఎఫ్ చిట్టిలను కూడా ఇవ్వడం మానేసిందని, దీనివల్ల కార్మికుల గరిష్ట వేతనం నుండి ఎంత మొత్తంలో ఇన్కమ్ టాక్స్ మిగతా టాక్స్ లకు చెల్లిస్తున్నామో తెలియడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం అసెంబ్లీ లో ఇన్కమ్ టాక్స్ రద్దు పై బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదించి కేంద్రానికి పంపించిన ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం దానిపై చర్యలు తీసుకోలేదని అన్నారు. ఎక్కడ వేసినా గొంగడి అక్కడే ఉన్న చందంగా ఉన్నదని, ఇకనైనా కేంద్ర బీజేపీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు స్పందించి ఇన్కమ్ టాక్స్ రద్దుకై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

**సర్పంచి శ్రీదేవి సమ్మయ్య నాయక్**



రాయపర్తి వుదయం ప్రతినిధి:మండలం ,బాలు నాయక్ తండాలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించి,నూతన భోర్ మోటార్ నూ పాలకవర్గంతో కలిసిబాలు నాయక్ తండా సర్పంచ్ భూక్యా శ్రీదేవి సమ్మయ్య ప్రారంభించారు .ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీదేవి సమ్మయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రధానంగా త్రాగు నీళ్ల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడేవారు అని త్రాగు నీళ్ల సమస్యనూ పరిష్కారించ డానికి భోర్ మోటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు,ఎంమ్మెల్యే యశశ్విని ఝాన్సీ రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా అని తెలిపారు.ఈ కార్యక్రమంలో.. సెక్రెటరీ ఎం అనిల్,ఉప సర్పంచ్ బుక్య వీరన్న,గ్రామ పార్టీ జుమ్మిలాల్,కారోభారీ భూఖ్య వెంకటేష్, నాయకులు భూక్య సురేందర్,గుగులోత్ కళ్యాణ్బూక్య వెంకటేష్, భానోతు వీరన్న,బానోత్ రమేష్,బానోత్ యాకుబ్,గుగులోత్ యాకుబ్,గుగులోత్ లీగ్య, మహిళా నాయకులుకమలమ్మ,బుజ్జి,కావలి,కమిలి,ప్రియాంక పాల్గొన్నారు.

## బీసీలను బీసీలే చిల్లర గాళ్లు అనడం బాధాకరం



జయశంకర్ భూపాలపల్లి, (వుదయం జిల్లా ప్రతినిధి): బీసీలను బీసీలే చిల్లర గాళ్లు అని వ్యాఖ్యానించడం బాధాకరమని బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదు అని బీసీ నాయకుల ఆగ్రహం వ్యక్తం చేశారు ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రెస్ క్లబ్ ఆవరణలో వారు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు ఈసందర్బంగా బీసీ సంఘం కాటారం డివిజన్ అధ్యక్షుడు సముద్రాల తిరుపతి మాట్లాడుతూ బీసీలు ఎవ్వరు చిల్లర గాళ్లు కాదు బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదు అని ఘాటుగా హెచ్చరించారు కొంతమంది బీసీ నాయకులే బీసీలను చిల్లర గాళ్లు అని వ్యాఖ్యానించడం బాధాకరమని, ఇది బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇలాంటి మాటలు ప్రెస్ మీట్లలో మాట్లాడటం సరికాదని స్పష్టం చేశారు.ఈ ప్రాంతంలో ప్రాతినిధ్యం వహించే మంత్రి శ్రీధర్ బాబు నిజమైన బీసీలకు న్యాయం చేయాలని, ఇక్కడ ఉన్న బీసీలంతా ఆయన మాట కోసం సిద్ధంగా ఉన్నారని అన్నారు నిజమైన బీసీలకు న్యాయం చేయాలి, దొంగ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి సర్టిఫికెట్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేక్రమంలో బీసీ సంఘం నాయకుడు నాగుల సంతోష్ మాట్లాడుతూ కాళేశ్వరం లో గెలిచిన సర్పంచ్ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నల వర్షం కురిపించారు.నీ కుల ధ్రువీకరణ పత్రం హైకోర్టు జడ్జిమెంట్ ఆధారంగా తీసుకున్నానని అంటున్నావు, అయితే 2018లో అప్లై చేసినప్పుడు ఆ హైకోర్టు పత్రాలు ఎందుకు సమర్పించలేదు?అని అప్లికేషన్ పత్రాలు నా చేతిలో ఉన్నాయి అంటు పత్రాలను మీడియా ముందు చూపుతూ ప్రశ్నించారు సర్పంచ్, ఆయన సతీమణి ఇద్దరూ బీసీ గాండ్ల కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారని, మరి కాళేశ్వరంలో ఉన్న రెడ్డి కులస్తులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రస్థాయి పదవిలో ఉన్నా ఓ నాయకుడు ఇటీవల ఎవ్వరూ కొత్తగా కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోలేదు అన్న మాటలకు సమాధానం చెప్పాలని కోరారు.02 డిసెంబర్ 2025న రేగొండ మండలానికి చెందిన ఓ మహిళా కుల ధ్రువీకరణ తీసుకుని కాటారం మండలం గుండ్రాత్‌పల్లిలో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచింది నిజం కాదా? అని రేగొండ తహసీల్దార్ వీరిని రెడ్డి గాండ్ల కులస్తులని, దొంగతనంగా గాండ్ల కుల సర్టిఫికెట్ తీసుకున్నారని ప్రెస్ మీట్ లో చెప్పింది నిజం కాదా?అని రేగొండ పోలీస్ స్టేషన్ లో ఆ మహిళా సర్పంచ్ పై కేసు నమోదయింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఈసందర్బంగా బీసీ సంఘం నాయకుడు గ్రంథాలయ జిల్లా మాజీ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో గాండ్ల సంఘం, బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ప్రెస్ మీట్ లో కొందరు బీసీకి చెందిన ఉన్నత నేతలు బీసీలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా తప్పుపట్టారు ఒక బీసీ నాయకుడు బీసీలను చిల్లర గాళ్లు అనడం ఎంత వరకు సమంజసం? ఇది మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం అని పేర్కొన్నారు.ఇది కేవలం ఒక ప్రాంతీయ సమస్య కాదని, ఇది రాష్ట్రవ్యాప్త రాజకీయ, ఆర్థిక, మానవ హక్కుల సమస్య అని తెలిపారు.2018లో కొంతమంది అధికారుల తప్పిదం వల్ల కొందరు రెడ్డి కులస్తులకు గాండ్ల కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని,ఆరోపించారు బీసీ కమిషన్ ఇప్పటికే 2010లోనే వీరి పత్రాలు రద్దు చేయాలని స్పష్టం చేసిందని గుర్తు చేశారు.రెడ్డి గాండ్ల కులస్తులపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేయించి నిజ నిర్ధారణ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బొల్లం కిషన్, చెన్నూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

(ధర్మసాగర్ వుదయం ప్రతినిధి) : ఈరోజు ధర్మసాగర్ మండలం ధర్మసాగర్ గ్రామంలోని బస్టాండ్ వద్ద వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్లు,కులస్తుల వడ్డెర నరేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## చెట్లను కాపాడుట ప్రజలందరి బాధ్యత



**సర్పంచ్ మాడ్రాజు వెంకన్న**

ఖానాపురం, (వుదయం ప్రతినిధి): చెట్లను కాపాడితే భావితరాల ప్రజలందరికీ స్వచ్ఛమైన గాలి పీల్చుకునే అవకాశం ఉంటుందని చెట్లను నరకడంతో ఆక్సిజన్ కొనుక్కున్న రోజులు ముందు ముందు వస్తాయని గ్రామ ప్రజలకు గ్రామ నూతన సర్పంచ్ మాడ్రాజు వెంకన్న తెలిపారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామ సరిహద్దులోని ప్రధాన రహదారికి ఇరు వైపులా ఉన్న చెట్లుకు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గుర్తులు కేటాయిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు చెట్లకు గుర్తులు కేటాయిస్తున్నట్లు తెలుపుతూ ఇట్టి చెట్లను ఎవరు నరకవద్దని గ్రామస్తులకు సర్పంచ్ తెలుపుతూ గ్రామ పంచాయతీ పాలకవర్గం చెట్లని కాపాడడంలో ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఎర్రబెల్లి వెంకటేశ్వర్ రావు, గ్రామస్తులు జంగిలి భిక్షపతి, కత్తాల వెంకటేశ్వర్ రావు, జంగిలి వెంకన్న, కెల్లపు సత్యం, చిడిమిండ్ల మోహన్ రెడ్డి, లొంక అశోక్ తదితరులు పాల్గొన్నారు.


## ఓబన్న చిత్ర పటానికి ఘన నివాళులు



కాజీపేట, (వుదయం ప్రతినిధి) : కాజీపేట చౌరస్తాలో వడ్డే ఓబన్న గారి 219వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరై వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వడ్డే ఓబన్న కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని అన్నారు. కష్టజీవుల హక్కుల కోసం, సమాజంలో సమానత్వం, న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన యోధుడు వడ్డే ఓబన్నని పేర్కొన్నారు. పాత కాలంలోనే అన్యాయాలకు ఎదురు నిలబడి, వడ్డే (వడ్డెర) కులస్థుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లిన గొప్ప నాయకుడని తెలిపారు. విద్య, ఉపాధి, గౌరవమే నిజమైన అభివృద్ధి అని చాటి చెప్పిన నాయకుడు వడ్డే ఓబన్న, మహనీయుల జయంతులను కేవలం పూలమాలలతో ముగించకుండా, వారి ఆశయాలను జీవితాల్లో, పాలనలో అమలు చేసినప్పుడే వారికి నిజమైన నివాళి అవుతుందని ఎమ్మెల్యే అన్నారు.

ప్రజా ప్రభుత్వంలో భాగంగా, ముఖ్యమంత్రి నాయకత్వంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం, వడ్డే సమాజం అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. విద్య, ఉపాధి, నివాసం, ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అలాగే వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో వడ్డే సమాజానికి సంబంధించిన సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ మీతో పాటు ఉంటానని హామీ ఇచ్చారు.

## చల్లా ధర్మారెడ్డి పరామర్శ..




పరకాల జనవరి 11 (వుదయం ప్రతినిధి): రోడ్డు ప్రమాదంలో గాయపడి హన్మకొండలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగెం మండలం నార్లవాయి గ్రామ బిఆర్ఎస్ నాయకులు ఎండి రఫీని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం ఉదయం హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రఫీ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ప్రమాదానికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. రఫీ త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్



జయశంకర్ భూపాలపల్లి జనవరి 11(వుదయం జిల్లా ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ డ్రాయింగ్ హైయర్, లోయర్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ హయ్యర్ పరీక్షలు ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్ సందర్శించారు. ఉదయం మరియు సాయంత్రం పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్ తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ 159 మంది దరఖాస్తు చేసుకోగా 113 మంది హాజరైనట్లు 46 మంది గైర్హాజరు అయినట్లు డ్రాయింగ్ హయ్యర్ గ్రేడ్ 50 మంది దరఖాస్తు చేసుకోగా 46మంది హాజరైనట్లు 4 గురు గైర్హాజరైనట్లు, టైలరింగ్ మరియు ఎంబ్రాయిడరీ హైయర్ 14 మంది దరఖాస్తు చేసుకోగా అందరూ హాజరైనట్లు తెలియజేశారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పరీక్ష కేంద్రంలో త్రాగునీరు విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ రామ్ ధన్, డిపార్ట్మెంటల్ అధికారి సతీష్ పరీక్షల సహాయకులు కుసుమ కృష్ణమోహన్ ఉన్నారు




# గూగుల్ పే, ఫోన్ పేతో పీఎఫ్





**వుదయం, బిజినెస్ డెస్క్ :** ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు శుభవార్త. పీఎఫ్ డబ్బులు డ్రా చేసుకోవాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సిన పనిలేదు. అత్యవసర సమయాల్లో డబ్బు కోసం ఇబ్బంది పడకుండా, ఇకపై గూగుల్ పే, ఫోన్ పే వంటి యూపీఐ యాప్స్ ద్వారా క్షణాల్లోనే మీ పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు రాబోతోంది. సాధారణంగా పీఎఫ్ క్లెయిమ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే, అది పరిశీలించి డబ్బులు ఖాతాలో జమ కావడానికి 3 నుండి 4 రోజులు పట్టేది. ఈ జాప్యాన్ని నివారించడానికి, ఈపీఎఫ్ఓ కొత్త టెక్నాలజీని తీసుకురానుంది. తాజా సమాచారం ప్రకారం, 2026,27 ఆర్థిక సంవత్సరం ఆరంభం (ఏప్రిల్) నుండి ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మొదట భీమ్ యాప్ ద్వారా, ఆ తర్వాత ఫోన్ పే, గూగుల్ పే వంటి ఇతర యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఈ సదుపాయాన్ని కల్పించనున్నారు.

# పుతిన్‌ను కూడా మదురోలా బంధిస్తారా?



**వుదయం, ఇంటర్నేషనల్ డెస్క్:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బలగాలు అరెస్ట్ చేసిన ఘటన ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఈ ఆపరేషన్ తర్వాత ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విషయంలోనూ అమెరికా ఇలాంటి కఠిన చర్యలే తీసుకుంటుందా? అనే చర్చ మొదలైంది. తాజాగా ఈ విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టత ఇచ్చారు. "మదురో లాగే పుతిన్‌ను కూడా బంధిస్తారా?" అని ప్రశ్నించగా.. ట్రంప్ ఆ అవసరం లేదని స్పష్టం చేశారు. రష్యాతో అమెరికాకు ఎప్పటినుంచో సంబంధాలు ఉన్నాయని, పుతిన్‌తో మాట్లాడి ఒక ఒప్పందానికి రాగలమని, తద్వారా యుద్ధాన్ని ముగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ ఇటీవల పరోక్షంగా పుతిన్‌ను కూడా మదురోలాగే అరెస్ట్ చేయాలని కోరినట్లు వార్తలు వచ్చాయి. ఒక డిక్టేటర్‌ను ఎలా ట్రీట్ చేయాలో అమెరికాకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ట్రంప్ మాత్రం రష్యాపై అలాంటి మిలిటరీ ఆపరేషన్ చేసే ఉద్దేశం లేదని తేల్చిచెప్పారు. ప్రస్తుతం రష్యా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని, చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకుంటామని ట్రంప్ పేర్కొన్నారు.

# స్టీల్, ప్రీకాస్ట్ నిర్మాణాలతో కాలుష్యానికి అడ్డుకట్ట!: పీయూష్



**వుదయం డెస్క్ :** భవన నిర్మాణ సమయంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రీకాస్ట్, స్టీల్ నిర్మాణ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ పేర్కొన్నారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. నిర్మాణ సమయంలో వెలువడే దుమ్ము కాలుష్యానికి దారితీస్తుందన్నారు. వీటిని నగరం బయటకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. "ప్రపంచవ్యాప్తంగా ఆర్‌సీ మిక్సర్లు కనిపించవు. స్టీల్, ప్రీకాస్ట్ నిర్మాణాలే ఉంటాయి. కానీ, కొంచెం ఖరీదు ఎక్కువ. వీటికి ఏమైనా రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వగలమా అని మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించాలని అనుకుంటున్నా" అని గోయల్ పేర్కొన్నారు. వీటిపై ఆంక్షలు విధించడానికి బదులు.. ఈ పద్ధతులను అవలంబించేందుకు బిల్డర్లను ప్రోత్సహించాలన్నారు. పీయూష్ నార్త్ ముంబయి లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే.

# నన్ను చూసి భారత్ వణుకుతోంది

## పహల్గామ్ దాడి సూత్రధారి ప్రగల్భాలు



**వుదయం డెస్క్ :** తనను చూసి భారత్ వణుకుతోందని లష్కరే తోయిబా (LeT) టాప్ లీడర్, పహల్గామ్ ఉగ్రదాడి మాస్టర్ మైండ్ సైఫుల్లా కసూరి ప్రగల్భాలు పలికాడు. భారత్ ను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్లో ఉన్న పంజాబ్ ప్రావిన్స్ లో జరిగిన కార్యక్రమంలో స్టూడెంట్స్ ను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. కశ్మీర్ మిషన్ నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని చెప్పుకొచ్చాడు. పాక్ ఆర్మీనే తనను స్వయంగా ఆహ్వానిస్తుందని చెప్పడంతో.. అంతర్జాతీయ సమాజం ముందు టెర్రరిజంపై పోరాడుతున్నామని చెప్తున్న పాక్ ముసుగును తొలగించినట్లయింది. యుద్ధంలో మరణించిన పాక్ సైనికులకు అత్యంక్రియల ప్రార్థనలు తానే చేస్తానని సైఫుల్లా పేర్కొనడంతో.. అక్కడి సైన్యం ఉగ్రవాదుల మధ్య ఎంత బలమైన సంబంధం ఉందో వెల్లడైంది.


# అమెరికాలో కాల్పుల కలకలం

## ఆరుగురు మృతి!



**వుదయం, ఇంటర్నేషనల్ డెస్క్:** అమెరికాలో తుపాకీ సంస్కృతి మరోసారి పడగవిప్పింది. మిస్సిసిపీ రాష్ట్రంలో శనివారం జరిగిన కాల్పుల ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈశాన్య మిస్సిసిపీలోని వెస్ట్ పాయింట్ పట్టణంలో వేర్వేరు ప్రాంతాల్లో ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అలబామా సరిహద్దుకు సమీపంలో ఉన్న క్లే కౌంటీ పరిధిలోని వెస్ట్ పాయింట్‌లో ఈ కాల్పులు జరిగాయి. మొత్తం మూడు వేర్వేరు ప్రదేశాల్లో మృతదేహాలు లభ్యమైనట్లు క్లే కౌంటీ షెరీఫ్ ఎడ్డీ స్కాట్ వెల్లడించారు. ఈ దాడులకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతను పోలీసుల కస్టడీలో ఉన్నాడని, ఇక ప్రజలకు ఎటువంటి ముప్పు లేదని అధికారులు స్పష్టం చేశారు. "దురదృష్టవశాత్తు మన కమ్యూనిటీలో ఒక విషాదం జరిగింది. అమాయక ప్రాణాలు బలి అయ్యాయి" అని షెరీఫ్ స్కాట్ సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అయితే నిందితుడి పేరు, కాల్పులకు గల కారణాలు, మృతుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. విచారణ కొనసాగుతోందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అమెరికాలో ఇలాంటి కాల్పుల ఘటనలు తరచూ జరుగుతుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

# సైబర్ వలలో వృద్ధ దంపతులు.. రూ.15 కోట్లు స్వాహా..



**వుదయం డెస్క్ :** వృద్ధ దంపతులు సైబర్ మాయగాళ్ల వలలో చిక్కారు. 17 రోజులు డిజిటల్ అరెస్టులో ఉండి.. జీవితకాలం దాచుకున్న సుమారు రూ.15 కోట్లను పోగొట్టుకున్నారు. ఈ ఘటన తాజాగా దిల్లీలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓం తనేజా ఆయన భార్య డా; ఇందిరా తనేజాలు 48 ఏళ్లు అమెరికాలో ఉండి ఐక్యరాజ్యసమితిలోనూ సేవలందించారు. రిటైర్‌మెంట్ అనంతరం 2015లో భారత్‌కు వచ్చారు.
గత డిసెంబర్ 24న.. ఆ దంపతులకు లా ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులమంటూ సైబర్ నేరగాళ్ల నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. 'మీపై మనీలాండరింగ్, జాతీయ భద్రతకు ముప్పు కలిగించడం సహా పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి' అంటూ ఆ దంపతులను బెదిరించారు. డిసెంబర్ 24 నుంచి జనవరి 10 వరకు డిజిటల్ అరెస్టు చేస్తున్నామని వీడియో కాల్‌లో హెచ్చరించారు. ఆ సమయంలో ఆ దంపతుల నుంచి దశల వారీగా రూ.14.85 కోట్లను కాజేశారు. అనంతరం సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదిస్తే ఆర్‌బీఐ ఆదేశాల మేరకు డబ్బులు తిరిగి వస్తాయని స్కామర్లు వారికి సూచించారు. దీంతో వృద్ధ దంపతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వారిపై ఎలాంటి అరెస్టు వారెంట్లు లేవని.. సైబర్ మాయగాళ్లు మోసం చేశారని ఆ దంపతులు తెలుసుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# పిలక, పంచకట్టు నచ్చలేదని.. ఎస్ఐ అయ్యాక భర్తకు విడాకులు!




**వుదయం డెస్క్ :** పురోహిత్యం చేసిన కష్టార్జితంతో భార్యను చదివించి ఎస్ఐ చేసిన భర్తకు భార్య ఊహించని షాక్ ఇచ్చింది. భర్త పిలక, పంచెకట్టు నచ్చలేదని విడాకులు ఇచ్చింది. ఈ షాకింగ్ ఘటన మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కష్టపడి భార్యను చదివించి ప్రయోజకురాలిని చేస్తే.. చివరకు ఆమె ఉద్యోగం వచ్చాక భర్తనే కాదనుకుంది. వృత్తిరీత్యా పౌరోహిత్యం చేసే సదరు భర్త, తన భార్యను కష్టపడి చదివించాడు. ఆమె సబ్‌ఇన్‌స్పెక్టర్ (SI) ఉద్యోగం సాధించడంలో అండగా నిలిచాడు. అయితే, ఎస్ఐగా ఉద్యోగం వచ్చిన తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది.
భర్త సంప్రదాయబద్ధంగా ధరించే దోతీ కుర్తా, తలకు ఉండే పిలక (శిఖ) తనకు నచ్చడం లేదని, అవి తన పోలీస్ ఆఫీసర్ హోదాకు అవమానకరంగా ఉన్నాయని ఆమె వాదిస్తోంది. దీంతో ఆమె భర్త నుంచి విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తన భర్తతో కలిసి బయట తిరగాలంటే ఇబ్బందిగా ఉందని ఆమె కోర్టులో పేర్కొంది. న్యాయమూర్తులు, కౌన్సిలర్లు ఇద్దరికీ కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆమె తన నిర్ణయానికే కట్టుబడి ఉండటంతో అధికారులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో సదరు మహిళ పై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు.

# ధీటుగా సమాధానం చెప్పే సత్తా ఉంది

## బంగ్లాదేశ్‌లో హత్యలపై స్పందించిన ప్రముఖ స్వామిజీ




**వుదయం డెస్క్ :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యలు, దాడుల ఘటనలపై ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జగద్గురు స్వామి రాంభద్రాచార్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలు అత్యంత దురదృష్టకరమని, మైనారిటీలపై జరుగుతున్న అకృత్యాలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం రాజస్థాన్, జైపూర్‌లో మీడియాతో మాట్లాడిన స్వామి రాంభద్రాచార్య, అక్కడ ప్రస్తుతం ఉన్న తాత్కాలిక ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగబోదని ఆయన జోస్యం చెప్పారు. అక్కడ ఎవరూ తమ ప్రతాపాన్ని (దాదాగిరి) చూపించలేరని, ఎవరి 'దాదాగిరి'కైనా దీటుగా సమాధానం చెప్పే సత్తా భారతదేశానికి ఉందని స్వామి రాంభద్రాచార్య తేల్చి చెప్పారు.
ఇదిలా ఉండగా.. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. తాజాగా సునామ్‌గంజ్ జిల్లాలో జై మహాపాత్రో అనే యువకుడిపై దుండగులు దాడి చేయగా, తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సునామ్‌గంజ్ జిల్లాలోని భంగడోహర్ గ్రామానికి చెందిన జై మహాపాత్రను గురువారం ఓ స్థానిక షాపునకు పిలిపించి దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని సిల్హెట్ ఎంఏజీ ఉస్మానీ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ దాడి పథకం ప్రకారం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

# క్యూబా అధ్యక్షుడిగా రూబియో : ట్రంప్ ఊహాగానాలు



**వాషింగ్టన్:** యుఎస్, లాటిన్ అమెరికా దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ, క్యూబా అధ్యక్షుడిగా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పని చేయడమన్న భావన తనకు సంతృప్తినిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. సమయం మించిపోకుండా అమెరికాతో ఒప్పందం చేసుకోమని ద్వీపదేశానికి ఆయన హెచ్చరిక చేశారు.
మార్కో రూబియో క్యూబా అధ్యక్షుడు అని ఒక పోస్ట్‌ను పంచుకుంటూ, ఈ భావన నాకు బాగా అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అయితే, అతని వాక్చాతుర్యం తప్ప, ఇది ఏదైనా అధికారిక అమెరికా విధానాన్ని లేదా దౌత్య ప్రణాళికను ప్రతిబింబిస్తుందనడానికి ఎటువంటి ఆధారాలు లేవు. ఈ వాదన, లాటిన్ అమెరికాపై ట్రంప్ ఇటీవల చేసిన కఠినమైన వ్యాఖ్యలకు ముడిపడి ఉన్న సోషల్ మీడియా అతిశయోక్తిగా కనిపిస్తోంది.
గత వారం వెనెజులాపై గతంలో ఎన్నడూ లేని విధంగా చేపట్టిన సైనిక చర్య అనంతరం పశ్చిమ అర్ధగోళంలో పలు దేశాలకు అమెరికాతో సంబంధాల విషయంలో ఉద్రిక్తతలు ప్రారంభమైన క్రమంలో ఈ ప్రకటన వెలువడింది. గత వారం నేరపూరిత ఆరోపణలపై వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను, అతడి భార్యను బందీలుగా చేసి, అమెరికాకు తీసుకువచ్చిన విషయం తెలిసిందే.
అదనంగా, ట్రంప్ తాజా పోస్ట్ లాటిన్ అమెరికాకు సంబంధించి ఆయన చేసిన దూకుడు ప్రకటనల పరంపరను అనుసరిస్తుంది. గత వారం, కొలంబియాను ఒక అనారోగ్య వ్యక్తి నడుపుతున్న దేశమని అభివర్ణిస్తూ, , అక్కడ సంభావ్య అమెరికా చర్యకు ఆమోదాన్ని సూచిస్తున్నట్లు కనిపించాడు. భవిష్యత్తులో దాడులు జరిగే అవకాశం ఉందా అని ప్రశ్నించినప్పుడు తనకు అభ్యంతరం లేదన్నట్టుగా వ్యాఖ్యానించారు.
క్యూడా ఆర్థిక పోరాటాల గురించి వ్యాఖ్యానిస్తూ, వెనెజులా చమురుపై భారీగా ఆధారపడిన ద్వీపదేశం కుప్పకూలేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

**యుఎస్‌తో ఒప్పందం చేసుకోమంటూ క్యూబాకు ట్రంప్ హెచ్చరిక**

వెనెజులా చమురు, డబ్బుతో క్యూబా గత ఇద్దరు నియంతలకు భద్రతా సేవలను అందిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా సజీవంగా ఉందని, ఇకపై అది కొనసాగదని ఆదివారం సోషల్ మీడియా వేదిక అయిన ట్రూత్ సోషల్ పై వ్యాఖ్యానించారు.
గతవారం అమెరికా జరిపిన దాడిలో అనేకమంది క్యూబన్లు మరణించారని, వెనిజులాకు ఇకపై తమను బందీలుగా చేసుకున్న గూండాలు, దోపిడీదారుల నుండి రక్షణ అవసరం లేదు పేర్కొన్నారు.
ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశమైన అమెరికా, దాని సైనికశక్తి వెనెజులాకు రక్షణ కల్పించేందుకు ఇప్పుడు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఇకపై చమురు లేదా డబ్బు గానీ క్యూబాకు వెళ్లబోవడం లేదని, సమయం మించిపోకుండా ఒప్పందం చేసుకోమని క్యూబాను హెచ్చరించారు.

**ఆ ప్రాంతం నుంచి ప్రతిస్పందనలు**


అమెరికా దురాక్రమణను ఎదుర్కొంటున్న లాటిన్ అమెరికన్లు ఐక్యంగా ఉండాలని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో పిలుపునిచ్చారు, విదేశీ శక్తుల "సేవకులు"గా మారకుండా దేశాలు ఉండాలని కోరారు. అదే సమయంలో, క్యూబా అధికారులు బాహ్య జోక్యానికి సంబంధించి ఏ సూచనను సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించినట్లుగా భావిస్తామన్నారు.
ఇదిలా ఉండగా, ట్రంప్ పోస్టులు ఆన్‌లైన్‌లో కొంత కలకలం రేకెత్తించి ఉండవచ్చు, కానీ రూబియో క్యూబాలో ఏదైనా అధికారిక పదవిని చేపట్టబోతున్నారనడానికి ఎలాంటి సూచన లేదు, దాంతో ఈ విషయం కేవలం సోషల్ మీడియా ఊహాగానాలు, రాజకీయ నాటకాలకే పరిమితమైంది.

# ఫోన్, ఇంటర్నెట్ వాడని అజిత్ డోబాల్



**వుదయం, ఇంటర్నేషనల్ డెస్క్:** భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబాల్ ఫోన్, ఇంటర్నెట్ వాడరట. తన రోజువారీ కార్యకలాపాల్లో వాటికి చోటివ్వరట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు.
"నేను ఇంటర్నెట్ ఉపయోగించననే మాట నిజమే. ఫోన్ కూడా వాడను. కుటుంబ సభ్యులు, ఇతర దేశాల్లోని ప్రజలతో మాట్లాడేందుకు కొన్ని సందర్భాల్లో మాత్రమే ఉపయోగిస్తాను. అది కూడా అవసరం అనుకుంటేనే. అవి రెండూ లేకుండా విధులు నిర్వర్తించేలా ప్లాన్ చేసుకుంటాను. కమ్యూనికేషన్‌కు చాలా మార్గాలు ఉన్నాయి. అందులో ప్రజలకు తెలియనివి ఎన్నో ఉన్నాయి. వాటిని కూడా పరిచయం చేయాలి" అని డోబాల్ సూచించారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.
1945లో ఉత్తరాఖండ్‌లో జన్మించిన డోబాల్.. 1968లో ఐపీఎస్‌లో చేరారు. విధుల్లో చూపిన ధైర్యసాహసాలకుగానూ కీర్తిచక్ర అందుకున్నారు. ఆ అవార్డు అందుకున్న పిన్నవయస్కుడైన పోలీసు ఆఫీసర్ ఆయనే కావడం విశేషం. మిజోరం, పంజాబ్, ఈశాన్యప్రాంతాల్లో చోటుచేసుకున్న తిరుగుబాటు వ్యతిరేక ఆపరేషన్లలో కీలకంగా వ్యవహరించారు. కేరళ క్యాడర్‌కు చెందిన ఆయన నిఘా, అంతర్గత భద్రతా విభాగాల్లో ఎక్కువకాలం పనిచేశారు. జాతీయ భద్రతా నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. వాటిల్లో 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ స్ట్రైక్స్ ఉన్నాయి.

# ఏదో ఒక రోజు కేరళలో అధికారంలోకి వస్తాం: అమిత్ షా



**వుదయం డెస్క్:** ఏదో ఒక రోజు భాజపాకు చెందిన నేత కేరళకు సీఎం అవుతారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు. భాజపాకు తిరువనంతపురం కీలక మైలురాయని అభివర్ణించారు. ఇటీవల తిరువనంతపురం నగరపాలక ఎన్నికల్లో 50 స్థానాలతో భాజపా విజయభేరి మోగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అక్కడ ప్రతినిధులను కలిసి.. కేరళ అభివృద్ధికి తమ పార్టీ అమలు చేయబోయే భవిష్యత్తు ప్రణాళికలపై షా ప్రసంగించారు. "ఈ విజయంతో మన లక్ష్య సాధనకు ఓ ముందడుగు పడింది. మన పార్టీకి చెందిన వ్యక్తి ఏదో ఒక రోజు సీఎం అవ్వడం ఖాయం. కేరళను పూర్తిగా అభివృద్ధి చేయడంతో పాటు జాతి వ్యతిరేకుల నుంచి రాష్ట్రాన్ని కాపాడటం ఎన్డీయే నేతృత్వంలోనే జరుగుతుంది. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడం ప్రధాని మోదీ ఆశయం. అది కేరళ అభివృద్ధితోనే సాధ్యమవుతుంది' అని అమిత్ షా ఉద్ఘాటించారు. అలానే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గుతోందని, మరోవైపు దేశంలో కాంగ్రెస్ కూడా కనుమరుగవుతుందన్నారు.
తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో 45 ఏళ్లుగా అధికారంలో ఉన్న వామపక్ష పాలనకు ఎదురుదెబ్బ తగిలింది. 101 వార్డుల్లో ఎల్డీఎఫ్ 29 గెలువగా, భాజపా నేతృత్వంలోని ఎన్డీయే 50 స్థానాలు గెలిచి విజయం సాధించింది.

# సీఎం కుర్చీ కోసం ఘర్షణల్లేవు: సిద్ధరామయ్య



**బెంగళూరు:** కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం ఘర్షణలు జరుగుతున్నాయంటూ వస్తోన్న వార్తలపై సీఎం సిద్ధరామయ్య స్పందించారు. అనవసర ప్రశ్నలు అడుగుతున్నారని ఆయన విలేకర్లపై విరుచుకుపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్‌లో సీఎం కుర్చీకోసం ఘర్షణలు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలను ఖండించారు. విద్వేష ప్రసంగాల నిరోధక బిల్లుపై గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో చర్చించనున్నట్టు వెల్లడించారు. ఈ బిల్లు అంశం తనకు, డీకే శివకుమార్ మధ్య చిచ్చురేపిందనడం అవాస్తవమన్నారు. శాసనసభలో బిల్లు ఆమోదం పొందింది. గవర్నర్ బిల్లును ఆమోదించవచ్చు లేదా వెనక్కు పంపవచ్చు అని పేర్కొన్నారు.
అల్లర్లపై బళ్లారి నుంచి బెంగళూరు వరకు పాదయాత్ర చేస్తామన్న భాజపా ప్రకటనపై ఎవరు వద్దన్నారని ప్రశ్నించారు. గతంలో మేము చేసిన పాదయాత్రకు బలమైన కారణం ఉందన్నారు. రాష్ట్రంలో బొగ్గు గనుల అక్రమ తవ్వకంపై 2010లో కాంగ్రెస్ తరఫున 320 కిలోమీటర్లు పాదయాత్ర చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీని ఫలితంగా 2013లో కాంగ్రెస్ మెజారిటీతో గెలిచిందన్నారు.

# శిందే.. ఉద్ధవ్.. ఇద్దరితో పనిచేయడం సులభమే



**డెస్క్:** మహారాష్ట్ర మాజీ సీఎంలు ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ శిందేలపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇద్దరు నేతలతో కలిసి పనిచేసిన అనుభవంపై ఓ వార్తాసంస్థ కార్యక్రమంలో మాట్లాడారు. శిందేను హ్యాండిల్ చేయడం సులభమని చెప్పారు. ఠాక్రేతో కలిసి పనిచేయడం చాలా కష్టమని పేర్కొన్నారు. మరోవైపు.. రాష్ట్రంలోని అధికార కూటమిలో అంతర్గత కలహాల వాదనలను తోసిపుచ్చారు.
"శిందేతో కలిసి పనిచేయడం సులభం. ఎందుకంటే.. ఆయన ఎమోషనల్ వ్యక్తి. నాదీ అదే తరహా మనస్తత్వం. కాబట్టి.. ఇద్దరి మధ్య సమన్వయం చక్కగా కుదిరింది. ఆయనలోని భావోద్వేగ కోణాన్ని అర్థం చేసుకుంటే.. వ్యవహరించడం సులభం. కానీ, నేను ఆయన కంటే ఎక్కువ ప్రాక్టికల్. ఉద్ధవ్ ఠాక్రే విషయానికొస్తే.. ఆయన్ను అస్సలు అంచనా వేయలేం. ఠాక్రేను అర్థం చేసుకునేందుకు ప్రత్యేకంగా ఒక పరిశోధకుడిని నియమించాల్సి ఉంటుంది. కాబట్టి.. ఆయనతో వ్యవహరించడం కష్టం" అని ఫడణవీస్ వ్యాఖ్యానించారు.
మహారాష్ట్రలో తమ కూటమి స్థిరంగా కొనసాగుతోందని ఫడణవీస్ చెప్పారు. "ఐదేళ్ల పాటు కలిసే ఉంటాం. ఉపముఖ్యమంత్రి, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ శిందే తన మనవడిని కలిసేందుకు తరచూ దిల్లీ వెళ్తుంటారు. ఈ పర్యటనలను కూటమిలో సమస్యలకు సంకేతాలుగా అన్వయిస్తున్నారు. ఆయన దిల్లీకి వెళ్లి భాజపా నేతలతోనూ భేటీ అవుతున్నారు. వేరే ఇతర పార్టీ నాయకులను కలిస్తే.. అదీ ఆందోళన చెందాల్సిన విషయం" అని అన్నారు.
2014లో భాజపా, అప్పటి శివసేన కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఫడణవీస్ ముఖ్యమంత్రిగా, ఉద్ధవ్ శివసేన కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్నారు. శివసేన చీలిక అనంతరం ఏర్పడిన శిందే సారథ్యంలోని కూటమి ప్రభుత్వంలో ఫడణవీస్ ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు.

## శ్రీ భద్రావతి భావన ఋషి కళ్యాణ మహోత్సవ
# కరపత్రిక ఆవిష్కరణ





**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు ఐరా రియాలిటీ పోశం బ్రదర్స్ చేతుల మీదుగా**

**మేళ్లచెరువు/హుజూర్నగర్ (వుదయం :**

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో మొట్టమొదటిగా నిర్మించినటువంటి శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానము నందు శ్రీ మార్కండేయ సహిత శ్రీ భద్రావతి భావనారుషి దేవాలయ కళ్యాణ మహోత్సవ కరపత్రికను హైదరాబాద్ లో భారీ నీటిపారుదల శాఖ మాత్యులు మరియు పౌరసరఫరాల శాఖ మాత్యులు కెప్టెన్ ఉత్తమ కుమార్ రెడ్డి నివాసము నందు మరియు ఐరా రియాలిటీ ఆఫీస్ నందు ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికీ జనవరి 25 న జరిగే స్వామివారి కళ్యాణమహో త్సవానికి ముఖ్య అతిథిలుగ మంత్రి ని మరియు పోషం.నర్సిరెడ్డి ని, వీరారెడ్డిని అహ్వానించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని తెలిపారు. అనంతరం పద్మశాలి కుల బాంధవులు మంత్రిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఐరా రియాల్టీ పోషం నర్సిరెడ్డి వీరారెడ్డి మాట్లాడుతూ దేవాలయానికి బంధించి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రోత్సాహంతో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భావనా ఋషి దేవాలయ కమిటీ చైర్మన్ సామిలేటి రంగారావు, మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు మిట్ట కోలు సాయి కుమార్,

పద్మశాలి కుల బాంధవులు మామిడి కొండలు, దామెర్ల అంజి, చిలుకూరి శివ, మామిడి గణేష్, తుమ్మ శంకరయ్య, జెల్లా, నారాయణ ఉట్ల.చందు, మామిడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుట్టుమిషన్లు పంపిణీ
## ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**వైరా ,వుదయం:**

వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసా ద్వారా ఎంపికైన వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాల ముస్లిం మైనార్టీ మహిళలకు 264 కుట్టు మిషన్లు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. ప్రతి పథకం మహిళల పేరు మీదే కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. అదేవిధంగా కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ సిఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోళ్ళ గంగారావు వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి రాష్ట్ర మార్ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బుర్ర రాజశేఖర్ తిమ్మారావుపేట సర్పంచ్ గూగుల్ వత్తు సుమలత మహేష్ వైరా ఎఫ్ఎసి తాసిల్దార్ సురేష్ కొనిజర్ల ఈవో ఆర్ డి ఉపేంద్రయ్య ఏన్మార్ ఆర్ ఐ శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఆధ్వర్యంలో
# ముగ్గుల పోటీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,వుదయం:**

కాంగ్రెస్ పార్టీ, రెవిన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం కొత్తగూడెం ఆధ్వర్యంలో నేడు సాయంత్రం 4 గంటల నుండి కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్టు భద్రాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు దేవిప్రసన్న తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్ ల నుండి భారీ ఎత్తున మహిళలు పాల్గొంటారని, విజేతలకు రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామ సహాయం రఘు రాంరెడ్డి బహుమతులు అందిస్తారని వారు తెలిపారు. 1వ బహుమతి రూ॥ 30,000/–, 2వ బహుమతి రూ॥ 25,000/–, 3వ బహుమతి రూ॥ 20,000/–, 4వ బహుమతి రూ॥ 15,000/–, 5వ బహుమతి రూ॥ 10,000/– కన్సోలేషన్ బహుమతులు (ఐదుగురికి) రూ॥ 5,000/– ఇవ్వనున్నామన్నారు. ఇవే కాక ముగ్గుల పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఆకర్షణీయమైన బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. పోటీలో పాల్గొనే వారు సొంతంగా ముగ్గులు,

రంగులు తెచ్చుకోవాలని, కేవలం 1 గంటలోనే ముగ్గు వేయాలని విజేతల ప్రకటన అంతిమ నిర్ణయం జడ్జి లదేనని తెలిపారు. ఇప్పటికే ఈ పోటీలకు పేర్లను నమోదు చేసుకుంటున్నారు. పోటీల ప్రారంభ సమయానికి ముందు వరకు కూడా పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఈ కింద ఉన్న నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ పాత్రికేయ సమావేశంలో ఐఎన్టీయుసి వైస్ ప్రెసిడెంట్స్ ఎండి రజాక్, పితాంబరం, రైల్వే బోర్డు సభ్యులు వై శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షులు కరీం పాషా, ఓబీసీ వెంకట్ యాదవ్, మహిళ నాయకురాళ్లు ఆకునూరి సుప్రియ,

హైమావతి, రమాదేవి, పుష్పలత, అమదగాని రాజకుమారి, రుక్మిణి, మరియు తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు

**సత్తుపల్లి ,వుదయం:**



ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదివారం పెనుబల్లి పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ నేరాలకు పాల్పడి కోట్ల రూపాయలను కాజేసిన కేస్ కు సంబంధించి పలు విషయాలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వెల్లడించారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువకులకు బ్యాంక్ అకౌంట్ లు ఓపెన్ చేసి సైబర్ క్రైమ్ లకు పాల్పడిన నిందితులు సైబర్ క్రైమ్ ద్వారా 547 కోట్ల రూపాయలను అక్రమంగా నిందితులు సంపాదించారని ,సైబర్ క్రైమ్ లో సత్తుపల్లి,కల్లూరు,వేంసూర్ మండలానికి చెందిన ఆరుగురు ప్రధాన నిందితులుపోట్రు మనోజ్ కళ్యాణ్,ఉడతనేని వికాస్ చౌదరి,పోట్రు ప్రవీణ్,మేడ భానుప్రియ, మేడా సతీష్,మోరంపూడి చెన్నకేశవ అనే ఆరుగురు నిందితులను అరెస్టు చేశారని,గత ఏడాది డిసెంబర్ లో విఎం బంజర్ పోలీస్ స్టేషన్ లో సాయికిరణ్ అనే వ్యక్తి ఫిర్యాదుతో వెలుగు చూసిన కోట్ల రూపాయల సైబర్ క్రైమ్ కేసు..నిందితులకు తమ బ్యాంక్ అకౌంట్లను ఇచ్చి సహకరించిన మరో 17 మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు,అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్తులతో జతకట్టి కాల్ సెంటర్లు నిర్వహిస్తూ సైబర్ క్రైమ్ లకు పాల్పడిన నిందితులుమ్యాట్రిమోనీ,రివార్డు పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్ లో పెట్టుబడులు,క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడినట్లు,నేరస్తుల బ్యాంక్ అకౌంట్ లపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో వందల సంఖ్యలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ సిఐ లు సత్తుపల్లి, వేంసూర్, పెనుబల్లి ఎస్ఐ లు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ కేతేశ్వర కంకాలమ్మ జాతర



**జన్నారం, వుదయం :**

జన్నారం పట్టణంలో గల శ్రీ కేతేశ్వర కంకాలమ్మ జాతరను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులో ఉన్న శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం రోజున దేవాలయంలో గల మూల విగ్రహాలకు అర్చకులు అభిషేకం,అర్చనలు చేశారు. ఈ జాతరకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.జాతరకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో లక్షెటిపేట సిఐ రమణమూర్తి, లక్షెటిపేట, దండేపల్లి, జన్నారం ఎస్సైలు గోపతి సురేష్,తహసోద్దీన్, గొల్లపల్లి అనూష,పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, తాజా మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డి.లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజఫర్ ,మాణిక్యం, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగ రావు, గౌరవ అధ్యక్షుడు చిలువేరి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కోడి జుట్టు రాజన్న, కోశాధికారి పిల్లి మల్లయ్య, నేతలు కనకయ్య, శంకర్, సుధీర్, గోపాల్, నరేష్, సురేష్ ఉన్నారు.

# అట్టహాసంగా మొదలైన గజ్జల శశి కుమార్ స్మారక టోర్నమెంట్

**.రామకృష్ణాపూర్ , వుదయం:**



రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన గజ్జల శశికుమార్ స్మారకార్థం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నమెంట్ కు ముఖ్య అతిథులుగా మందమర్రి ఏరియా ఎస్.ఓ.టూ జీఎం జి లలిత్ ప్రసాద్, పట్టణ ఎస్సై లింగంపల్లి భూమేష్ లు హాజరయ్యారు.శశికుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.మొదటి మ్యాచ్ జర్నలిస్ట్ వర్సెస్ అన్టాటబుల్ టీంకు టాస్ వేసి టోర్నమెంట్ ప్రారంభించారు. కాగా ఈ టోర్నమెంట్ లో మొత్తం 30 టీంలు పాల్గొంటాయిని, ఈ నెల 16 న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తామని నిర్వాహకులు రాకేష్, మధుకర్ రెడ్డి, సాయి లు తెలిపారు. టోర్నమెంట్ కు అంజనిపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు మనీ ప్రైజ్ అందిస్తున్నారని, మొదటి బహుమతి 50 వేలు, రెండో బహుమతి 25 వేలు అందిస్తున్నారని తెలిపారు. ప్రతీ మ్యాచ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ ను సివి రామన్ డిగ్రీ కాలేజీ వారు అందిస్తున్నారని అన్నారు. పేర్లు నమోదు చేసుకున్న టీం లు సమయానికి స్టేడియం కు చేరుకోవాలని కోరారు. టోర్నమెంట్ కు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

# 20న చలో హైదరాబాద్..

## పిలుపునిచ్చిన తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం



**జన్నారం ,వుదయం :**

ఈనెల 20న హైదరాబాదులోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ఉద్యమ కళాకారుల పోరు దీక్ష కార్యక్రమానికి తరలి రావాలని మంచిర్యాల జిల్లా ఇన్చార్జ్ కొండకూరి రాజు, ధూంధాం కళాకారుడు లింగంపల్లి రాజలింగం లు కోరారు.రాష్ట్ర కళాకారుల ఉద్యమ సంఘం పిలుపుమేరకు వారు ఆదివారం రోజున జన్నారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పోరుదీక్ష పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 12 సంవత్సరాలుగా తాము శాంతియుతంగా పోరాటం చేస్తున్నాం కానీ ప్రభుత్వం కళాకారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుండడం చాలా బాధాకరమని అన్నారు.

కాగజ్ నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీల నిరుద్యోగ కళాకారుల అంశం లేవనెత్తినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం విడ్డూరమని అన్నారు.ఈ కార్యక్రమంలో గూడ రాజేందర్,కొల్లూరు రమేష్,కందుకూరు ప్రశాంత్, జిలకర హరీష్ తదితరులు పాల్గొన్నారు.


# శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

**నిజాంసాగర్, వుదయం**



: నిజాంసాగర్ మండలంలోని సింగితం గ్రామంలో గ్రామస్థులందరూ కలిసి ఏకపక్షంగా గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామసర్పంచు సయ్యద్ రఫీ చేతుల మీదుగా గ్రామంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. హిందూ, ముస్లీం అనే తేడాలు ఏవీ లేకుండా అందరు కలిసి కట్టుగా ఈ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని తమ గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నందుకు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తూ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని సర్పంచు పేర్కొన్నారు.

# కిష్టాపూర్ లో అట్టహాసంగా ఎడ్ల పందేల పోటీలు



**జైపూర్ ,వుదయం :**

జైపూర్ మండలం కిష్టాపూర్ లో అట్టహాసంగా ఎడ్ల పందేలు పోటీలను స్థానిక గ్రామ పెద్దలు నిర్వహించారు.ఆదివారం నిర్వహించిన ఎడ్ల పందేలను తిలకించేందుకు స్థానిక గ్రామం తో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు చందుపట్ల పాపిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పశుపోషకులను ప్రోత్సహించేందుకు గత రెండేళ్లుగా ఎడ్ల పందేలను చేపడుతున్నామని తెలిపారు. ఈ పందేలలో రైతులు ఉత్సాహంగా పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. పోటీల కోసం అన్ని ఏర్పాట్లను ముందస్తుగా చేశామన్నారు. గ్రామస్తుల సహకారంతో భోజన వసతులను కల్పించామన్నారు. మొదటి బహుమతి 11000, రెండవ బహుమతి 9000,
మూడవ బహుమతి 8000 అందజేశామని తెలిపారు.

# కొచ్చెరి మైశమ్మను దర్శించుకున్న సర్పంచు

**నిజాంసాగర్, జనవరి 11(వుదయం ప్రతినిధి):**

నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ సర్పంచు గురప్రు సుమిత్ర శ్రీనివాస్ ఆదివారం నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరిమైశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామసర్పంచుగా ఘన విజయం సాధించిన సందర్భంగా కొచ్చెరి మైశమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు సర్పంచు పేర్కొన్నారు. మాగి గ్రామ కార్యకర్తలు, పంచాయతీ కార్యవర్గ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని తమ గ్రామాన్ని, ప్రజలను, పాడిపంటలను, పశుపక్షాదులను చల్లంగ చూడుమంటూ అమ్మవారిని వేడుకున్నారు.



# సహకార బ్యాంకు జిల్లా అప్రైజర్ అధ్యక్షుడిగా శ్రీరాముల గంగాధర్



**జన్నారం ,వుదయం:**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీ బ్యాంకు అప్రైజర్ అధ్యక్షుడిగా శ్రీరాముల గంగాధర్ ను ఎన్నుకున్నారు.ఆదివారం రోజున జన్నారం పట్టణంలో రాష్ట్ర జిసిసి బ్యాంకు అప్రైజర్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఎన్నికలలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్, గౌరవ అధ్యక్షుడుగా కడర్ల గంగనరసయ్య, సెక్రెటరీగా శ్రీరామోజు నరేష్, కోశాధికారిగా శ్రీరామోజు శరత్, కార్యవర్గ సభ్యులుగా శ్రీరామోజు భూపేష్, నవీన్, బాలయ్య, వెంకటాచారి, శ్రీనివాస్,మురళి లను ఎన్నుకున్నారు.ఇప్పటికే ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతుండగా జిల్లా అధ్యక్ష పదవిని అప్పజెప్పడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని అలాగే అప్రైజర్ల సమస్యలు పరిష్కరించుటకు కృషి చేస్తానని అన్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు అప్రైజర్లు పాల్గొన్నారు.

# మణికొండ నేతాజీ పార్క్ లో యోగ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్ మణికొండ ;భారత యోగా సంస్థ ఆధ్వర్యములో మణికొండ నేతాజీ పార్క్ లో ప్రోత్సాహకరంగా నెక్నంపూర్ పరిధిలోని స్కెలా అపార్ట్మెంట్ కమ్యూనిటీలో యోగ సెంటర్ ఆదివారం రోజున ప్రారంభోత్సవం అయినది. అందుకు ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ కులకర్ణి, డిస్ట్రిక్ట్ 1 ప్రెసిడెంట్ వర్ధన్ నాయక్, సెక్రటరీ యుగంధర్, ఆర్గనైజ్ సెక్రటరీ లక్ష్మణ రావు, జోనల్ ప్రెసిడెంట్ మంజు అగర్వాల్ పాల్గొన్నారు, ఈ కార్యక్రమం లో స్కెలా మరియు శివాజీ పార్క్ సాధక్స్ మరియు శిక్షక్ దీనానంద్, అపార్ట్మెంట్ కమ్యూనిటీ సెక్రెటరీ శివకుమార్ పాల్గొని అందరి మన్ననలతో ఇట్టి సెంటర్ ఇన్ఛార్జ్గా సుధాకర రావుని నియమించడమైనది మరియు ఈ రోజు నుండి ఈ సెంటర్ను భారత యోగా సంస్థలో విలీనం చేయడం జరిగినదని ఇట్టి సెంటర్ యోగ సాధనను స్కెలా అపార్ట్మెంట్ చుట్టపక్కల అపార్ట్మెంట్ వారు కూడా వినియోగించు కొని లబ్ది పొందవచ్చని నేతాజీ పార్క్ సెంటర్ ఇంచార్జి బి. సుగుణ తెలిపారు.

## జిన్నారం మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ
# సన్నాహక సమావేశం



**జిన్నారం ,వుదయం :**

జిన్నారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం గౌడ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక, గెలుపు అవకాశాలు ఉన్న స్థానాలు, ఎన్నికల వ్యూహాలపై పార్టీ నాయకులు ప్రత్యేకంగా చర్చించారు. ప్రభుత్వం మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించాలన్నారు. రానున్నది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని నాలుగు వార్డులను కైవసం చేసుకుని గులాబీ జెండా రెపరెపలాడించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# గుమ్మడిదలలో మెగా రక్తదాన శిబిరం



**గుమ్మడిదల ,వుదయం:**

గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కరేటే కళ్యాణి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. మంచి ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని చేపట్టిన ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్ కుమార్ ను అభినందించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవడం పునర్జన్మతో సమానమన్నారు.

రక్తదానం చేసిన యువతి యువకులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బిక్షపతి రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీలు



**గుమ్మడిదల, వుదయం :**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం కేసీఆర్ కాలనీలో ఆదివారం కమిటీ సభ్యులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో కాలనీ మహిమలు ఉత్సాహంగా పాల్గొని అందమైన రంగవల్లులు వేశారు. మూడు ఉత్తమ రంగవల్లులను ఎంపిక చేసి ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు ప్రధానం చేశారు. వీరిలో మొదటి బహుమతి అక్షయ సరళ, ద్వితీయ బహుమతి సోనాలి, తృతీయ బహుమతి మంజుల, ప్రోత్సాహక బహుమతి ప్రీతీలకు అందించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

# మూడు మున్సిపాలిటీలకు బి ఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

**జిన్నారం,వుదయం:**

జిన్నారం గడ్డపోతారం గుమ్మడిదల మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం సమన్వయకర్తలను నియమించారు. పార్టీ ఆదేశాలను అనుసరిస్తూ ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసేలా ఆదేశించారు. జిన్నారం మున్సిపాలిటీకి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, గడ్డపోతారం మున్సిపాలిటీకి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సోమిరెడ్డి, గుమ్మడిదల మున్సిపాలిటీకి డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం లను కేటీఆర్ నియమించారు.

# లీజ్ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలి

## జెన్కో అధికారులకు కేసారపు రవి గట్టి హెచ్చరిక

**మల్హార్రావు, వుదయం :**



ఎనిమిదేళ్లుగా డేంజర్ జోన్‌లో నిత్య ప్రాణాపాయ పరిస్థితుల్లో జీవిస్తున్న తాడిచెర్ల, కాపురం గ్రామాల ప్రజలను యుద్ధ ప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యతను పూర్తిగా విస్మరించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (GENCO) అధికారులు, ఇప్పుడు ఇళ్లను లీజుకు తీసుకుంటాం, నెలనెలా డబ్బులు ఇస్తాం అంటూ చేస్తున్న ఆలోచన ప్రజల ప్రాణాలతో బహిరంగంగా చెలగాటమాడడమేనని తాడిచెర్ల–కాపురం గ్రామాల జెన్కో భూనిర్వాసిత హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి తీవ్రంగా విమర్శించారు.డేంజర్ జోన్‌లో ప్రజలను అలాగే ఉంచి, అద్దెల పేరుతో సమస్యను తాత్కాలికంగా కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం తీవ్రమైన పరిపాలనా నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఆయన అన్నారు. ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగితే, దానికి పూర్తి బాధ్యత జెన్కో అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కేసారపు రవి మాట్లాడుతూ, డేంజర్ జోన్‌లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎనర్జీ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని బేఖాతరు చేస్తూ జెన్కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు అత్యంత ఆందోళనకరం అని మండిపడ్డారు.ఉన్నత అధికారుల ఆదేశాలను కూడా అమలు చేయని తీరును చూస్తే, ప్రజల ప్రాణాల పట్ల జెన్కో అధికారులకు ఎలాంటి బాధ్యతాభావం ఉందో అర్థమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు.ఇక మరోవైపు, జెన్కో అధికారులు విద్యుత్ మీటర్లు ఉండాలి, ఇంటి పన్నులు చెల్లించి ఉండాలి, మొదటి సర్వేలో ఉన్న ఇండ్లకే చెల్లిస్తాం అంటూ నిబంధనలు విధించడం అవివేకపు, మానవత్వ రాహిత్య నిర్ణయంగా కేసారపు రవి తీవ్రంగా ఖండించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న ప్రజలను ముందుగా రక్షించాల్సిన బాధ్యతను వదిలేసి, ఇప్పుడు డాక్యుమెంట్ల పేరుతో షరతులు విధించడం చట్ట స్ఫూర్తికి, రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధం అని ఆయన అన్నారు.మొదటి సర్వే పేరుతో కొందరినే అర్హులుగా చూపి, మిగిలిన కుటుంబాలను పునరావాసం నుంచి తప్పించాలనే ఆలోచన ఉద్దేశపూర్వకమైన అన్యాయ చర్యగా ఆయన అభివర్ణించారు. డేంజర్ జోన్‌లో నివసిస్తున్న ప్రతి కుటుంబం — ఇల్లు రకం, విద్యుత్ మీటర్, ఇంటి పన్నులు ఉన్నా లేకపోయినా — రాష్ట్ర రక్షణకు అర్హులేనని, జీవించే హక్కును రాజ్యాంగం హామీ ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.భూ నిర్వాసితులు జెన్కో ఉద్యోగాలు గానీ, దయాపూరిత ప్యాకేజీలు గానీ అడగడం లేదని కేసారపు రవి తేల్చి చెప్పారు. తమ ఏకైక, స్పష్టమైన, న్యాయమైన డిమాండ్ — డేంజర్ జోన్ నుంచి శాశ్వత పునరావాసంఎలాంటి షరతులు లేకుండా గెజిట్ చేసిన ప్రతి ఇంటికి పూర్తి నష్టపరిహారంఅని ఆయన ప్రకటించారు.బడ్జెట్ లెక్కల కోసం ప్రజల ప్రాణాలను తక్కువగా చూడటం ప్రజాస్వామ్య పరిపాలనకు ప్రమాదకర సంకేతం అని ఆయన హెచ్చరించారు. చట్టాలు, నిబంధనలు, మానవ హక్కులు పక్కనపెట్టి తీసుకునే నిర్ణయాలు ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయని ఆయన అన్నారు.ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, లీజ్ వంటి తాత్కాలిక ఆలోచనలతో సమస్యను తప్పించుకునే ప్రయత్నం కొనసాగితే —తెలంగాణ లోకాయుక్తలో అధికారులపై ఫిర్యాదు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL) శాంతియుత ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయడంతప్పదని కేసారపు రవి స్పష్టంగా హెచ్చరించారు.తాడిచెర్ల ప్రజల సహనాన్ని బలహీనతగా భావించవద్దని, ఇది ప్రజల ప్రాణాల కోసం జరుగుతున్న పోరాటమని, శాశ్వత పునరావాసం సాధించే వరకూ ఉద్యమం ఆగదని ఆయన తేల్చి చెప్పారు.


# పుల్లూరు బండ జాతరకు హరికృష్ణకు ఆహ్వానం

**వుదయం, సిద్దిపేట:**



జనవరి,సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో ఈ నెల 17 నుంచి 24 వరకు నిర్వహించనున్న శ్రీ సుదర్శన నరసింహ యాగ మహోత్సవం – పుల్లూరు బండ జాతర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి గౌరవనీయులు పూజల హరికృష్ణ గారికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందజేశారు.ఈ మేరకు సిద్దిపేటలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఆలయ చైర్మన్ కనకయ్య గారు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి హరికృష్ణ గారికి ఆహ్వాన పత్రికను మర్యాదపూర్వకంగా అందజేశారు.ఈ సందర్భంగా పుల్లూరు బండ ఆలయ చైర్మన్ కనకయ్య గారితో పాటు ఆలయ కమిటీ సభ్యులు దేవిరెడ్డి, ఒగ్గు యాదయ్య, గొడుగు రవి, పర్వ రాములు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.అలాగే ఈ కార్యక్రమంలో చిన్న కోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్, రాములు బుగ్గ రాజేశ్వర చైర్మన్ కరుణాకర్ భాగన్న, వాహబ్, నాంచార్పల్లి సర్పంచ్ పురుమాండ్ల నర్సింహా రెడ్డి, ఎర్ర మహేందర్, కృష్ణమూర్తి, రషద్, రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్




**వుదయం , కొండపాక:**

మండల పరిధిలోని జప్తినాచారం గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన ముస్త్యాల నర్సింలు గతంలో అనారోగ్యానికి గురైప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స చేసుకోగ తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి,
మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హనుమంత్ రావు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 24500 రూపాయలు మంజూరు కాగా అట్టి చెక్కును అదివారం రోజులబ్దిదారునికిఅందించారుఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవీందర్ గౌడ్, గజ్వేల్ నియోజకవర్గం ఆత్మ కమిటీ డైరెక్టర్ పబ్బోజు వీరబ్రహ్మం, గ్రామ ఉపసర్పంచ్ ముస్త్యాల నర్సిములు,వార్డు సభ్యులు ముస్త్యాల శ్రీకాంత్,గ్రామ ప్రజలు వడ్లకొండ మల్లేశం గౌడ్,ముస్త్యాలమల్లయ్య,ముస్త్యాల బాలస్వామి,వడ్లకొండమధు,సంపత్,వడ్లకొండ బాల్ రాజు తదితరులు కలిసి.

# సిద్దిపేట జిల్లా రద్దు ప్రయత్నాలు ప్రజలపై దాడే



– బీఆర్ఎస్ నేతల హెచ్చరిక

వుదయం , సిద్దిపేట :సిద్దిపేట జిల్లా అనేది ఎన్నో ఏళ్ల ప్రజల కల అని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలం నుంచే సిద్దిపేట జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. 1983లోనే సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్‌లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు కేసీఆర్ వినతిపత్రం అందజేశారని తెలిపారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాధాకృష్ణ శర్మతో పాటు సిద్దిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం మాట్లాడుతూ, పరిపాలన సౌలభ్యం కోసం ప్రజల ఆకాంక్ష మేరకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేయాలనే కుట్రకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేసీఆర్ మరియు హరీష్ రావులపై రాజకీయ కక్షతోనే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు.సిద్దిపేట జిల్లా నుంచి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని వేరు చేసి కరీంనగర్ జిల్లాలో కలుపుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించడం అన్యాయం అని, ఇది సిద్దిపేట జిల్లా రద్దుకు సంకేతమని అన్నారు. ఇది ప్రజలను మోసం చేయడమేనని తీవ్రంగా ఖండించారు.సిద్దిపేట జిల్లా రద్దు చేస్తే ప్రజలకు పోరాటం ఎలా చేయాలో బాగా తెలుసని,
జిల్లా కోసం ఎలాంటి ఉద్యమానికైనా సిద్ధమని హెచ్చరించారు. జిల్లా రద్దు జరిగితే తీవ్ర పరిణామాలు తప్పవని స్పష్టం చేశారు.కేసీఆర్ పేరును లేకుండా చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, ఆయన ప్రవేశపెట్టిన పథకాలను నీరుగార్చడమే కాకుండా జిల్లాలను కూడా రద్దు చేయాలనే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి అంశాలను తెరపైకి తెస్తోందన్నారు.సిద్దిపేట జిల్లా రద్దుపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందని, ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం గానీ, మంత్రులు గానీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లాలో కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వబోమని హెచ్చరించారు.ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, కాముని శ్రీనివాస్,
మోహన్ లాల్, బాలకృష్ణారెడ్డి, రవీందర్ రెడ్డి, కనకరాజు, అల్లం ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# అహ్మదీపూర్ లో మహిళా ముగ్గుల పోటీల ప్రదర్శన

**గజ్వేల్, వుదయం:**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామ పంచాయతీ పాలక వర్గం, సంతూర్ సోప్స్ వారి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ మహిళలందరూ దాదాపు 200 మందికి పైగా సంక్రాంతి పండుగ ముందుగ ముగ్గులసందడిగా ఒకరికొక్కరు ముగ్గుల పోటీలలో రంగురంగుల కళాకృతమైన పోషణలో వారి ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా డాక్టర్ శైలజ, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ భవాని మరియు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు అన్నపూర్ణ,సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్ హాజరయ్యారు. ముగ్గుల పోటీలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ
మహిళా చైతన్యమే మేలుకొలుపుగా కళాపోషను వెలికితీస్తూ... ముగ్గుల పోటీల అందాలను తిలకించేలా ప్రతిభను చాటుకున్నారు.
మహిళలు చైతన్యమే అందరికి స్ఫూర్తిధయకమన్నారు. నేటి మహిళలే ప్రగతి చైతన్యమే భావితరానికి దిక్కుచ్చి గా నిలబడతారు అన్నారు. అనంతరం ప్రతిభావంతులైన మహిళలందరికీ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనమైన సన్మానం చేసి వారి ప్రతిభను ప్రశంసించరూ. ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి శ్రీలత, ద్వితీయ బహుమతి హాసిని తృతీయ బహుమతి లత, చతుర్థ బహుమతి పాల భారతి మరో 12మంది మహిళలకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు అన్నపూర్ణ,ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డుమెంబర్లు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి వార్డ్ మెంబర్లు కనక రాజు, శ్రవంతి, రాజు, భాగ్యలక్ష్మి , కుమార్, రజిత,
మంజుల, స్వప్న, సంతోష్, రాంచంద్రం, రాములు,నాగరాజు పవనసుత ఏజెన్సీ నిర్వాహకురాలు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# నేరెళ్లలో యువకుడి అదృశ్యం

**ధర్మపురి, వుదయం:**



మండలంలోని నేరెళ్ల గ్రామంలో మంద నరేష్ (35) అనే యువకు డు అదృశ్యమైనట్లు ఎస్సై జి.మ హేష్ తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మంద శంకరమ్మ,సత్తన్నల చిన్న కుమారుడైన నరేష్ తన కుటుంబంతోకలిసి వేరుగా ఉంటున్నాడు.శనివారం (జనవరి 10న) మధ్యాహ్నం 12 గంటల సమయంలో కిరాణా షాపుకు వెళ్లి వస్తాను అని భార్య తో చెప్పి బయటకు వెళ్లాడు.రాత్రి అయినా నరేష్ తిరిగి రాక పోవడం తో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు,బంధువులు చుట్టుపక్క ల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆదివారం నాడు యువకుడి తల్లి శంకరమ్మ ధర్మపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# కలం ఆగింది.. కథనం మిగిలింది!

## జర్నలిస్ట్ ఫసల్ రెహమాన్ మృతికి కొవ్వొత్తుల నివాళి ధర్మపురి ప్రెస్ క్లబ్


**ధర్మపురి ,వుదయం :**



నిబద్ధత గల జర్నలిజానికి నిలువుటద్దం, గ్రామీణ సమస్యల గొంతుక ఫసల్ రెహమాన్ అకాల మృతి పట్ల జర్నలిస్టు లోకం కన్నీటి నివాళి అర్పించింది. ధర్మపురి టీయూడబ్ల్యూజే (ఐజేయు)ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మధు. మహాదేవ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణం లో నంది చౌరస్తా వద్ద ఫెసల్ చిత్రపటానికి కొవ్వొత్తుల నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.సురేందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తల్లో విలువల సంతకం ఫసల్ రెహ మాన్ తన సుదీర్ఘ ప్రస్థానంలో సాక్షి, ప్రజాతంత్ర, ఆంధ్రప్రభ, దిశ వంటి ప్రముఖ దినపత్రికల్లో సబ్ ఎడిటర్‌గా,విలేకరిగా విశేష సేవలు అందించారు.ముఖ్యంగా ఆయన రాసిన 'కారాలత్వ కరచాలనం' వంటి కథనాలు అప్పట్లో సంచల నం సృష్టించాయి. నగరాల్లో నివసిస్తున్నప్పటికీ, ఆయన కలం ఎప్పుడూ పల్లె కన్నీటినే తుడి చింది.చదువురాని సామాన్యులు, వెనుకబడిన వర్గాల ప్రజలు, కార్యాలయాల్లో నిశబ్దంగా పనిచేసే అటెండర్ల జీవితాలపై ఆయన రాసిన కథనాలు జర్నలిజంపై ఆయనకున్న మక్కువకు నిదర్శ నమని సహచర జర్నలిస్టులు కొనియాడారు.క్షేత్రస్థాయి సమస్య లను పాలకుల దృష్టికి తీసుకెళ్ల దంలో ఫసల్ ఎప్పుడూ ముందుం దేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ధర్మపురి ప్రెస్ క్లబ్ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలిపి ఆయన ఆత్మకు శాంతి చేకూరా లని కోరారు.ఈ నివాళి కార్యక్ర మంలో ఐజేయు మహిళా ఈసీ మెంబర్ బి.పవిత్ర సంపత్, చిలుముల.రాజేందర్,కస్తూరి ప్రవీణ్,బాకీ చందు,మైదం.తిరు పతి,కొండా.వినయ్,గడిపెల్లి వెంకన్న ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శాలువతో సన్మానం

## టిఎంపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగుల రాజు



**మర్కుక్, వుదయం:**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల్ వరదరాజపూర్ గ్రామంలో ఆదివారం వరదరాజ స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ కాంటెస్ట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మరియు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి ఆశీర్వాదాలు తీసుకున్నారు. నీలం మధు ముదిరాజ్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిసి వారిని టిఎంపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగుల రాజు ముదిరాజు శాలువాతో ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, జగదేపూర్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# చైనా మంజా విక్రయించినా వినియోగించినా కేసులు నమోదు

**ఏన్కూరు, వుదయం:**




మండలంలో చైనా మంజా నిషేధం అమలులో ఉందని ఏన్కూరు ఎస్ఐ.నారబోయిన సంధ్య తెలిపారు.ఈ సందర్భంగా విలేఖరులతో ఎస్ఐ. నారబోయిన సంధ్య మాట్లాడుతూ..నిషేధాన్ని ఉల్లంఘించి విక్రయించే వ్యా పారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఉల్లంఘిస్తూ చైనా మంజాను విక్రయించినా..వినియోగించినా..లేదా దాని వలన ఎవరికైనా ప్రమాదం సంభవించినట్లయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరిం చారు.భోగి..సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని..మండల వ్యాప్తంగా స్థానిక పోలీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.చైనా మంజా పర్యావరణానికి..హాని కలిగించడంతో పాటు ప్రజలు..వా హనదారులు..పాదాచారులకు.. పక్షులకు ప్రాణాపాయం కలిగించే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు.మండల పరిధిలో ఎక్కడా చైనా మంజావి క్రయాలు జరగకుండా కఠి న చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.చైనా మంజా పై నిషేధం ఉ న్నందున ఎవరైనా చైనా మంజాతో పతంగులు అమ్మిన..అట్టివారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.ప్రజలు చైనా మంజాను ఉపయోగించకుండా..ఎవరికి హాని కలగని సాధారణ దారంతో గాలి పటాలు ఎగురవేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఉపాధిలో డిజిటల్ ఫోటోల హవా

## ఉపాధిలో ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం..

**మహబూబాబాద్ జిల్లా ,వుదయం:**




జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద ప్రజల జీవనోపాధికి ఎంతో తోడ్పడుతుంది ఈ పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఒక వరంగా భావిస్తారు. వలసలు తగ్గించాలని పేద ప్రజలు నివసించే చోటే ఉపాధిని కల్పిస్తూ ప్రజలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని బూడిదలో పోసిన పన్నీరుల వృధా చేస్తున్నారు. ఉపాధిలో అవకాతవకలకు పాల్పడుతూ తప్పుడు ఫోటోలతో హాజరు నమోదు చేస్తూ పనిలో హాజరుకాని కూలీల పేర్లపై కూడా డిజిటల్ ఫోటోలను అప్లోడ్ చేస్తూ ప్రభుత్వం సృష్టించిన హాజరు నమోదు చేసే ఎన్ఎంఎంఎస్ యాప్ నే బురిడీ కొట్టిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు వారి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఉపాధి కూలీలు పని ప్రదేశంలో ఉన్న సమయంలో ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలనే ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా నకిలీ డిజిటల్ ఫోటోలు అప్లోడ్ చేస్తూ ఉపాధి నిధులను పక్కదారి పట్టియడమే కాకుండా సంబంధిత జిల్లా అధికారుల ఆదేశాలను సైతం తుంగలో తొక్కుతున్న వైనం. వివరాల్లోకి వెళితే గార్ల మండలం గార్ల గ్రామపంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం హాజరు నమోదు చేసే ఎన్ఎంఎంఎస్ యాప్ లో ఫీల్డ్ అసిస్టెంట్ వారం రోజులపాటు రోజుకి 24 మంది కూలీల కంప్యూటర్ డిస్ప్లే పై మరియు ఫోన్ డిస్ప్లే పై ఉన్న డిజిటల్ ఫోటోలు అప్లోడ్ చేస్తూ హాజరు వేసే ఎన్ఎంఎంఎస్ యాప్ ని బురిడీ కొట్టించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా మండల పర్యవేక్షణ అధికారులు స్పందించి జరిగిన అవకతవకలపై విచారణ చేసి సంబంధితలపై చర్యలు తీసుకుంటారా ,లేదా అనే విషయంపై వేచి చూడాలి.గార్ల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ కోరగా..గార్ల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ డిజిటల్ ఫోటోలు అప్లోడ్ చేయడం విషయంపై వివరణ కోరగా ఫీల్డ్ అసిస్టెంట్ మాట్లాడుతూ. ఇంతకు ముందు ఆగిపోయిన పేమెంట్ లకి హాజరు నమోదు చేస్తున్నాను . వారికి డబ్బులు ఇప్పించాలి కదా అందుకే డిజిటల్ ఫోటోలు అప్లోడ్ చేయవద్దు కానీ చేస్తున్నాను. అయిన అది దొంగ పేమెంట్లు ఎలా అవుతాయి. కాదు కదా దొంగ పేమెంట్ అయితే మీరు మాట్లాడాలి. ఏదో విలేకరిని అని మాట్లాడితే భయపడతానా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో ఎవరికీ పెట్టుకున్న నేను భయపడను అని అన్నారు.గార్ల ఉపాధి ఏపీవో వివరణ కోరగా.. గార్ల ఉపాధి హామీ పథకంలో తప్పుడు డిజిటల్ ఫోటోలు హాజరు నమోదు చేసే ఎన్ఎంఎంఎస్ యాప్ లో అప్లోడ్ చేయడంపై గార్ల మండలం ఉపాధి ఏపీవో వివరణ కోరగా. వారు మాట్లాడుతూ.. అలా పెడితే యాప్ ఫోటోలు తీసుకోదు అలా పెడుతున్నారనే విషయం నాకు తెలియదు. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ ను అడిగితే ఇంతకుముందు ఆగిన పేమెంట్లు హాజరు నమోదు చేస్తున్నానని చెప్పాడు. నేను ఒకసారి హాజరు నమోదు చేసిన కార్డులు ఎవరివో కూలీలను పిలిపించి విచారించి. అలా తప్పుడు డిజిటల్ ఫోటోలు అప్లోడ్ చేయటం తప్పు అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటానని చెప్పారు.

# బీసీ రిజర్వేషన్ తేల్చినాకే ఎన్నికలకు పోవాలి: నూనె హరిబాబు

**వేంసూర్ ,వుదయం :**



42 శాతం బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే జిహెచ్ఎంసి, ఎంపీటీసీ, జడ్పీటీసీ మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని. బీసీ జెఏసి తెలంగాణ కో కన్వీనర్ నూనె హరిబాబు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం వేంసూర్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ సరైన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అందక పోవడం అన్యాయం అన్నారు. అత్యధిక జనాభా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యం లేకపోవడం బాధాకరమన్నారు. రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్లపై మాట్లాడుతున్నారని. కామారెడ్డి డిక్లరేషన్ అమలులో రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్ణయం తీసుకొని బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రకటించిన తర్వాతనే ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు..

# 108 సిబ్బంది సమయస్ఫూర్తితో... తల్లీబిడ్డ క్షేమం

**వుదయం , నల్లగొండ జిల్లా:**



ప్రసవ నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది ఆపద్బాంధవులయ్యారు. ఆసుపత్రికి తరలించేలోపే నొప్పులు తీవ్రమవడంతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆమె ఇంటివద్దే సుఖప్రసవంచేశారు. నల్లగొండ జిల్లా,కట్టంగూర్ మండల పరిధిలోని ఈదులూరు గ్రామానికి చెందిన గద్దపాటి వెంకన్న భార్య ముస్కు ధనలక్షి (24)కు రెండో కాన్పు నిమిత్తం పురిటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు.శాలిగౌరారం నుంచి వచ్చిన అంబులెన్స్ చేరుకునే సరికి ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే ప్రసవం జరిగే అవకాశం ఉందని గుర్తించిన వైద్య సహాయకుడు రమేష్, వాహన చోదకుడు యాదగిరి ఆలస్యం చేయకుండా నిర్ణయం తీసుకున్నారు.కుటుంబ సభ్యుల సహకారంతో ఇంట్లోనే సుఖప్రసవం చేయించారు. తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. అనంతరం తల్లీబిడ్డలను మెరుగైన వైద్యం కోసం నల్లగొండ మాతా–శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.అత్యవసర సమయంలో ధైర్యంగా వ్యవహరించిన 108 సిబ్బందిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

# దుద్దెపూడి గ్రామంలో సంక్రాంతి సంబరాలు

**వేంసూరు ,వుదయం:**



దుద్దెపూడి సర్పంచ్ మోరంపూడి అనసూయ కుమారుడు మోరంపూడి శ్రీదర్ బాబు ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయి. ఈ సంక్రాంతి సంబరాలలో దుద్దెపూడి గ్రామ ప్రజలు పిల్లలు ,పెద్దలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సంబరాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లల పెద్దలకు కబడ్డీ పోటీలు, స్త్రీల, పురుషులకు బెలూన్ వాక్ పోటీలు , 100 మీటర్ల పరుగు పందెం పోటీలు జరుగుతాయి, ఆదివారం ముగ్గుల పోటీలు,మరియు బెలూన్ వాక్ జరుగుతుండగా రేపు, మంగళవారం కబడ్డీ పోటీలు, పరుగు పందెం పోటీలు జరగనున్నాయి.ఈ సంబరాలలో ఇప్పటికే సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాల నుండి గ్రామానికి వచ్చిన వారంతా ఈ సంక్రాంతి సంబరాలలో సంతోషంతో పాల్గొంటు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడు ఇలాంటి సంక్రాంతి సంబరాలు జరగలేదు ఇప్పుడే క్రొత్తగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో జరుగుతుండగా దుద్దేపూడి గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువతీ, యునకులు, పిల్లలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈనెల 16న రామాలయంలో గోదాదేవి కళ్యాణోత్సవం



- రామాలయంలో ఘనంగా కూడారై ప్రసాద ఉత్సవం...

**వుదయం నాగర్ కర్నూల్ :**

ధనుర్మాస ప్రత్యేక పూజా కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు 27వ రోజు శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుడారై ప్రసాద ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. కుడారై ప్రసాద విశిష్టతను భక్తులకు తెలిపారు.నీరు లేకుండా స్వచ్ఛమైన ఆవు పాలు,ఆవు నెయ్యి డ్రై ఫ్రూట్స్ తో మాత్రమే ప్రత్యేకంగా చేసిన ప్రసాదమని,ఇదిఎంతోపవిత్రత, ఆరోగ్యానికి విశిష్టమైన ప్రసాదమని అన్నారు. రామాలయంలో ఈనెల 16న గోదాదేవి కళ్యాణోత్సవం వేదమూర్తులైన బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంత భక్తులు ధనుర్మాసం నెలరోజులు పాటు చేసి నపూజాఫలితం, గోదాదేవి కళ్యాణం చేయడంతో భక్తులు విశేషంగా పుణ్యం పొందవచ్చునని అన్నారు. కళ్యాణం అనంతరం భక్తులందరికీ రామాలయ అన్నప్రసాద కమిటీ వారిచే సామూహిక భోజనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదా కళ్యాణం లోపాల్గొనే దంపతులు,భక్తులు ఆలయ పూజారిని నేరుగా లేదా సెల్ 9440981253 నెంబర్ లో సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కందాడై శ్రీనివాసచార్యులు,పద్మ, కరుణశ్రీ,గోమటం మురళీమోనాచార్యులు, రాధా, శ్రీనివాసచార్యులు, అర్ధం రవీందర్,టి. మల్లేష్, గొల్ల రాములు,మన్యపు రెడ్డి, రమాదేవి,స్వామి,రాజు, పాండు,పుల్లయ్య సాయిభక్తులు, వికాస తరంగిణి సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై వెంకటేశ్వర్లు

**వుదయం నారాయణపేట:**

దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ నారాయణపేట ఎస్సై వెంకటేశ్వర్లు కర పత్రాలు పంపిణీ చేశారు.జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండగను దృష్టిలో ఉంచుకు ని నారాయణపేట పట్టణ కేంద్రంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విస్తృతంగా కాలనీల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ కరపత్రాలు ముద్రించి కాలనీలలో ప్రజలకు దొంగతనాల పట్ల అవగాహన కల్పించి కరప త్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా పిల్లలకు సెలవులు ఉండ టంతో పాటు పండగకు చాలామంది ప్రజలు తమ స్వగ్రామాలకు, విహార యాత్రలకు వెళ్లే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు, తమ విలువైన వస్తువులు బంగారం వెండి, నగదు ఇంట్లో ఉంచరాదని తెలి పారు. మీకు దగ్గర్లోని నమ్మకమైన బ్యాంకులు లాకర్లు దాచుకోవాలని లేదా వెంట తీసుకువెళ్లాలని సూచిం చారు. వేరే ఊరికి వెళ్లేవారు పాలవారు, పేపర్ వారు రాకుండా ముందే సమాచారం ఇవ్వాలని, ఇంట్లో లైట్ వేసి ఉంచాలని, ఇంటికి గట్టి తాళాలు వేసి పక్కా ఇంటి వారికి లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.దాంతో మీ ఇంటిపై నిగా ఉంచి పెట్రోలింగ్ నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. అలాగే ప్రయాణంలో ఉన్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకో వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు తినుబండారాలస్తే తీసుకోరాదని లగేజ్ బ్యాగ్స్ విలువైన వస్తువులు జాగ్ర త్తగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా దొంగతనాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను కాలనీల్లోని ప్రజలకు పంపిణీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం వంటి సూచనలు కరపత్రాల ద్వారా వివరించా రు. పండగ సమయంలో



దొంగతనాలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, సంక్రాంతి పండుగ రోజు విలువైన బంగారు వస్తువులు వేసుకొని ముగ్గులు వేసే టాప్పుడు చైన్ స్నాచింగ్ అయ్యే అవకాశం ఉంటుంది అని ప్రతి ఒక్కరూ అప్రమ త్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వా లని, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**చైనా మాంజా విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు:**

చైనా మాంజా ద్వారా గాలిపటాలు ఎగరేస్తే చాలామందికి గొంతు, చేతులు కట్ అయ్యే అవకాశం ఉన్నందున అలాగే జంతువులు తగిలి జంతువులు చనిపోయే ప్రమాదం ఉన్నందున చైనా మంజను గాలిపటాలు అమ్మే షాపులను తనిఖీ నిర్వహించి షాపుల యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమంలో నారాయణపేట పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని ప్రజలకు భద్రతా సూచనలు అంద చేశారు.

# కాంగ్రెస్ నేత జన్మదిన వేడుకలు

**వు దయం వెల్దండ :**



కాంగ్రెస్ నాయకులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి,, నాగర్ కర్నూల్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామ కృష్ణ, సంజీవ యాదవ్, మట్ట వెంకట గౌడ్, తోపాటు కాంగ్రెస్ నాయకులు అభిమానులు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జంగయ్య యాదవ్ చేత కేక్ కట్ చేయించి తినిపించి శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

# రెడ్డి సేవా సమితి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**వు దయం వెల్దండ :**

పాలమూరు రెడ్డి సేవా సమితి కల్వకుర్తి నియోజకవర్గం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ఆవిష్కరించారు మండల కేంద్రంలోని తోడేటి చెన్నారెడ్డి ఫంక్షన్ హాల్ లో ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గ రెడ్డి సేవాసమితి అధ్యక్షులు పసుల శేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి రెడ్డి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సేవలో ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవింద్ రెడ్డి, కోశాధికారి కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి, రాజేందర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చెన్నారెడ్డి, జంగారెడ్డి, దేవేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి భారతమ్మ, విజయలక్ష్మి, తోపాటు రెడ్డి సేవాసమితి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అక్రమంగా ఇసుక ను తరలిస్తున్న వాహనం సీజ్

**వుదయం సంగారెడ్డి జిల్లా :**



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను గుర్తించడంతో స్టేషన్ కు తరలించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన వాహనాల యజమానుల సూచనలతో తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పరివాహక ప్రాంతం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్ వాహనాల డ్రైవర్లను వాహనాల తనిఖీలు భాగంగా పట్టుకున్నారు సంగారెడ్డి పట్టణం నుండి బయలుదేరి అల్లాదుర్గం డగ్ బంగ్లా నుండి వట్పల్లి మీదుగా బీదర్ వెలుతున్న క్రమంలో వట్పల్లి ఎస్సై లవ కుమార్ తన సిబ్బందితో వట్పల్లి రహదారి పై ఆదివారం రెండు గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండడంతో ఇసుక లోడుతో వస్తున్న వాహనాలను తనిఖీ చేయడంతో డ్రైవర్ల వద్ద ఇసుకకు సంబంధించిన డాక్యుమెంట్లు లేకపోవడంతో పట్టుకొని స్టేషన్కు తరలించరు kA 32 AA 1765 మరియు T S 08 u G 7892 వాహనాల తో డ్రైవర్ల షేక్ అబ్దుల్ మొబిన్ 36 యాదులు పాషా2

# వడ్డే ఓబన్నకు ఘన నివాళి



**వుదయం, జిన్నారం :**

బొల్లారం డివిజన్ పరిధిలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను సంగం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకల్లో మాజీ జడ్పిటిసి బాల్రెడ్డి సంఘం సభ్యులతో కలిసి వడ్డే ఓబన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. వడ్డే ఓబన్న గొప్ప స్వాతంత్ర సమరయోధుడని ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. అదేవిధంగా పట్టణంలోని ప్రధాన వీధులలో సంఘం సభ్యులతో కలిసి మాజీ కౌన్సిలర్ వేణుపాలిరెడ్డి యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డిలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం సభ్యులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డె ఓబన్న 219వ జయంతి వేడుకల్లో పాల్గొన్న గట్టు యు.శ్రీనాథ్



**వుదయం గద్వాల:**

గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రం లోని ఒడ్డె ఓబన్న 219వ జయంతిని పురస్క రించుకొని ఆదివారం గొర్లఖాన్దొడ్డి రోడ్ సర్కిల్ లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన. స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యు.శ్రీనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గట్టు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యు శ్రీనాథ్ మాట్లాడుతూ తెలుగు నేల గర్వపడే పోరాట యోధుడు స్నేహానికి అర్థం చెప్పిన రేనాటి వీరుడు వడ్డే ఓబన్న. స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైన్యాధిపతిగా ఉంటూ బ్రిటిష్ సామ్రాజ్యానికే సవాల్ విసిరిన అనుచరుడుగా పనిచేస్తూ చేసి తమ ప్రాణాలను అర్పించి కొనియాడారు. అని అన్నారు గట్టు మండల కేంద్రం లోని గట్టు వడ్డెర సంఘానికి భవిష్యత్తులో రాజకీయ పరంగా ఆర్థికంగా అభివృద్ధి చేసే విధంగా నా వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యు శ్రీనాథ్ తెలి పారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గట్టు గ్రామ వడ్డెర సంఘం నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి

**వుదయం గద్వాల:**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారానికి పాత్రికేయులు నిజాయితీతో కృషి చేయాలని ఆయన కోరారు. ఆదివారం గద్వాల పట్టణంలోని అనంత ఫంక్షన్ హాలులో జరిగిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జోగులాంబ గద్వాల జిల్లా మూడో మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను బయట పెట్టి సమాజ హితం కోసం పాటు పడాలని అన్నారు. తన పరిధిలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

**జర్నలిస్టుల సమస్యలపై పోరాడే సంఘం టీడబ్ల్యూజేఎఫ్**

వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం తగదని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని వచ్చి రెండేండ్లు అవుతున్నా... జర్నలిస్టులకు ఇప్పటి వరకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేండ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అక్రెడిటేషన్ల జీవో 239కి బదులు ఇటీవల 252 జీవో జారీ చేసిందని, కొత్త రూల్స్ తో జర్నలిస్టులను అయోమయానికి, ఆందోళనకు గురి చేసిందని అన్నారు. తప్పుల తడకగా ఉన్న ఈ జీవోను వెంటనే సవరించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై చిత్తశుద్ధితో పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అని, ఈ సంఘం జర్నలిస్టులకు అండగా ఉంటుందని మామిడి సోమయ్య అన్నారు. సంఘాన్ని బలోపేతం చేసి సమస్యలపై పోరాడేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర



కో కన్వీనర్లు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు తదితరులు ప్రసంగించారు. జిల్లా అడ్హక్ కమిటీ కన్వీనర్ గిరిబాబు అధ్యక్షతన జరిగిన మహాసభలో ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు అక్బర్ బాష, వనపర్తి జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఎన్నికతెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జోగులాంబ గద్వాల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికయింది. జిల్లా అధ్యక్షుడిగా బి.గిరిబాబు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, సురేష్,కె.వెంకటేష్, కేబీ తిమ్మప్ప, మహబూబ్,కార్యదర్శిగా జి.నాగరాజు, సంయుక్త కార్యదర్శులుగా మోయిజ్, రవిప్రకాష్, సిరిగిరి కృష్ణ, కోశాధికారిగా బీసన్న,కార్యవర్గ సభ్యులుగా ఇబ్రహీం, ఎం.నర్సింహులు, రాఘవేందర్, నర్సింహ్మ, నరేష్, దేవేందర్ రెడ్డి,బి.వెంకటేష్, భీముడు, గిడ్వారెడ్డి, ప్రభాకర్, కిష్టన్న, రామకృష్ణ, దేవరాజు, విష్ణువర్ధన్ గౌడ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్బర్ బాష, వెంకట్రావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎం.నర్సింహులు ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ మార్కెట్ చైర్మన్ పచ్చర్ల శ్రీధర్ గౌడ్. పటేల్ ప్రభాకర్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి. బిజ్జారం సర్పంచ్ భర్త శ్రీనివాస్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి సత్య రెడ్డి నాయకులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

# రెండవ వార్డులో పోటీ చేసే అవకాశం ఇవ్వాలి



- సత్య రఘుపాల్ రెడ్డి

**వుదయం నారాయణపేట:**

నారాయణపేట మున్సిపల్ ఎన్నికల్లో 2వ వార్డు నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సత్య రఘు పాల్ దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఎంపి అరుణమ్మ సమక్షంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ కు దరఖాస్తు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రతంగ్ పాండు రెడ్డి, జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ ఉన్నారు.

# నార్సింగి శివాలయంలో పూజలు



- బీజేపీ
- తొలిదాడి కి 1000 ఏళ్ళు పూర్తి

**వుదయం పాపన్నపేట:**

భాజపా పిలుపు మేరకు ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సోమనాథ్ స్వాభిమాన పర్వ్ 2026 కార్యక్రమంలో భాగంగా నార్సింగి గ్రామ శివారులో వెలిసిన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమనాథ్ ఆలయంపై తొలిదాడి జరిగి 1000 ఏళ్ళు పూర్తయ్యాయని,ఘజనీ నుండి మొఘల్స్ వరకు ఆలయాన్ని ధ్వంసం చేసారని భాజపా శ్రేణులు మండిపడ్డారు. స్వాతంత్ర అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో పునర్నిర్మాణం జరగగా కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారని విమర్శించారు. నరేంద్ర మోడీ హయాంలో ఆలయాల భద్రతకు పెద్ద పీట వేస్తూ రాబోయే తరాలకు ధర్మ సంస్థాపన వారసత్వంగా అందిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణితి సోమశేఖర్,జిల్లా నాయకులు బికొండ రాములు,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు,నార్సింగి ఉపసర్పంచ్ శ్రీరామ్ నరేష్,మండల ప్రధాన కార్యదర్శులు లక్ష్మణరావు,నాగభూషణం ఉపాధ్యక్షుడు బొక్కల భాగేష్,ఓబీసీ మోర్చా నాయకులు వడ్ల భాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంథని ఓపెన్ జిమ్ నూతనకార్యవర్గ ఎన్నిక



మంథని పట్టణంలోని ఓపెన్ జిమ్ నూతన కార్యవర్గాన్ని ఈరోజు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా మంథని వేణు, ప్రధాన కార్యదర్శిగా మాచిడి సత్యనారాయణ గౌడ్, ఆర్థిక కార్యదర్శిగా రావికంటి భాస్కర్, ఉపాధ్యక్షులుగా కోండ్ర వెంకటరమణ గౌడ్, కార్యదర్శులుగా గరిమెళ్ళ సత్యనారాయణ రెడ్డి, కటికనపల్లి రవీందర్, మారం సత్యనారాయణ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా మాచిడి కృష్ణ గౌడ్, టూర్ ఇన్చార్జిలుగా లోకే రాజ్ పవన్, ఒల్లాల శంకర్ లింగం గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ...... తమ ఎన్నికకు సహకరించిన ఓపెన్ జిమ్ గౌరవ సభ్యులందరికీ, మరియు మాజీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా జాతీయస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

- మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి

**వుదయం కాజీపేట:**

తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా జాతీయస్థాయి సీనియర్ మహిళలు, పురుషుల 58వ ఖోఖో పోటీలు ఉమ్మడి వరంగల్ లోని కాజీపేటలో ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి.ఈ పోటీలను రాష్ట్ర మంత్రులు రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు క్రీడా మైదానాలు, మినీ స్టేడియంల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని చెప్పారు. గత ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యము చేసిందని, తమ ప్రభుత్వం క్రీడల బడ్జెట్ ను పెంచేందుకు ప్రయత్నం చేస్తున్న దని చెప్పారు. కాగా ఐదు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సంఘ అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి తెలిపారు.భారత ఖోఖో ఫెడరేషన్ సౌజన్యంతో తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా 58వ జాతీయస్థాయి ఖో ఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సీనియర్స్ మహిళలు పురుషుల ఖోఖో పోటీలలో దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, రైల్వే, ఎయిర్ పోర్టు అథారిటీ, ఆల్ ఇండియా పోలీస్, కేంద్ర బెటాలియన్స్ నుంచి 40 పురుషుల జట్లు, 39 మహిళల జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఖోఖో పోటీల ప్రారంభోత్సవాలకు సూచికగా కాజీపేట ఫాతిమా బ్రిడ్జి నుంచి రైల్వేస్టేడియం వరకు 2వేల మంది క్రీడాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ,దొంతి మాధవ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అజీజ్ ఖాన్, వివిధ రాష్ట్రాల ఖోఖో అసోసియేషన్ ల ప్రతినిధులు, రాష్ట్ర జిల్లా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు



**వుదయం, జిన్నారం:**

బొల్లారం డివిజన్ పరిధిలోని శ్రీ శ్లోక బొల్లారం పబ్లిక్ స్కూల్ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొల్లారం పబ్లిక్ స్కూల్లో జరిగిన వేడుకల్లో స్థానిక మహిళా నాయకురాలు ప్రత్యూష రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. బాలికలు అందమైన రంగవల్లులు వేశారు. బాలురు గాలిపటాలతో సందడి చేశారు. శ్రీ శ్లోక పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు రంగవల్లులతో పాఠశాల ప్రాంగణాన్ని పండుగలా మార్చారు. డివిజన్ ప్రజలకు ప్రత్యూష రెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్లు హరికృష్ణ రెడ్డి ప్రభ కుమార్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కొత్త అక్రిడేషన్ అమలుచేయడంలో విఫలమవుతున్న ప్రభుత్వం

- జి ఓ నెంబర్ 252 ను సవరించాలీ....
- టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య....

**వుదయం, గద్వాల:**

ప్రభాత వార్త: జర్నలిస్టుల అక్రిడేషన్ అమలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందని, జర్నలిస్టుల సంక్షేమం కోసం కొత్తగా ప్రవేశపెట్టిన జి ఓ నెంబర్ 252 లో వున్న లోపల వల్ల జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని, వెంటనే వాటిని సవరించి వెంటనే జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ లు అమలు చేయాలని టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు.ఆదివారం గద్వాల పట్టణంలోని అనంత ఫంక్షన్ హాల్ లో టీ డబ్ల్యూ జె ఎఫ్ జోగులాంబ గద్వాల జిల్లా 3వ మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్యతిదులుగా టీ డబ్ల్యూ జె ఎఫ్ జాతీయ సభ్యులు పులిపలుకుల ఆనందం, రాష్ట్ర నాయకులు మామిడి సోమయ్య, బండి విజయ్ కుమార్, జగన్ తన్నీరు శ్రీనివాస్, బాబూరావు, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రెడ్డి లు హాజరయ్యారు. ఈ మహా సభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఫోర్త్ ఎస్టేట్ ను నిర్లక్ష్యం చేస్తున్నారని, జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెక్ట్ కూడా కేటాయించడం లేదని వారు అన్నారు. పాత జి ఓ లో మార్చి కొత్తగా ప్రవేశ పెట్టిన జి ఓ 252 జర్నలిస్టుల సంక్షేమానికి యోగ్యతగా లేదని , జి ఓ ను వెంటనే సవరించి జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం 42కోట్ల నిధులు ఉన్నాయని, ఈ నిధులు జర్నలిస్టుల సంక్షేమం కోసం కేటాయించాయని ఆకాల మరణం చెందిన విలేఖరుల కుటుంబాలకు లక్ష రూపాయలు నగదు, భార్య కు పింక్షన్ సౌకర్యం, పిల్లలకు ఉచిత చదువు, ఆర్థిక సహాయంగా ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రంలో వున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఈ నిధులు సరిపోవు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ పీ డబ్ల్యూ జె ఎఫ్ వున్న సంఘం తెలంగాణ వచ్చాక టీ డబ్ల్యూ జె ఎఫ్ గా మారిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక గత 18 సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతర పోరాటాలు చేసిన సంఘం టి డబ్ల్యూ జె ఎఫ్ సంఘం అని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేస్తూ, ప్రభుత్వాలతో గొప్పపేరు గాంచిన ఈ సంఘాన్ని కొందరు వ్యక్తులు వారి స్వార్థానికి పనిచేస్తూ, సంఘాన్ని భ్రష్టు పట్టించేకు కుట్రలు చేస్తున్నారని, వారికి త్వరలోనే చట్టపరంగా తగిన బుద్దిన బుద్ధి చెప్తామని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో వున్న అన్ని జర్నలిస్టుల సంఘాల కన్నా టీ డబ్ల్యూ జె ఎఫ్ జర్నలిస్టుల సంఘం చాలా బలోపేతంగా తయారు అవుతుందని, ప్రతి విలేకరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతర కృషి చేస్తుందని వారు అన్నారు.

**విలేకరుల కోసం నా వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది.... ఎమ్మెల్యే...**

విలేకర్ల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ నా వంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు.జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య కోర్టు లో నడుస్తుందని, కోర్టు తీర్పు అనంతరం ఇళ్ల స్థలాలు తప్పక ఇస్తామని హామీ ఇచ్చారు. గతంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం




భూమిని కూడా చూడడం జరిగిందని అన్నారు.అదేవిధంగా ప్రెస్ క్లబ్ కోసం కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈ మహాసభలలో టీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలలో టీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా నాయకులు అక్బర్ బాషా, గిరిబాబు, అమరాయి శ్రీనివాసులు, రాజగారి సురేష్, రవిప్రకాష్, గౌడం పల్లి నాగరాజు, ధరూర్ కృష్ణ, బీసన్న , వెంకటేష్, గౌరీ శెట్టి నరేష్ , పెద్దపాటి నర్సింహా బి జే సిరిగిరి కృష్ణ, దేవరాజు, జిల్లాలోని పలు మండలాల విలేకర్లు, పట్టణ విలేకర్లు పాల్గొన్నారు.

# శక్తి తరగకుండా ఉండాలంటే ఈ డైట్ పాటించండి!



నలభై ఏళ్లు దాటిన మహిళల శరీరంలో అనేక ముఖ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. హార్మోన్ల సమతుల్యతలో మార్పులు, జీవక్రియ (మెటబాలిజం) మందగించడం, ఎముకల సాంద్రత తగ్గడం వంటి కారణాల వల్ల గతంలో ఉన్నంత ఉత్సాహం, శక్తి తరచుగా తగ్గిపోతుంటాయి. ఎంత సమయానికి తింటున్నా కొన్నిసార్లు నీరసం, అలసట చుట్టుముట్టవచ్చు. ఈ దశలో, కేవలం ఆహారం తీసుకోవడం సరిపోదు. శరీరానికి తగిన పోషకాలు అంది, శక్తిని కాపాడుకోవడానికి సమతుల్యమైన (బ్యాలెన్స్డ్) ఆహార విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. నిపుణులు కూడా దీనినే గట్టిగా సూచిస్తున్నారు. శరీరానికి అవసరమైన అన్ని రకాల విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా అందాలంటే, ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వివిధ రంగుల్లో ఉండే పండ్లు, ఆకుకూరలు యాంటీఆక్సిడెంట్లను అందించి కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ముఖ్యంగా, ఎముకల బలం కోసం కాల్షియం, విటమిన్ డి అవసరం. వీటితో పాటు రక్తహీనతను నివారించేందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను కూడా డైట్‌లో చేర్చుకోవాలి. ఈ పవర్‌హౌస్ లాంటి ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. 40 ఏళ్లు పైబడిన తర్వాత, కండరాల క్షీణతను నివారించడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం తప్పనిసరి. అందుకే, ఆహారంలో పాల ఉత్పత్తులు (పాలు, పెరుగు, పన్నీర్), అలాగే మాంసాహారం, గుడ్లు వంటి వాటిని తగిన మోతాదులో చేర్చుకోవాలి. పాల ఉత్పత్తులు కాల్షియంను అందిస్తే, మాంసాహారం, గుడ్లు నాణ్యమైన ప్రోటీన్‌ను అందిస్తాయి. శాఖాహారులు పప్పులు, చిక్కుళ్లు, సోయా వంటి వాటిని తీసుకోవడం ద్వారా ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవచ్చు. ఈ కీలకమైన పోషకాలు శరీరాన్ని దృఢంగా ఉంచి, రోజంతా శక్తివంతంగా ఉండేలా చేస్తాయి. శక్తి స్థాయిలను మెరుగుపరచుకోవడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పీచు పదార్థాలు (ఫైబర్) ఉన్న ఆహారాన్ని డైట్‌లో పెంచాలి. తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని నివారిస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా, ఎంత మంచి ఆహారం తీసుకున్నా, శరీరం హైడ్రేటెడ్‌గా (సరిపడా నీటితో) ఉండటం చాలా అవసరం. అందుకే, తరచుగా, సరిపడా నీటిని తాగాలి. తగినంత నీరు తాగడం వల్ల నీరసం తగ్గుతుంది, జీవక్రియ సక్రమంగా పనిచేస్తుంది. ఈ మార్పులను పాటించడం ద్వారా 40 ప్లస్ మహిళలు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండగలుగుతారు.

# పాదాల తిమ్మిర్లు ఉంటే అనారోగ్యానికి సంకేతం

పాదాల వాపులు వస్తున్నాయంటే తప్పనిసరిగా జాగ్రత్తపడాల్సి ఉంటుంది. నిజానికి చాలా మంది ఈ లక్షణాలను పెద్దగా పట్టించుకోరు. వాపులు, తిమ్మిర్లు తగ్గడానికి తాత్కాలికంగా మందులు వేసుకుని అక్కడితో వదిలేస్తారు. కానీ ఈ చిన్న సమస్యలే చాలా పెద్ద ముప్పుగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే..వీలైనంత త్వరగా స్పందించాలి. మరి ఇలా పాదాల్లో జరిగే మార్పులు ఏయే రోగాలకు సంకేతాలు.



పాదాల ఆరోగ్యాన్ని చాలా మంది పట్టించుకోరు. నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇవే క్రమంగా పెద్దవై ముప్పు తెచ్చి పెడతాయి. చర్మం రంగు మారడం నుంచి తిమ్మిర్లు ఎక్కడం వరకూ ఎన్నో రకాలుగా సమస్యలు వస్తాయి. నడిచేటప్పుడు కూడా ఈ మార్పులు స్పష్టంగా కనబడతాయి. అలాంటప్పుడే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించడం మంచిది. ఏ మాత్రం ఆలస్యం చేసినా కండీషన్ సీరియస్ అయ్యే ముప్పు ఉంటుంది. నిజానికి పాదాల్లో ఇలాంటి మార్పులు వస్తున్నాయంటే ఎన్నో తీవ్ర అనారోగ్యాలకు ఇవి సంకేతాలు కావచ్చు అని పలు అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. ముఖ్యంగా డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలు ఇదే విధంగా ఉంటాయి. పాదాల్లో మంట, కురుపులు రావడం లాంటి లక్షణాలు రక్త సరఫరా సరిగ్గా లేనప్పుడు కనబడతాయి. ముఖ్యంగా నరాలు డ్యామేజ్ అయినప్పుడు కూడా పాదాల్లో ఇలాంటి మార్పులు కనిపించే అవకాశాలున్నాయి. ఇలాంటప్పుడు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

పాదాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చినప్పుడు కూడా రంగు మారేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాపులను మాత్రం తప్పనిసరిగా గమనించాలి. ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినప్పుడు, వీటి ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు ఇలా పాదాల్లో వాపులు వస్తాయి. సరైన సమయానికి సరైన వైద్యం అందించకపోతే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. తరచూ తిమ్మిరిగా ఉండడం, దురద లాంటి లక్షణాలు కనిపించాయంటే అది డయాబెటిస్ లక్షణం కావచ్చు. లేదా నరం డ్యామేజ్ అయినప్పుడు కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ అసలు కంట్రోల్ లో లేనప్పుడు ఇలా జరుగుతుంది. నరాలు ఒత్తిడికి గురైనప్పుడు లేదా ఇంకేదైనా న్యూరో సమస్యలు తలెత్తినప్పుడు ఇలా పాదాల్లో తిమ్మిర్లు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే..ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు చాలా త్వరగా స్పందించాల్సి ఉంటుంది. లేదంటే ఈ సమస్య కాస్త తీవ్ర ఇన్ఫెక్షన్ కి దారి తీసే ప్రమాదం ఉంది. పాదాల్లో విపరీతమైన నొప్పి, వాపులు వస్తుంటాయి. పాదాలు చాలా బరువెక్కినట్టుగా అనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపించాయంటే గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు లెక్క. దీన్నే ఎడిమా అంటారు. ముఖ్యంగా హార్ట్ ఫెయిల్యూర్ కండీషన్స్ లో ఈ సమస్య తలెత్తుతుంది. గుండె కండరాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ఇలాగే పాదాల్లో వాపులు కనిపిస్తాయి. పాదాల్లో ఎక్కువగా కదలికలు వచ్చే కొద్దీ ఈ వాపులు ఎక్కువవుతుంటాయి. ఎక్కువ సమయం పాటు నిలబడినా, ఎక్కువ సేపు కూర్చున్నా వాపులు మరీ ఎక్కువవుతాయి. ఇలాంటి సమయంలో సరైన చికిత్స తీసుకోకపోతే లక్షణాలు మరీ తీవ్రమవుతాయి. పాదాలపై చర్మం పొడిగా మారడం, చర్మం రంగు మారిపోవడం లాంటి లక్షణాలు కనబడతాయి. ఏదైనా గాయం అయినప్పుడు ఎక్కువ రోజుల పాటు మానకుండా అలాగే ఉన్నా అది డయాబెటిస్ లక్షణం కావచ్చు. కొన్ని సార్లు ఈ అల్సర్స్ చాలా తీవ్రమవుతాయి. త్వరగా చికిత్స తీసుకుంటే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

# గంధం ఆ చర్మ సమస్యలకు వరం..




ఆయుర్వేదంలో గంధాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. మొఖంపై మొటిమలను నివారించడానికి, తళతళ మెరిసేందుకు గంధాన్ని ఉపయోగిస్తారు. గంధం పొడి, పేస్ట్ లేదా నూనె రూపంలో ఉపయోగించవచ్చు. ఈ ప్రకృతి సహజసిద్ధమైన పదార్థం చర్మాన్ని సంరక్షించి మెరిసేలా చేస్తుందని నిపుణులు అంటుంటారు. ఈ గంధం ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మొటిమలను దూరం చేస్తుంది: గంధం చర్మ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. చర్మాన్ని అలర్జీల నుంచి రక్షించి మొటిమలను దూరం చేస్తుంది. ఒక టీస్పూన్ గంధం నూనె, చిటికెడు పసుపు, కర్పూరం కలిపి ముఖానికి ప్యాక్ లాగా రాసుకోవాలి. రాత్రాంత అలాగే ఉంచి ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేస్తే మొటిమలు, నల్లమచ్చలు పోతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది: తేలికపాటి ఎక్స్‌ఫోలియేటింగ్ లక్షణాల వల్ల చందనం.. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. ఇది మీ చర్మంపై నల్ల మచ్చలను పోగొట్టడానికి సహాయపడుతుంది. టాన్ తొలగించడానికి ఇది సమర్థవంతమైనది. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ గంధం పొడి, కొబ్బరి నూనె కలపాలి. దీన్ని ముఖానికి పూసుకుని.. మసాజ్ చేసి రాత్రంతా అలాగే ఉంచాలి. డార్క్ స్పాట్స్ వదిలించుకోవడానికి, రెగ్యులర్ టాన్ పొందడానికి దీన్ని రెగ్యులర్‌గా ఉపయోగిస్తే మచ్చలు పోయి.. ముఖం తళతళ మెరుస్తుంది. వృద్ధాప్యానికి చెక్: గంధపు చెక్కలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఇది చర్మ ముడుతలను నివారించి వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. దీంతోపాటు చర్మాన్ని కాంతివంతంగా యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. దీని కోసం, 2 టేబుల్ స్పూన్ల ముల్తానీ మట్టి, 2 టేబుల్ స్పూన్ల గంధం కలపి రాయాలి. 15-20 నిమిషాలు అలాగే ఉంచి నీటితో కడిగితే చాలు. పొడి చర్మం నివారణ: చాలా మంది పొడి, నిర్జీవమైన చర్మంతో బాధపడుతుంటారు. అలాంటివారు చందనం ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల పొడి, నిర్జీవమైన చర్మానికి చెక్ పెట్టవచ్చు. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ పాలపొడి, కొన్ని చుక్కల గంధం నూనె, రోజ్ వాటర్ కలిపి ముఖానికి రాయాలి. 15 నిమిషాలు ఉంచి నీటితో కడిగితే చర్మం నిగారింపుగా మారుతుంది. జిడ్డుగల చర్మం: జిడ్డుగల చర్మంపై తరచుగా ధుమ్ము, ధూళి పేరుకుపోతుంది. అలాంటివారికి చందనం దివ్య ఔషధంలా పనిచేస్తుంది. ఒక గిన్నెలో అర టీస్పూన్ గంధం పొడి, కొంచెం టమోటా రసం, అర టీస్పూన్ ముల్తానీ మట్టి వేసి బాగా కలపాలి. ఈ పేస్ట్‌ని ముఖంపై పూసుకొని..15 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం మెరుస్తూ ఉంటుంది.

# మిగిలిన అన్నం లాభాలు తెలిస్తే నోరెళ్లబెడతారు!



చద్దన్నం (చలి అన్నం లేదా మిగిలిపోయిన అన్నం) తినడం చాలా మందికి ఇష్టం ఉండదు. కొందరు చద్దన్నాన్ని ఇష్టంగా తింటే మరికొంత మంది మాత్రం అస్సలే దానిని తినడానికి ఆసక్తి చూపరు. కానీ చద్దన్నం తినడం వలన కూడా బోలెడు లాభాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. భారతీయుల్లో చాలా మంది తమ ఇంట్లో అప్పటికప్పుడు వండిన వేడి వేడి అన్నం తినడానికే ఎక్కువ ఇంట్రస్ట్ చూపిస్తుంటారు. ఎందుకంటే ఇది రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి మంచిది. అయితే వేడి వేడి అన్నమే కాదండోయ్, మిగిలిపోయిన అన్నం తినడం వలన కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయంట. చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఎలా అంటే? బియ్యాన్ని ఉడికించి, దానిని చల్లబరిచినప్పుడు అందులో ఉండే కొంత పిండి పదార్థం, స్టార్చ్ రిట్రోగ్రేడేషన్ అనే ప్రక్రియ ద్వారా నిరోధక పిండి పదార్థంగా మారి, జీర్ణక్రియ నిరోధకతను కలిగి ఉంటుందంట. అందువలన ఇది రక్తంలోకి గ్లూకోజ్‌ను చాలా మెల్లగా విడుదల చేయడం వలన అప్పటికప్పుడు వండిన అన్నం కంటే, చలి అన్నం తినడం వలన డయాబెటీస్ కంట్రోల్‌లో ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. దీనిపై పరిశోధకులు తాజాగా ఓ సర్వే కూడా జరపగా, చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తున్నట్లు వారు కనుగొన్నారు. 15 మంది ఆరోగ్యకరమైన పెద్ద వారిని తీసుకొని, తెల్ల బియ్యాన్ని ఉడికించి, 4ళీ%జ% వద్ద 24 గంటలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచి, ఆపై మళ్లీ వేడి చేసి తినడం వలన, అప్పటికప్పుడే వండి తినే అన్నం కంటే, చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గేలా చేసిందంట. అందువలన చద్దన్నం తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా ఇది ప్రీ బయోటిక్‌గా పని చేయడమే కాకుండా, గట్ బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. పెద్ద పేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అదే విధంగా ఇన్సులిన్ సెన్సిటివిటీకి సంబంధించిన హార్మోన్స్‌ను ప్రభావితం చేస్తుందంట. ఆకలిని తగ్గించి, పొట్టలోని బ్యాడ్ కొలెస్ట్రాల్ తగ్గేలా చేస్తుంది. బరువు తగ్గాలి అనుకునే వారికి, మధుమేహం సమస్యతో బాధపడే వారికి ఇది మంచి ప్రయోజనం. చల్లగా మిగిలిపోయిన అన్నం తినడం మంచిది ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది, ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర పెరుగుదలను తగ్గించడంలో,కడుపు నిండిన అనుభూతిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

# తెల్లజుట్టు సమస్యకు వంటింటి చిట్కా



జుట్టు తెల్లబడటం అనేది నేటి కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని బాధిస్తున్న ఒక సాధారణ సమస్య. మార్కెట్లో లభించే రసాయనాలతో కూడిన ఉత్పత్తులు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తున్నప్పటికీ, వాటి దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఆందోళనలు ఉన్నాయి. అయితే, ఈ సమస్యకు మన వంటింట్లోనే ఒక అద్భుతమైన మరియు సహజసిద్ధమైన పరిష్కారం ఉందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అదే, సొరకాయ ఉపయోగించి తయారుచేసే ప్రత్యేకమైన నూనె. ఈ పురాతన చిట్కా జుట్టుకు పోషణనిచ్చి, దాని సహజసిద్ధమైన నలుపు రంగును తిరిగి తీసుకురావడానికి సహాయపడుతుంది. జుట్టు నల్లబడటానికి సొరకాయ నూనెను తయారుచేసే పద్ధతి చాలా సులభం. ముందుగా, సొరకాయను చిన్న ముక్కలుగా కత్తిరించుకోవాలి. ఈ ముక్కలను కనీసం వారం రోజుల పాటు బాగా ఎండబెట్టుకోవాలి. ఈ ప్రక్రియ వల్ల సొరకాయలోని తేమ పూర్తిగా తొలగిపోయి, దాని పోషక విలువలు నూనెలోకి చేరడానికి సిద్ధమవుతాయి. ఇలా ఎండిన ముక్కలను ఒక మందపాటి పాత్రలో తీసుకోవాలి. తరువాత, ఈ ఎండిన సొరకాయ ముక్కలకు సరిపడా మంచి నాణ్యత గల కొబ్బరి నూనెను (ఎఱతీస్త్రఅఅ జశీఒశీఅబ్ రాఱశ్రీను వాడటం ఉత్తమం) జోడించాలి. ఈ మిశ్రమాన్ని మంటపై ఉంచి, సొరకాయ ముక్కలు రంగు మారే వరకు లేదా ముక్కలు పూర్తిగా నూనెలో కలిసిపోయినట్లు అయ్యే వరకు తక్కువ మంటపై బాగా మరిగించాలి. ఇలా మరిగించడం వల్ల సొరకాయలోని కీలకమైన పోషకాలు మరియు సహజ వర్ణకాలు నూనెలోకి పూర్తిగా విడుదలవుతాయి. అనంతరం, ఆ నూనెను చల్లార్చి, ఒక శుభ్రమైన వడపోత గుడ్డ సహాయంతో వడబోసి, గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ ఇంట్లో తయారుచేసిన సొరకాయ నూనెను వారానికి కనీసం ఒకసారి తలకు పట్టించి, వేళ్ళతో సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. రాత్రంతా ఉంచి, మరుసటి రోజు ఉదయం మై షాంపూతో తలస్నానం చేయడం వల్ల ఉత్తమ ఫలితం ఉంటుంది. ఇలా తరచు చేయడం వలన జుట్టు కుదుళ్ళు బలం పుంజుకుంటాయి, జుట్టు నల్లబడ ప్రారంభమవుతుంది. రసాయనాలు లేని ఈ సహజసిద్ధమైన చికిత్స జుట్టు ఆరోగ్యా మెరుగుపరచడమే కాకుండా, తెల్లజుట్టు సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపడం సహాయపడుతుంది.

# కోరిన కొలువుకు.. కోర్సే సిఫారసు!

ఉజ్వలమైన కెరియర్ అన్వేషణలో ఉన్నప్పుడు వికసించే రంగాన్ని గుర్తించడం మొదటి మెట్టు. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదు. ఎంచుకున్న రంగంలో చోటు పొందేందుకు కావల్సిన మెట్లు ఎక్కడున్నాయో గుర్తించాలి. ఆపై ఒక్కో మెట్టు ఎక్కుతూ కలల కెరియర్‌ను చేరుకోవాలి.

శరవేగంగా ఎదుగుతోన్న సైబర్ సెక్యూరిటీ రంగం తగిన నిపుణుల కోసం నిరీక్షిస్తోంది. సైబర్ దాడులు, సైబర్ చౌర్యాలు రోజురోజుకీ పెరుగుతున్న తరుణంలో చౌరబాటు దారులు మూసేందుకు వృత్తి నిపుణుల అవసరం మరింతగా పెరుగుతోంది. అంటే ఇప్పటికిప్పుడు సైబర్ సెక్యూరిటీ రంగంలోకి ప్రవేశించాలన్న లక్ష్యంతో ప్లస్ టూ తర్వాత డిగ్రీ, పీజీ చేసేందుకు ఆరేళ్లు పడుతుంది. కాబట్టి ఈ రంగం అప్పటికే నిపుణులతో నిండిపోతుంది, మనకు చోటు దక్కదేమోనని బెంగ అవసరం లేదు. సైబర్ నేరగాళ్లు స్వైర విహారం చేస్తూ వేయి బాహువులతో కొత్త కొత్త వర్చువల్ ప్రాంతాలకు విస్తరిస్తున్నారు. అందువల్ల అప్పటికీ ప్రొఫెషనల్స్ అవసరం ఇంకా పెరుగుతుందే తప్ప తరగదు.

దారులెన్ని?సైబర్ జగత్తులో విపత్తులను నిరోధించేందుకు నిర్ణయించుకున్న యువత వివిధ అస్త్ర శస్త్రాలు (కోర్సులు) సిద్ధం చేసుకోవాలి. అందుకు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల నుంచి స్వల్పకాలిక డిప్లొమా కోర్సుల వరకూ అందుబాటులో ఉన్నాయి. సావకాశంగా సైబర్ సెక్యూరిటీ కెరియర్‌ను మలచుకునే అవకాశం ఉన్న వారికి డిగ్రీ కోర్సులు సౌకర్యవంతంగా ఉంటాయి. ఇప్పటికే డిగ్రీ పూర్తి చేసుకున్నవారు తక్కువ సమయంలో కనీస అవగాహన, పరిమిత నైపుణ్యాలు అలవర్చుకునేలా డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులూ అక్కరకు వస్తున్నాయి.బీటెక్ సైబర్ సెక్యూరిటీ లేదా కంప్యూటర్ సైన్స్ (సైబర్ సెక్యూరిటీ): కంప్యూటర్ సైన్స్‌లో శాస్త్ర విజ్ఞాన సామర్థ్యాలను నేర్పించడంతో పాటు సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టును ఒక ప్రత్యేక అంశంగా చూపిస్తారు. దీనివల్ల కంప్యూటర్ సైన్స్ క్షేత్రంలో సైబర్ సెక్యూరిటీ ఆయుధ బలంతో సైబర్ శత్రువులను ఎదుర్కొనే శక్తి సంపాదిస్తారు. ఇంజినీరింగ్ స్ట్రీమ్ వైపు వెళ్లని వాళ్లూ సాధారణ డిగ్రీ కోర్సుతోనూ సైబర్ సెక్యూరిటీ ప్రత్యేక సబ్జెక్టుగా నేర్చుకొనే అవకాశం ఉంది.



కనీస విద్యార్హతలుబీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ మార్కులు, ఉమ్మడి ప్రవేశ పరీక్షలైన ఈఏపీసెట్, ఐఐటీ–జేఈఈ ఆధారంగా సీట్లు ఇస్తారు. ఇతర కోర్సుల్లో ప్లస్ టూ స్థాయిలో 50 శాతం మార్కులతో ప్రవేశ అర్హత లభిస్తుంది.ఏం నేర్పుతారు?ప్రస్తుతం సైబర్ దాడులు జరుగుతున్న తీరుతెన్నులు, సాధారణంగా డేటా భద్రతకు ఉండే రక్షణ వలయాలు, సాంకేతికంగా చౌరబాట్లు జరగకుండా ఏ విధంగా అడ్డుకట్ట వేయాలి? అన్న విషయాలను క్షుణ్నంగా అధ్యయనం చేసి సిలబస్ రూపకల్పన చేస్తారు. నెట్‌వర్క్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్, రిస్క్ మేనేజ్‌మెంట్, ఎథికల్ హ్యాకింగ్, క్రిప్టోగ్రఫీల్లో మౌలిక అంశాలను ఈ కోర్సుల్లో భాగంగా బోధిస్తారు.ఈ నైపుణ్యాలు నేర్చుకుంటే పరిగణనలోకి తీసుకునే పొజిషన్లు:సైబర్ సెక్యూరిటీ, అనలిస్ట్ఎథికల్ హ్యాకర్డిజిటల్ ఫోరెన్సిక్ స్పెషలిస్ట్నెట్‌వర్క్ సెక్యూరిటీ ఇంజినీర్సెక్యూరిటీ కన్సల్టెంట్మాల్వేర్ అనలిస్ట్తాజా అభ్యర్థులకు రాజమార్గం భారత్‌లో సైబర్ సెక్యూరిటీ రంగంలో భవిష్యత్తులో రానున్న 8 లక్షల ఉద్యోగాల్లో చోటు పొందాలంటే కొన్ని మౌలిక సామర్థ్యాలను సొంతం చేసుకోవాలి.విండోస్, లినక్స్ లాంటి ఆపరేటింగ్ సిస్టమ్స్, నెట్‌వర్కింగ్‌పై పట్టు ఫైర్‌వాల్స్, యాంటీ వైరస్, చౌరబాటు గుర్తింపు సామర్థ్యంసైబర్ దాడుల ముప్పును తప్పించే స్కానర్స్‌పై అవగాహన ఉంటే అది అదనపు అర్హత అవుతుంది.బీఎస్సీ సైబర్ సెక్యూరిటీ / డిజిటల్ సెక్యూరిటీ / ఫోరెన్సిక్: ఈ కోర్సుల్లో ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ, సైబర్ దాడుల ముప్పు అవకాశాలు, ఒకవేళ దాడులు జరిగితే డిజిటల్ పరిశోధన అంశాలపై దృష్టి పెడతారు.

సైబర్ సెక్యూరిటీతో బీసీఏ: పటిష్ఠమైన సైబర్ సెక్యూరిటీ పునాదులతో కంప్యూటర్ అప్లికేషన్స్‌ను ఈ కోర్సు ద్వారా నేర్చుకోగలుగుతారు.

సైబర్ నేరాలు – చట్టాలు, ఫోరెన్సిక్ అకౌంటింగ్‌తో బీకామ్: సైబర్ నేరగాళ్లు సంస్థల భద్రతా వలయాలను ఛేదించుకుని, చౌరబడి ఆర్థికంగా దెబ్బతీస్తారు. సైబర్ నేరాల్లో సాంకేతిక అంశం ఒకటైతే, దాడుల వల్ల జరిగే నష్టాల ఆడిటింగ్, అకౌంటింగ్‌పై ఆసక్తి ఉన్న వారికి ఈ కోర్సు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటికే డిగ్రీలు, పీజీలు దాటి వచ్చేసిన విద్యార్థులు ఈ రంగంలో రాణించాలనుకుంటే వారి కోసమూ స్వల్పకాలిక వ్యవధితో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులున్నాయి.

డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ: వివిధ ప్రైవేట్ శిక్షణ సంస్థలు ఉపాధి ప్రధాన (జాబ్ ఓరియంటెడ్) లక్ష్యంగా డిప్లొమా కోర్సులు అందిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీ ప్రాథమికాంశాలు నేర్పించే ఈ తరహా డిప్లొమాలతో ఈ రంగంలో ప్రవేశ స్థాయి (ఎంట్రీ లెవల్) ఉద్యోగాలు పొందవచ్చు.సర్టిఫికెట్ కోర్సులు: సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టుపై ఆసక్తి ఉన్నవారు చేసేందుకు స్వల్పకాలిక ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులను టెక్ దిగ్గజ సంస్థలు గూగుల్, ఐబీఎంలు అందిస్తున్నాయి. ప్రస్తుత సైబర్ ప్రపంచంలో ఎదుర్కొంటున్న ముప్పులు, పరిష్కార సామర్థ్యాలపై ఈ కోర్సులు దృష్టి పెడుతున్నాయి. అందుకే ఇవి జాబ్ రెడీ కోర్సులుగా గుర్తింపు పొందాయి.

# ఫారిన్ ట్రేడ్‌తో ఎలాంటి అవకాశాలు?

బీఎస్సీ (ఎంపీసీ) చదువుతున్నాను. ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్/ ఫారిన్ ట్రేడ్ స్పెషలైజేషన్‌తో ఎలాంటి అవకాశాలు ఉంటాయి. మేటి సంస్థలు, ప్రవేశ వివరాలు తెలపండి.చంద్రశేఖర్బీఎస్సీ (ఎంపీసీ) చదువుతున్న మీరు ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్/ ఫారిన్ ట్రేడ్‌ను కెరియర్ మార్గంగా ఎంచుకోవడం మంచి నిర్ణయం. మ్యాథ్స్, ఫిజిక్స్ నేపథ్యం ఉన్న విద్యార్థులకు ఉండే తార్కిక ఆలోచన, సంఖ్యలపై పట్టు, విశ్లేషణాత్మక సామర్థ్యం వ్యాపార రంగంలో చాలా అవసరం. అందుకే ఇటీవల కాలంలో ఇంజినీరింగ్, మ్యాథ్స్, ఫిజిక్స్ చదువుతున్న చాలా మంది విద్యార్థులు ఎంబీఏను కెరియర్‌గా ఎంచుకుంటున్నారు.కోర్సు పూర్తిచేసుకున్నవారికి ఎగుమతులు, దిగుమతులు చేసే సంస్థల్లో ఎక్స్‌పోర్ట్స్ మేనేజర్, ఇంపోర్ట్ మేనేజర్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ ఆఫీసర్, ఫారిన్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లాంటి ఉద్యోగాలు ఉంటాయి. బహుళ జాతి సంస్థల్లో గ్లోబల్ సోర్సింగ్, అంతర్జాతీయ కొనుగోళ్లు, సరఫరా నిర్వహణ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. బ్యాంకింగ్ రంగంలో ట్రేడ్ ఫైనాన్స్, విదేశీ కరెన్సీ లావాదేవీలు, లెటర్ ఆఫ్ క్రెడిట్ నిర్వహణ లాంటి విభాగాల్లోనూ ఉపాధి అవకాశాలు ఉంటాయి. లాజిస్టిక్స్, షిప్పింగ్, కస్టమ్స్ క్లియరెన్స్ రంగాల్లో కూడా ఈ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది.ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సులో ప్రవేశానికి ముందుగా ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీ యాభై శాతం మార్కులతో పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరంలో ఉన్నవారికీ అవకాశం ఉంది. ప్రవేశం ప్రధానంగా జాతీయ స్థాయి పరీక్షలతో ఉంటుంది. దేశంలోని మేటి విద్యా సంస్థలు కామన్ అడ్మిషన్ టెస్టు (క్యాట్) స్కోరు ప్రతిభతో ఇంటర్వ్యూ నిర్వహించి, సీట్లు కేటాయిస్తున్నాయి. కొన్ని సంస్థలు సొంత పరీక్షలు, జాట్, మ్యాట్‌తోనూ అవకాశమిస్తున్నాయి.

క్యాట్‌లో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగాలు ఉంటాయి.

గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థి కమ్యూనికేషన్ నైపుణ్యం, ఆలోచనా సామర్థ్యం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులపై అవగాహన, అంతర్జాతీయ వాణిజ్యంపై ఆసక్తి లాంటి అంశాలను పరిశీలిస్తారు. కాబట్టి వీటిపై ముందుగానే అవగాహన ఉండటం శ్రేయస్కరం.



దేశంలో ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్‌కు పేరున్న సంస్థల్లో దిల్లీ, కోల్‌కతా, కాకినాడలలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, సింబయాసిస్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఇన్‌స్టిట్యూట్–పుణె, మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–గురుగ్రామ్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ–గ్రేటర్ నోయిడా ముఖ్యమైనవి. పాండిచ్చేరి యూనివర్సిటీ, జామియా మిలియా లాంటి కొన్ని సెంట్రల్ యూనివర్సిటీలు, మరి కొన్ని స్టేట్ యూనివర్సిటీలూ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ఎంబీఏ కోర్సులను అందిస్తున్నాయి.సరైన ప్రవేశ పరీక్షను ఎంపిక చేసుకుని, అర్హత ప్రమాణాలను గమనిస్తూ, సమగ్రంగా సన్నద్ధమైతే ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్/ ఫారిన్‌ట్రేడ్‌లో ప్రవేశం పొందడం కష్టం కాదు.ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ వివిధ దేశాల మధ్య జరిగే వాణిజ్యం, ఎగుమతులు, దిగుమతులు, అంతర్జాతీయ మార్కెటింగ్, విదేశీ కరెన్సీ లావాదేవీలు, గ్లోబల్ సరఫరా వ్యవస్థలు లాంటి అంశాలపై లోతైన అవగాహన కల్పిస్తుంది. ఈ కోర్సులో అంతర్జాతీయ ఆర్థిక విధానాలు, వాణిజ్య ఒప్పందాలు, కస్టమ్స్ నిబంధనలు, షిప్పింగ్ విధానాలు అధ్యయనం చేస్తారు. దీని ద్వారా విద్యార్థికి ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సంస్థలు ఎలా పనిచేస్తాయి అన్న విషయాలపై సమగ్ర అవగాహన ఏర్పడుతుంది.

# పురుషాధిపత్యం రంగాలలోకి మహిళలు



పురుషుల ఆధిపత్యం బలంగా ఉన్న ఎన్నో రంగాలలోకి మహిళలు కూడా ధైర్యంగా అడుగుపెడుతున్నారు. అలాంటి వాటిలో ఆటో డ్రైవింగ్ కూడా ఒకటి. మహిళా ఆటో డ్రైవర్లుగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవమానాలు అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. ఇలాంటి అడ్డంకులు ఛేదించి అనేక విజయాలు సాధిస్తున్న మహిళలు మన చుట్టూ ఎందరో ఉన్నారు. అటువంటి ఓ మహిళ కథే ‘ఆటో క్వీన్స్’గా ఇటీవల విపరీతంగా వైరల్ అవుతోంది. ఆ డాక్యుమెంటరీ విశేషాల గురించి నేటి మానవిలో...ఈ డాక్యుమెంటరీ భారతదేశంలోని మొట్ట మొదటి మహిళా ఆటోరిక్ష డ్రైవర్ల యూనియన్ అయిన వీర పెంగల్ మున్నేత్ర సంగం(వీపీఎంఎస్)ను మనకు పరిచయం చేస్తుంది. ఆ మహిళలను పోరాడుతున్న అసాధారణ వ్యక్తులుగా మాత్రమే కాకుండా, వారి దైనందిన జీవితాలతో ఎదుర్కొంటున్న సమస్యలను కూడా మన కండ్లకు కట్టినట్టు చూపిస్తోంది. సాధారణంగా ఈ పురుషాధిక్య వృత్తిలో పురుషడ్రైవర్లకే ఆటో స్టాండ్‌లపై నియంత్రణ ఉంటుంది. ట్రాఫిక్ పోలీసులు, ప్రయాణీకులు, తోటి డ్రైవర్లతో రోజువారీ చర్చలు జరపాలి. అయితే మహిళా డ్రైవర్లకు ఇవన్నీ వేధింపులుగా మారిపోయాయి. వీరి బతుకు తెరువు దుర్బలంగా మారిపోయింది.

వాట్సాప్ గ్రూపుగా మొదలై...ఈ దుర్బలత్వానికి ప్రతిస్పందనగానే వీపీఎంఎస్ ఉద్భవించింది. ఇది మొదట ఒక చిన్న వాట్సాప్ గ్రూప్‌గా ప్రారంభమైంది. ఇక్కడ మహిళా డ్రైవర్లు ఒకరితో ఒకరు తమ సమస్యల గురించి పంచుకుంటారు. వారికి ఎదురయ్యే రోజువారీ అవమానాల గురించి చెప్పుకుంటారు. కాలక్రమేణా ఇది నెలవారీ విరాళాలు, తక్కువ వడ్డీ రుణాలు, అనారోగ్యం, సంక్షోభ సమయంలో చట్టపరమైన, అత్యవసర సహాయం అందించే మహిళా డ్రైవర్ల రిజిస్టర్డ్ యూనియన్‌గా ఎదిగింది. మహిళా డ్రైవర్లను ఆటో స్టాండ్ల నుండి బయటకి పంపినపుడు వారికి మద్దతుగా నిలబడటం, పురుష డ్రైవర్లు, అధికారులతో ఏదైనా సమస్య ఎదురైనప్పుడు మాట్లాడడం, వృత్తిలోని గౌరవాన్ని నొక్కి చెప్పడానికి యూనియన్ సహాయపడుతుంది. ఆటో క్వీన్స్ వీపీఎంఎస్ అధ్యక్షురాలు మోహన సుందరి, యూనియన్ కోశాధికారి లీలా రాణి మధ్య స్నేహాన్ని మరింత పెంచింది. మొదట్లో ఉమ్మడి ప్రతిఘటనలో ఏర్పడిన వారి బంధం రోజువారీ ఆనందాల ద్వారా ఏర్పడిన సున్నితమైన సహవాసంగా మారింది.వారికి ఆనందం అవసరంకేవలం కష్టాలు, సమస్యలను పరిష్కరించుకోవడమే కాకుండా బీచ్‌లో ఎక్కువ సేపు గడుపుతుంటారు. తమ పోరాటాలను గుర్తు చేసుకుంటూనే ఆనందంగా పాటలు పాడుకుంటారు. ‘సాధారణ విషయాల గురించి నేను ఎప్పుడూ ఆలోచిస్తుంటాను. అందుకే ఇలాంటి సినిమా ఒకటి తీయాలని ఎప్పటి నుండో భావిస్తున్నాను’ అని శ్రాయంతి చెప్పారు. ‘సాధారణంగా మనకు అందుబాటులో ఉండే డాక్యుమెంటరీలు చాలా ప్రామాణికమైనవి, ఇంటర్వ్యూ ఆధారితమైనవి. ఇందులో మీరు ప్రజల జీవితాల గురించి తెలుసుకుంటారు. కానీ ఆ పాత్రలోకి మీరు ప్రవేశించలేరు’ అంటారు శ్రాయంతి. సంతోషం, విశ్రాంతికి మహిళలు ఎంతగా దూరమైపోతున్నారో ఆమె గమనించారు. అలాగే అట్టడుగు వర్గ ప్రజల జీవితాలకు దూరంగా ఉన్న వారికి ఇలాంటి డాక్యుమెంటరీలు ఆ లోటును తీర్చేస్తాయని ఆమె అంటున్నారు.సమాజం వైపు నడిపిస్తుందిఆటో క్వీన్స్ పోరాడేందుకు ఏమాత్రం వెనకడుగు వేయారు. ఆమెను వేధించే, బెదిరించే పురుషులతో రాణి ఆవేశపూరిత ఘర్షణలు ఈ చిత్రానికి ప్రధానమైనవి. న్యాయం కోసం పోరాడే ఆమె తరచుగా వేధింపులను ఎదుర్కొంటుంది, కొన్నిసార్లు పురుషులతో కొట్లాటలు జరుగుతాయి. దీనికి విరుద్ధంగా సుందరి స్థిరత్వం, ప్రశాంతత కలిగి ఉంటుంది. రాణితో పాటు యూనియన్‌లోని ఇతర మహిళా డ్రైవర్లను ఈ చిత్రం సమాజం వైపు నడిపిస్తుంది. సంభాషణ ఊహించినట్లుగానే ప్రారంభమవుతుంది. వారు వృత్తిలోకి ఎలా ప్రవేశించారు, ఎదుర్కొంటున్న వేధింపులు, ప్రపంచంలో చూడాలని వారు కోరుకుంటున్న మార్పులు అన్నీ మనకు కనిపిస్తాయి. రాణి, సుందరి శ్రాయంతికి అక్కచెల్లెళ్లుగా కనిపిస్తారు. సాధారణంగా మాట్లాడుకోవడం, ఒకరినొకరు ఆటపట్టించడం చూసి చిత్రనిర్మాత వారి స్నేహం నుండి ఉద్భవించిన సంఘీభావాన్ని చిత్రీకరించాలని నిర్ణయించుకుంది.రాజకీయాలు ప్రభావితం చేస్తాయి

మహిళా డ్రైవర్లు చెన్నైలోని వివిధ ప్రాంతాలకు ఎలా ప్రయాణిస్తారో మనకు చూపిస్తారు. ఇందులో కులం, మత పరంగా అలాగే పొరుగున వుంటే ప్రాంతాల నుండి ఎలాంటి అనుభవాలు పొందారో కూడా ఈ చిత్రం ద్వారా తెలుసుకోవచ్చు. వలస కార్మికులు, కులం పేరుతో ఇప్పటికే వేరు చేయబడిన నగరంలో మహిళలు ప్రయాణించడం, పోటీ పడటం ఎలా ఉంటుందో చూడొచ్చు. రోజువారీ జీవితంపై దృష్టి పెట్టాలనుకున్న శ్రాయంతి ఈ చిత్రం ద్వారా రాజకీయాలను కూడా ప్రస్తావించారు. ‘యూనియన్ పేరు వినగానే రాజకీయ నాయకులకు వెంటనే ఒక అడుగు వెనక్కి వెళతారు’ అని ఆమె చెప్పింది. అయితే రాజకీయాలు వ్యక్తిగతం. కానీ రాజకీయాలు అందరి రోజువారీ జీవితాన్ని ప్రభావితం యని నిర్మాత అంటున్నారు.తమను తాము చూసుకుంటారుతన సౌండ్ టీమ్ అయిన పుతిర బాలన్, రాఘవ్ మహిళలు ఏమి చెబుతున్నారో వారిలో కోపం, ధిక్కరణ ఎలా వ్యక్తమవుతున్నాయో అవన్నీ ప్రేక్షలకు ఎలా అర్థం చేయించాలో నిశితంగా గమనించారని ఆమె చెప్పారు. ఈ చిత్రాన్ని సినిమాటోగ్రాఫర్ ప్రేమ్ అక్కట్టు సంవత్సరం 16 రోజుల పాటు చిత్రీకరించారు. తమ చిత్రం ద్వారా మహిళలకు తగినంత స్థలాన్ని,

కాలక్రమేణా అభివృద్ధి చెందుతున్న వారి జీవితాలను గుర్తించేందుకు వీలు కల్పించారు. వీపీఎంఎస్ సభ్యులందరూ కలిసి సినిమా చూసినప్పుడు ప్రదర్శన తర్వాత హర్షధ్వానాలు, నవ్వులతో ఆ ప్రదేశం నిండిపోయింది. ‘మాకు ఒక పెద్దహీరో సినిమా చూస్తున్నట్లు అనిపించింది. అంతకు మించి, ప్రజలు తమను తాము తెరపై చూస్తున్నట్లు భావించడం నేను చూడగలిగాను. వారి సొంత జీవితాలు వారికి తిరిగి ప్రతిబింబిస్తాయి’ అని శ్రయాంతి అంటున్నారు.

# ఉద్వేగ నియంత్రణ.. ఉద్యోగ అధిరోహణ!



ప్రస్తుత పోటీ ప్రపంచంలో మెరుగైన నైపుణ్యాలు ఉన్నవారే కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగం పొందగలుగుతున్నారు. వీరికి విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం బాగానే ఉంటున్నాయి. కానీ యువ ఉద్యోగుల్లో కొందరే కొలువులో విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. ఎక్కువ మంది ఉద్యోగ బాధ్యతల్లో ఒత్తిడికి గురై, భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోతున్నారు. ఫలితంగా కెరియర్ అర్ధాంతరంగా ముగుస్తోంది. అందువల్ల యువ ఉద్యోగులు ‘ఉద్వేగ ప్రజ్ఞ’ (ఎమోషనల్ ఇంటెలిజెన్స్)పై దృష్టి సారించాలి.భావోద్వేగ నియంత్రణకాలేజీ సిలబస్‌లో, కార్పొరేట్ సంస్థల శిక్షణలో భావోద్వేగాలకు తక్కువ ప్రాధాన్యమే దక్కుతోంది. ఉద్యోగ విధుల్లో విమర్శలు ఎదురైనప్పుడు, సహోద్యోగులతో విభేదాలు తలెత్తినప్పుడు లేదా ఆశించిన గుర్తింపు రానప్పుడు యువ ఉద్యోగులు త్వరగా నిరాశకు లేదా ఆగ్రహానికి లోనవుతున్నారు.

విధుల్లో ఒత్తిడి ఎదురైనప్పుడు ఆలోచనలపై నియంత్రణ కోల్పోయి భావోద్వేగాలకు లోనవుతుంటారు. ఎంపిక చేసుకున్న ఉద్యోగి కేవలం పనిలో సమర్థుడైతే సరిపోదని, వినియోగదారులు, సహోద్యోగులతో హుందాగా ప్రవర్తించాలని యాజమాన్యాలు కోరుకుంటాయి. భావోద్వేగాలపై నియంత్రణ లోపించిన ఉద్యోగులు వృత్తిలో ఎదగలేకపోతున్నారు.నియంత్రణ లోపిస్తేప్రవీణ్ ఒక ఐటీ సంస్థలో డేటా అనలిస్టుగా చేరాడు. తక్కువ కాలంలోనే మంచి నైపుణ్యాలున్న ఉద్యోగిగా గుర్తింపు పొందాడు. ఒక డేటా అనాలిసిస్‌కు సంబంధించి టీమ్ లీడర్‌కు నివేదిక పంపాడు. అందులో లోపాలు ఉన్నాయని, పనితీరు ఇలాగే కొనసాగితే ఉద్యోగంలో ఎదుగుదల ఉండదని టీమ్ లీడర్ మెయిల్ ద్వారా అతడికి సూచించారు. అప్పటికే, వ్యక్తిగత కారణాలతో మానసిక ఒత్తిడిలో ఉన్న అతడు ఆ మెయిల్‌ను విమర్శగా భావించి, భావోద్వేగానికి లోనయ్యాడు. తన అనాలిసిస్‌ను తప్పుపట్టాల్సిన అవసరం లేదని, టీమ్ లీడర్ స్థాయిలో ఇలాంటి మెయిల్స్ పంపవద్దని హెచ్చరికతో కూడిన రిప్లై పంపాడు. ఈ సమాధానం ఊహించని టీమ్ లీడర్ ప్రవీణ్‌ను భావోద్వేగాలు నియంత్రించుకోలేని ఉద్యోగిగా మదింపు వేసి, అతడికి కొత్త ప్రాజెక్టులు అప్పగించలేదు. ఈ మార్పును గమనించినప్పటికీ, నష్ట నివారణ చర్యలు చేపట్టకపోవడంతో క్రమంగా సంస్థలో అతడి అవసరం తగ్గింది. భావోద్వేగాలను నియంత్రించుకోలేక, చివరికి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది.రోజువారీ పనిలో జరిగే చిన్నచిన్న పొరపాట్లకు ఎలా స్పందించాలో తెలుసుకోవడం ఎంతో అవసరం. సీనియర్లు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను వ్యక్తిగత విమర్శగా తీసుకోవద్దు. పనితీరు మెరుగు పరుచుకునే సూచనగా స్వీకరించాలి. ఇలా చేస్తేనే యువ ఉద్యోగులు కార్పొరేట్ సంస్థలలో దీర్ఘకాలం మనుగడ సాగించగలరు.

పాజిటివ్ స్పందనఒక సంస్థలో సాఫ్ట్‌వేర్ ట్రెయినీగా రవి చేరాడు. అతడు చేసిన ప్రజెంటేషన్‌లోని లోపాలపై టీమ్ లీడర్ అందరి సమక్షంలో విమర్శించారు. రవి ఆ విమర్శలను భావోద్వేగంతో కాకుండా, నిజాయతీగా విశ్లేషించుకున్నాడు. మీటింగ్ పూర్తయ్యాక టీమ్ లీడర్‌ను కలిసి, ఆ అభిప్రాయాలను సానుకూలంగా స్వీకరిస్తున్నానని చెప్పాడు. ఈ సూచనలు వృత్తిలో ఎదుగుదలకు దోహదపడతాయని తెలియజేసి, మరిన్ని సలహాలూ కోరాడు.

ఈ ఊహించని స్పందనతో అతడిపై టీమ్ లీడర్‌కు గౌరవం, అభిమానం పెరిగింది. మేనేజ్‌మెంట్ ముందు అతడిని భావోద్వేగాలు నియంత్రించుకుంటూ, విమర్శలను సానుకూలంగా తీసుకునే ఉద్యోగిగా ప్రాజెక్ట్ చేశారు. అదనంగా మెంటర్‌షిప్ అవకాశాలు కల్పించి, ఉన్నత స్థాయి శిక్షణకు సిఫారసు చేశారు. రవి బలమైన ఉద్యోగిగా ఎదిగి, తక్కువ వ్యవధిలోనే టీమ్ లీడర్ స్థాయికి చేరుకున్నాడు.

ఆవేశం.. అవరోధమే

ప్రకాశ్ ఒక కార్పొరేట్ సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా చేరాడు. టీమ్ లీడర్ అతడికి ఒక ప్రాజెక్ట్ అప్పగించారు. ఆ ప్రాజెక్ట్ విజయం సాధించాలంటే బృందంతో సమష్టిగా పని చేయాలి. కానీ విద్యార్థి దశలో ఒంటరిగా చదవడానికి అలవాటు పడ్డ ప్రకాశ్ సహోద్యోగుల సహాయం తీసుకోవడానికి సిద్ధపడలేదు. దీంతో ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన గడువు సమీపించే కొద్దీ, ఒత్తిడిని తట్టుకోలేకపోయాడు. ఒక సమావేశంలో అధికారులతో ఆగ్రహంగా మాట్లాడాడు. ఈ ప్రవర్తనను భావోద్వేగ నియంత్రణ లోపంగా పరిగణించి, యాజమాన్యానికి టీమ్ లీడర్ నివేదిక పంపారు. ఫలితంగా ప్రకాశ్‌ను బృందం నుంచి తొలగించారు.నాయకత్వానికి దారిలత ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి, రసాయనాల తయారీ సంస్థలో నాణ్యత నియంత్రణ విభాగంలో ట్రెయినీగా చేరింది. మార్కెట్ నుంచి వచ్చిన సున్నితమైన ఫిర్యాదులను తక్కువ సమయంలో పరిష్కరించాల్సిన బాధ్యతను ఆమెకు టీమ్ లీడర్ అప్పగించారు. బృంద సభ్యులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పటికీ, వారి సహకారం లోపించినప్పటికీ, భావోద్వేగాలను ఆమె నియంత్రించుకుంది. సమస్యల పరిష్కారంపైనే దృష్టి సారించి, అప్పగించిన బాధ్యతను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సామర్థ్యాన్ని గుర్తించిన టీమ్ లీడర్.. సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కోగల ఉద్యోగిగా ఆమెను అభినందించారు. లత గురించి సానుకూల నివేదికను యాజమాన్యానికి పంపారు. దీంతో తదుపరి ప్రాజెక్ట్‌కు ఆమెను టీమ్ లీడర్‌గా నియమించారు.

కార్పొరేట్ సంస్థలలో భావోద్వేగ పరిణతి చాలా ముఖ్యం. నైపుణ్యాల లోపంతో

ఉద్యోగాలు కోల్పోయే వారికంటే, భావోద్వేగాలను నియంత్రించుకోలేని ఉద్యోగులు కెరియర్‌లో నష్టపోతున్నారు. పని ఒత్తిడిని భరించడం, విమర్శలను నిర్మాణాత్మకంగా స్వీకరించడం, అందరితో కలిసి పనిచేయడం లాంటి గుణాలను అలవర్చుకున్నప్పుడే యువ ఉద్యోగులు వృత్తిలో ఎదగగలరు. అందువల్ల కార్పొరేట్ సంస్థలలో కొలువు సంపాదించడమే కాకుండా, అక్కడ ఎదగడానికి ఉద్వేగ ప్రజ్ఞను పెంపొందించుకోవడమూ ఎంతో ముఖ్యం.

# సమష్టి ప్రగతికి సమున్నత ప్రమాణాలు!

భారత్‌లో 15–49 సంవత్సరాల్లోపు మహిళల్లో 53% మంది ఎనీమియాతో బాధపడుతున్నారు. 80% పైగా పిల్లలకు కనీస పోషక స్థాయి లేదు. ఈ లోపాలను అధిగమించడానికి కేంద్రం మాతృత్వ వందన యోజన, పోషణ్ అభియాన్‌లను ప్రారంభించింది. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యం కూడా ఎస్‌డీజీ–2 సాధించడానికి దోహదుతోందిపేదరికం, ఆకలి, అసమానతలు, పర్యావరణ క్షీణత, అందరికీ విద్య, ఆరోగ్యం, సమాజంలో శాంతి మొదలైనవన్నీ ఏ ఒక్క దేశానికో లేదా ఖండానికో పరిమితమైన సమస్యలు కావు. వీటి ప్రభావం వివిధ రూపాల్లో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై ఉంటుంది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాల మధ్య సమతౌల్యత లేకపోతే జరిగే అభివృద్ధి దీర్ఘకాలంలో అనర్థదాయకంగా మారుతుంది. అందుకే వర్తమాన అవసరాలను తీరుస్తూ రాబోయే తరాలకు కాలుష్యరహిత సహజ వనరులను, సురక్షిత ప్రపంచాన్ని అందించాలనే ఆశయంతో ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి భవిష్యత్తును నిర్మించాలని నిర్దేశించే ఆ లక్ష్యాలను ప్రపంచ దేశాలన్నీ అంగీకరించాయి. అవి ఏమిటి? వాటి సాధనలో ప్రపంచంతో సహా భారత్ ప్రస్తుతం ఏ స్థాయిలో ఉందో పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఒక్కో లక్ష్యాన్ని చేరడానికి సాయపడుతున్న కార్యక్రమాలనూ తెలుసుకోవాలి.సుస్థిరాభివృద్ధి లక్ష్యాలుఐక్యరాజ్య సమితి 2000 సంవత్సరంలో నిర్దేశించిన మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ (ఎండీజీ) ద్వారా సాధించిన పాక్షిక విజయాలకు కొనసాగింపుగా 2015లో 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ –ఎస్‌డీజీ) నిర్ణయించారు.ఎస్‌డీజీ–1 పేదరిక నిర్మూలన: సామాజిక, ఆర్థిక సమస్యలకు ప్రధాన మూలం పేదరికం. అందుకే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో సాపేక్ష, నిరపేక్ష పేదరిక నిర్మూలనను తొలి ప్రాధాన్యంగా ఎంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా రోజుకు 29 వేల మంది అయిదేళ్ల లోపు చిన్నారులు పేదరిక సంబంధిత కారణాలతో మరణిస్తున్నారు. డయేరియా, హైపాక్సీయా ఇందుకు ప్రధాన కారణాలు. భారత జనాభాలో 27.5% పేదలు. మహిళల్లో ప్రతి నలుగురిలో ఒకరికి మాత్రమే ఉపాధి అవకాశాలు ఎస్‌డీజీ–2 ఆహార భద్రత– ఆకలి నిర్మూలన: ఈ లక్ష్యం కోసం సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఆహార పదార్థాలను అందించాలి. ప్రపంచవ్యాప్తంగా 26.4% ప్రజలకు సరైన ఆహార వసతులు లేవు. దేశంలో అయిదేళ్ల లోపు చిన్నారుల్లో 35.8% మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారుఎస్‌డీజీ–3 ఆరోగ్యం, సంక్షేమం: ప్రజలందరికీ సరైన ఆరోగ్య సేవలు అందాలనేది దీని ధ్యేయం. ప్రస్తుతం 80% ప్రసవాలు సురక్షితంగా జరుగుతున్నాయి. అదే సమయంలో ప్రపంచ క్షయ రోగుల్లో ప్రతి నలుగురిలో ఒకరు భారతీయులే ఉండటం ఆందోళకరం. దేశంలో 21 లక్షల మంది హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థులున్నారు. ఇందులో 42% మహిళలు.

ఎస్‌డీజీ–4 నాణ్యమైన విద్య: నైపుణ్య విద్యను అందించడం ఎస్‌డీజీ 4 ముఖ్య లక్ష్యం. ఘర్షణ వాతావరణ ప్రాంతాల్లో జీవించే 50%పైగా చిన్నారులు సరైన

# చక్రాల కుర్చీ నుంచి అంతరిక్షంలోకి

అంతరిక్ష యాత్ర అంటే అంత తేలిక కాదు. ఎంతో శిక్షణ, పట్టుదల, ధైర్యం అవసరం. అలాంటిది ఓ వికలాంగురాలు వీల్‌చైర్‌లో కూర్చొని అంతరిక్ష యాత్ర చేసి విజయవంతంగా తిరిగొచ్చింది. వీల్‌చైర్‌లో ఆ యాత్ర చేసిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించింది. సంకల్పం ముందు ఎలాంటి లక్ష్యమైనా చిన్నబోవాల్సిందే అనే నానుడికి ఈమె జీవితం సరిగ్గా సరిపోతుంది. ఆమే జర్మనీకి చెందిన మైఖేలా బెంథాస్. అసాధారణమైన ధైర్యం, ఆత్మవిశ్వాసంతో అంతరిక్షానికి వెళ్లి వచ్చిన ఆమె పరిచయం క్లుప్తంగా...

చిన్నతనం నుండే ఈమె సాహసాలను ఎంతో ఇష్టపడేది. ఆకాశం, నక్షత్రాలు, అంతరిక్ష యాత్రలపై ఆమెకు అపారమైన మక్కువ ఉండేది. అదే మక్కువ ఆమెను ఏరోస్పేస్, మెకాట్రానిక్స్ రంగంల్లో నిపుణురాలిగా మార్చింది. గతంలో ఆమె ఎన్నో సాహసాలు కూడా చేసింది. 2018లో మౌంటెన్ బైకింగ్ చేస్తుండగా గాయపడింది. వెన్నుపూస దెబ్బతినడంతో చక్రాల కుర్చీకే పరిమితమయింది. అయినప్పటికి అంతరిక్షం పట్ల జిజ్ఞాస తగ్గలేదు. ఇక అంతటితో తన జీవితం ముగిసిపోయిందని ఆమె కుంగిపోలేదు.

అంతరిక్షంలో విహరించిఎప్పటి నుండో స్పేస్‌లోకి వెళ్లాలని కలలను కంటున్న ఆమె ఎలాగైనా తన కలను నిజం చేసుకోవాలనుకుంది. అయితే ప్రమాదం తర్వాత ఆమె కుటుంబ సభ్యులు దీనికి అంగీకరించలేదు. కానీ మైఖేలా మాత్రం పట్టిన పట్టువదలలేదు. వీల్‌చైర్‌లో ఉండే దానికి తగిన శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది. ప్రస్తుతం ఏరోస్పేస్, మెకాట్రానిక్స్ ఇంజనీర్‌గా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీలో మైఖేలా పని చేస్తుంది. ఇటీవల అమెరికాకు చెందిన జెఫ్ బెజోస్‌కు సంబంధించిన బ్లూ ఒరిజిన్ సంస్థ ఇటీవల న్యూ షఫర్డ్ ఎన్ఎస్–97 సబ్ అర్బిటాల్



మిషన్‌ను నిర్వహించింది. అమెరికాలోని టెక్సాస్ నుండి వ్యోమనౌకలో మైఖేలా బెంథాస్‌తో పాటు మొత్తం ఆరుగురు అంతరిక్షంలోకి వెళ్లారు. భూమి ఉపరితలం నుండి 100 కిలోమీటర్ల ఎత్తులో అంతరిక్షంలో కాసేపు విహరించి, భూమిపైకి ఆ ఆరుగురు క్షేమంగా తిరిగొచ్చారు.

పట్టువీడకుండా...స్పేస్ యాత్ర చరిత్రలోనే వీల్‌చైర్‌లో కూర్చొని అంతరిక్ష యాత్రలో పాల్గొనడం ఇదే మొదటిసారి. వికలాంగులు సైతం ఇలాంటి సాహస యాత్రలు చేయవచ్చని బెంథాస్ నిరూపించింది. వికలాంగులకూ అంతరిక్ష కలలు సాకారం చేసుకోవచ్చంటూ లక్షలాది మందిలో ఆమె ఆశ, ధైర్యం నింపారు. అంతరిక్ష యాత్ర ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావాలని ఈమె విస్తృతంగా ప్రచారం చేస్తుంది.



# ఆ వయస్సులోనే జీవిత పాఠాలు నేర్చుకున్నా

చిన్న వయసులోనే సినిమాల్లో అడుగుపెట్టి, క్రమంగా హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి తేజస్వి మదివాడ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, హార్ట్ అటాక్, పండగ చేస్కో వంటి విజయవంతమైన సినిమాల్లో కీలక పాత్రల్లో కనిపించిన ఆమె, ఆ తర్వాత కేరింత, ఐస్ క్రీమ్ లాంటి చిత్రాలతో హీరోయిన్‌గా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఐస్ క్రీమ్ సినిమాలో ఆమె చేసిన డిఫరెంట్ రోల్ అప్పట్లో పెద్ద చర్చకే దారి తీసింది.కొన్ని సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టాక్ షోలతో బిజీగా కనిపించిన తేజస్వి ఇటీవల పెద్దగా తెరపై కనిపించకపోయినా, ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనుభవాలను చాలా ఓపెన్‌గా పంచుకుంది.

# ఓటీటీలోకి 'జిగ్రీస్' సునామీ



అమెజాన్ ప్రైమ్, సన్ నెక్ట్స్‌లో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'జిగ్రీస్'. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ సినిమాను ఎగబడి చూస్తున్నారు. కేవలం నవ్వులే కాదు, గుండెకు హత్తుకునే భావోద్వేగాలతో ఈ సినిమా ఒక మ్యాజిక్ క్రియేట్ చేస్తోంది. దర్శకుడు హరీష్ రెడ్డి ఉప్పుల ఎక్కడా అసభ్యత లేకుండా, కుటుంబం అంతా కలిసి చూసేలా ఈ కథను ఒక అనుభవజ్ఞుడైన దర్శకుడిలా అద్భుతంగా తీర్చిదిద్దారు. కృష్ణ బురుగుల తన అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో అందరినీ కడుపుబ్బ నవ్వించడమే కాకుండా, ఎమోషనల్ సీన్స్‌లో కంటతడి పెట్టిస్తూ మెమరబుల్ పర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఆయనతో పాటు మణి వక్కా, ధీరజ్ ఆత్రేయ మరియు రామ్ నితిన్ తమ నటనతో సినిమాకు ప్రాణం పోశారు. కృష్ణ వోడపల్లి నిర్మాణంలో, చిత్తం వినయ్ కుమార్ సహ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రానికి సందీప్ రెడ్డి వంగా గారి సపోర్ట్ పెద్ద బలాన్ని ఇచ్చింది. సయ్యద్ కమ్రాన్ సంగీతం, ఈశ్వరదిత్య డీవోపీ మరియు చాణక్య రెడ్డి తూరుపు ఎడిటింగ్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి.

# సోషల్ మీడియాను షేక్ చేస్తున్న 'మా ఇంటి బంగారం' టీజర్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' సోషల్ మీడియాలో రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా విడుదలైన ఈ చిత్ర టీజర్ ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ, అతి తక్కువ సమయంలోనే 20 మిలియన్లకు పైగా డిజిటల్ వ్యూస్‌ని సొంతం చేసుకుని రికార్డు సృష్టించింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. పెళ్లి అయిన అనంతరం పల్లెటూరికి కోడలిగా వెళ్లిన సమంతకి అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి.. తన గతం ఏంటి అనేది ఈ సినిమా కథ అని తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు సమంత భర్త రాజ్ నిడిమోర్ ఈ కథను రాయగా.. నందినీ రెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుంది. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్ దీనిని నిర్మిస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు.




# 'భగవంత్ కేసరి' రీమేక్‌గా 'జన నాయగన్'



'జన నాయగన్' ట్రైలర్‌లో నాలుగు సన్నివేశాలు చూసి 'భగవంత్ కేసరి'ని యథాతథంగా తీసేశారని అనడం సబబు కాదని దర్శకుడు అనిల్ రావిపూడి అభిప్రాయపడ్డారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్ర ప్రమోషన్స్‌లో అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'భగవంత్ కేసరి' రీమేక్‌పై ప్రశ్నించగా, అనిల్ చాలా హుందాగా స్పందించారు. సినిమా వచ్చే వరకూ సోషల్‌మీడియాలో చర్చ అనవసరమని అన్నారు.

''భగవంత్ కేసరి' మూవీ ఆత్మను తీసుకుని అక్కడి నేటివిటీకి అనుగుణంగా మార్పులు చేసుకుని ఉంటారు. బహుశా ఓపెనింగ్ సీన్స్, ఇంటర్వెల్ ఇలా కొన్ని పార్ట్‌లు యథాతథంగా తీసి ఉండవచ్చు. మిగిలినదంతా మార్చి ఉంటారు. విలన్ ట్రాక్ మొత్తం మారిపోయినట్లు కనిపిస్తోంది. రోబోట్స్ కూడా ఉన్నాయి. సైన్స్ ఫిక్షన్ జోడించినట్లు తెలుస్తోంది. 'భగవంత్ కేసరి' కంటెంట్ విజయ్ గారికి బాగా నచ్చింది. ఎవరేమనుకున్నా.. ఎవరెంత అనుకున్నా సినిమాలో సోల్ బాగుంటుంది. దానికి విజయ్ నటన మరింత బలమవుతుంది. రీమేక్ అనుకున్నప్పుడు ఎవరు తీసినా, అలాగే తీయాలి. గతంలో రీమేక్స్ అన్నీ అలా తీసినవే కాదా? కరోనా తర్వాత రీమేక్స్ తగ్గాయి''

''అసలు రీమేక్ అంటే ఏంటి?ఒక భాషలో తీసిన సినిమాను మరో భాషలో తీయడమే కదా! వాళ్లు రీమేక్ అని చెప్పకపోవడానికి కారణం దాని చుట్టూ మరిన్ని విమర్శలు ఎదురవుతాయని భావించి ఉండవచ్చు. తమిళ ప్రేక్షకులకు ఇది కొత్త సబ్జెక్ట్. అక్కడి వాళ్లందరూ వచ్చి 'భగవంత్ కేసరి' చూడలేదు కదా! హిందీలో 'దబాంగ్'ను తెలుగులో 'గబ్బర్ సింగ్'గా మార్చి బాగా తీశారు. మంచి హిట్ కూడా అయింది. ఒక కథకు అక్కడి హీరో బలాలు యాడ్ అయితే, సినిమా మరోలా ఉంటుంది. ఇంకా మనం సినిమాను చూడలేదు. ఆయన ఏం చేశారో చూశాకే మాట్లాడాలి. ట్రైలర్‌లో కొన్ని సీన్స్ చూసి, చర్చ చేయడం అనవసరం. కంటెంట్ బయటకు వస్తేనే మాట్లాడాలి. ఇది విజయ్‌గారికి మంచి వీడ్కోలు అవ్వాలని కోరుకుంటున్నా'' అని అనిల్ రావిపూడి అభిప్రాయపడ్డారు.

# 'నందమూరి మోక్షజ్ఞ' ఎంట్రీకి ముహూర్తం ఫిక్స్ !



నందమూరి కుటుంబానికి ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. అలనాటి సీనియర్ ఎన్టీఆర్ నుంచి ఇప్పటి జూనియర్ ఎన్టీఆర్ వరకు అందరూ ఓ రేంజ్ కి వెళ్లారు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్, నందమూరి బాలయ్య, కళ్యాణ్ రామ్ శకం నడుస్తోంది. త్వరలోనే నందమూరి బాలయ్య కుమారుడు నందమూరి మోక్షజ్ఞ సినీ రంగ ప్రవేశం చేయబోతున్నారు. ఇప్పటికే ఈయన సినిమా ఎంట్రీ పైన చాలా వార్తలు వచ్చాయి. ఇప్పుడు మరో రూమర్ బయటకు వచ్చింది.

# 'నారి నారి నడుమ మురారి' ట్రైలర్ వచ్చేసింది




శర్వానంద్, సంయుక్త, సాక్షి వైద్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నారీ నారీ నడుమ మురారి' రామ్ అబ్బరాజు తెరకెక్కిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. మాజీ ప్రేయసి, ప్రజెంట్ లవర్ మధ్య నలిగిపోయే యువకుడిగా శర్వానంద్ నటన అలరిస్తోంది.



# రోమియో.. ఎక్కడున్నావ్!

అగ్రతారల సరసన అవకాశాలు అందుకుంటూ జోరు మీదుంది బాలీవుడ్ కథానాయిక త్రిప్తి దిమ్రీ. ప్రస్తుతం ప్రభాస్‌కి జోడీగా 'స్పిరిట్' సినిమాతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలో 'ఓ రోమియో' చిత్రం ఉన్న సంగతి తెలిసిందే. ఆమె, హిందీ హీరో షాహిద్ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రమిది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ''హేయ్ రోమియో.. నువ్వు ఎక్కడున్నావు'' అనే వ్యాఖ్యను జోడించింది. 'నాతో గొడవ పెట్టుకునేంత ధైర్యం ఎవరికుంది?' అంటూ సాగుతున్న ఈ టీజర్‌లో షాహిద్ యాక్షన్ అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. రివేంజ్ ప్రేమకథగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో విక్రాంత్ మాస్సే, తమన్నా, నానా పటేకర్ తదితరులు కీలక పాత్రల్లో మెరవనున్నారు. సాజిద్ నడియాడ్ వాలా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానుంది.

# పవన్‌కల్యాణ్‌కు అరుదైన ఘనత



సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అరుదైన ఘనత సాధించారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యులైన ఆయన.. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొంది అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా సాగించిన సాధన, పరిశోధన, అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. కరాటే, యుద్ధకళల పట్ల ఆసక్తి కలిగిన పవన్.. చెన్నైలో ఉండగానే కఠినమైన శిక్షణతో పాటు నిరంతర సాధన చేశారు. శారీరక సాధనకే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి వాటిని అనుసరించారు. పలు సినిమాల్లో మార్షల్ కళలను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తృత గుర్తింపు, ప్రజాదరణ తీసుకొచ్చారు. జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థల్లో ఒకటైన 'సోగో బుడో కన్‌రి కై' నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదో డాన్) పురస్కారం లభించింది. జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సై'లోని 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ఆయనకు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే విశిష్ట బిరుదు అందించింది. ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్దిక్ మహ్మూదీ మార్గ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం పొందారు. సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రాలను అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్దిమంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా పవన్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

ఇక సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం ఆయన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రీకరణ పూర్తయింది. హరీశ్ శంకర్ దర్శకుడు. శ్రీలీల కథానాయిక. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు పవన్‌కల్యాణ్ సిద్ధమవుతున్నారు. ఇటీవల ఇందుకు సంబంధించిన ప్రకటన కూడా వెలువడింది.

బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ సబ్జెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. మరి ఆ అంచనాలని రాజసాబ్ అందుకుందా? ఈ సంక్రాంతి తొలి విజయం నమోదైయిందా? రివ్యూలో చూద్దాం.

# థ్రిల్లింగ్ బ్లాక్ బస్టర్ రాజాసాబ్



## కథ :

రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి (జరీనా వహాబ్) నే. గంగాదేవికి ఆల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవి లోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగు పెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

## విశ్లేషణ:

నాయనమ్మకి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది.సత్య పాత్ర రాజ్ మహల్ ప్రవేశం, అక్కడ జరిగిరే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది.

## ఎవరెలా చేశారు?

ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్, ఫైట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. హాస్పిటల్ సీన్ లో తన నటన ఎమోషనల్ హత్తుకుంటుంది. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపోతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయితే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణేష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, సత్య.. అక్కడక్కడ నవ్వించారు.

## టెక్నికల్ గా:

తమన్ నేపథ్య సంగీతం పవర్ ఫుల్ గా వుంది. చాలా చోట్ల ఎమోషన్ ఎలివేట్ చేసింది. కాకపోతే కొన్ని చోట్ల మరీ లౌడ్ అనే ఫీలింగ్ కూడా కలిగిస్తుంది. రాజ్ మహల్ సెట్ ని గ్రాండ్ గా తీర్చిదిద్దారు. కార్తీక్ పళని కెమెరా పనితనం ఆకట్టుకుంటుంది. విజువల్ ఎఫెక్ట్స్ బావున్నాయి. పీపుల్ మీడియా ఫాక్టరీ నిర్మాణ విలువలు ఉన్నంతంగా వున్నాయి. మారుతి ఎంచుకున్న హారర్ ఫాంటసీ కాన్సెప్ట్ బావుంది. కాకపోతే ఆ కాన్సెప్ట్ ఎఫెక్టివ్ గా తీసుంటే ఎక్స్ పీరియన్స్ ఇంకా బెటర్ గా వుండేది.

# నడిరోడ్డున యువతిపై దాడి

## విశాఖలో సంచలన ఘటన, విశాఖ ఇమేజ్ దెబ్బతీస్తే సహించం : సీఎం చంద్రబాబు

**వుదయం, అమరావతి:** విశాఖపట్నం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తే సహించేది లేదని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. ఆదివారం ఉదయం స్థానిక జగదాంబ సెంటర్‌లో మహిళపై దాడి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు ఆదివారం అమరావతిలో స్పందించారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన విశాఖపట్నం నగర పోలీసులపై ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. స్పష్టమైన ఆధారాలు లేకున్నా ఈ దాడి కేసును ఛేదించారంటూ వారికి సీఎం చంద్రబాబు కితాబు ఇచ్చారు.

విశాఖపట్నంలో ఆదివారం ఓ యువతి ఆఫీస్‌కు నడిచి వెళ్తోంది. జగదాంబ సెంటర్‌లో థియేటర్ సమీపంలో ఉన్న రాజాసాబ్ సినిమా పోస్టర్‌ను ఫొటో తీసింది. ఆ సమీపంలో మాలధారణలో ఉన్న వ్యక్తి.. ఆమె వద్దకు వచ్చి గట్టిగా అరవడం ప్రారంభించాడు. తొలుత అతడు సమీపంలోని ఆటో డ్రైవర్లపై అరుస్తున్నాడని భావించింది. ఆ కొద్దిసేపటి తర్వాత.. ఆమె వద్దకు వచ్చి చెంపపై కొట్టి.. నోటికొచ్చినట్లు బూతులు తిట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆమె కళ్ల అద్దాలు పగిలిపోయాయి. ఊహించని ఈ ఘటనతో యువతి భయాందోళనకు గురైంది. అసలు తనను అతడు ఎందుకు కొట్టాడో కూడా తెలియదని



ఆవేదన వ్యక్తం చేస్తూ.. జరిగిన ఘటనపై వీడియోలో వివరిస్తూ.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతేకాదు.. ఈ ఘటన జరిగిన సమయంలో ఆ పరిసర ప్రాంతంలో ఉన్న వారెవరూ కనీసం స్పందించలేదంటూ కన్నీటి పర్యంతమవుతూ వివరించింది. ఈ జరిగిన విషయాన్ని తన ఆఫీస్‌లోని సహచరులకు ఫోన్ ద్వారా వివరించింది. దాంతో వారంతా జగదాంబ సెంటర్‌కు వచ్చి సదరు యువతిని తీసుకెళ్లారు. అనంతరం ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జగదాంబ సెంటర్‌కు చేరుకుని.. సమీపంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. యువతిపై దాడి చేసిన వ్యక్తిని కొన్ని గంటల్లోనే అరెస్ట్ చేశారు. ఆ తర్వాత అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే దాడి చేసిన వ్యక్తి మానసిక పరిస్థితి బాగోలేదని పోలీసులు వివరించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు పైవిధంగా స్పందించారు.

# అమరావతికి కుడి, ఎడమ మద్దతు

## అమరావతే సరైన రాజధాని : వెంకయ్య నాయుడు

### 15 ఏళ్ల తరువాత కూడా రాజధాని రగడ మంచిది కాదు : బివి రాఘవులు

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**


ఏపీకి సరైన రాజధాని నగరం అమరావతి మాత్రమేనని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజధాని విషయంలో అనవసర వివాదాలు చేయవద్దని రాజకీయ పార్టీలు, ఇతర వర్గాల ప్రజలకు సూచించారు. గుంటూరు, విజయవాడ, గన్నవరం ఇలా కొన్ని ప్రాంతాలు కలిపి అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. పరిపాలనాపరంగా రాష్ట్రాలుగా విడిపోయినా, తెలుగు ప్రజలంతా కలిసి మెలిసి ఉన్న దృష్ట్యా తెలంగాణ రాజధాని హైదరాబాద్ తరహాలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కూడా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబురాల్లో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



**వైఎస్ జగన్‌కు బీవీ రాఘవులు హితవు..**

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంశంపై వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు, వివాదాలు అనవసరమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత బి.వి.రాఘవులు హితవుపలికారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 15 ఏళ్లు అవుతున్నా ఇంకా రాజధాని అంశంపై వివాదాలు లేవనెత్తడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రాఘవులు కీలక వ్యాఖ్యలు చేశారు.

అమరావతిని రాజధానిగా అందరూ(పార్టీలు, ప్రజలు) అంగీకరించారని.. ఇప్పుడు మళ్లీ వివాదం చేయడం అనవసరమని రాఘవులు అన్నారు. జగన్ మొదట్లో అమరావతిని రాజధానిగా అంగీకరించిన విషయాన్ని ఈయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. జగన్ ఇకనైనా తన తీరు మార్చుకోవాలని రాఘవులు సూచించారు. కృష్ణానది తీర ప్రాంతంలో అమరావతి ఉందా, లేదా? అనే చర్చకు ఇప్పుడు అర్థం లేదని.. రాజధాని నిర్మాణ పనుల్లో లోపాలు, అవినీతి ఉంటే వాటిని ప్రశ్నించాలని హితవుపలికారు. రాజధానిని అంగీకరించి, త్వరగా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం, కేంద్రంపైనా ఒత్తిడి తెచ్చేలా సహకరించాలని రాఘవులు సూచించారు. అటు, రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోలవరం వంటి అంశాల గురించి చంద్రబాబుపై జగన్ చేస్తున్న వ్యాఖ్యలను కూడా రాఘవులు విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చెప్పిన వెలిగొండ, హంద్రీ నీవా, గాలేరు ప్రాజెక్టులు ఇంకా పూర్తికాలేదని, ఇలాంటి సమయంలో లేని ప్రాజెక్టుల గురించి అనవసర రాద్ధాంతం చేసి ప్రజలకు అన్యాయం



చేయవద్దని ఆయన అన్నారు. పోలవరం పేరుతో వైఫల్యాలు ఎత్తిచూపడం సరికాదని జగన్ కు బి.వి.రాఘవులు సూచించారు.

**అమరావతిని పునర్నిర్మిస్తుంటే జగన్‌కు కడుపుమంటగా ఉంది: మంత్రి మండిపల్లి**

ఏపీ రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు పునర్నిర్మిస్తుంటే జగన్‌కు కడుపుమంటగా ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. అమరావతిపై మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ.. రాష్ట్రానికి రాజధాని లేకుండా నాశనం చేసింది జగనేనని మండిపడ్డారు. రాజధానిగా అమరావతిని ఐదేళ్లు పక్కనపెట్టి అపహాస్యం చేశారన్నారు. వైకాపా హయాంలో మూడు రాజధానుల పేరిట నాటకమాడి, రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని విమర్శించారు.

**బెంగళూరులో కూర్చొని జగన్ కుట్రలు: టిడిపి ఎంపీ కలిశెట్టి**

బెంగళూరులో కూర్చొని ఏపీపై మాజీ సీఎం జగన్ కుట్రలు చేస్తున్నారని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. ఈ కుట్రలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలన్నారు. ''జగన్ కుట్రలపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తా. వైకాపా ఎంపీల ఆస్తులు విపరీతంగా పెరిగాయి. దానిపై ఆ పార్టీకి చెందిన సహచర ఎంపీలే ఆశ్చర్యపోతున్నారు. అమరావతిలో జరుగుతున్న పనుల వీడియోలన్నీ తీసి జగన్‌కు పంపుతున్నా. నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న జగన్ ప్యాలెస్ ఎప్పుడైనా మునిగిందా?'' అని కలిశెట్టి ప్రశ్నించారు.

# దారికి వచ్చిన ఎక్స్

**మొదటి పేజీ తరువాయి..**

గ్రోక్ దుర్వినియోగంపై ప్రభుత్వ పరిశీలనగ్రోక్ దుర్వినియోగంపై ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక (ఎంఇఐటివై) మంత్రిత్వ శాఖ కఠిన పరిశీలన, పర్యవేక్షణ నడుమ ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. తను జారీ చేసిన తొలి నోటీసుకు ఎక్స్ స్పందనతో అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రభుత్వం. ఇటీవలే రెండవ నోటీసును జారీ చేసింది. యూజర్లు గ్రోక్ ను ఉపయోగించి అంగీకారం లేకుండా తీసిన అభ్యంతర చిత్రాలను, అంశాలను రూపొందిస్తున్నారని తెలిసిన ప్రభుత్వం జనవరి 2వ తేదీన ఎక్స్‌కు అధికారిక నోటీసు పంపింది. కాగా, భారతీయ చట్ట, న్యాయ ప్రమాణాలకు అనుగుణంగా తమ వేదికపై అసభ్యకరమైన చిత్రాలు రాకుండా చూస్తామని ఎక్స్ హామీ ఇచ్చినట్టు సమాచారం.తప్పును అంగీకరించిన ఎక్స్, చట్టాలకు అనుగుణంగా ఉంటామని హామీ

తన తప్పును ఎక్స్ అంగీకరించడమే కాక, అసభ్యకరమైన చిత్రాల ఉత్పత్తిని నిలిపివేస్తామని ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. తన జనవరి 2వ తేదీ లేఖలో ఎంఇ ఐటివై శాఖ లైంగికంగా అసభ్యకరంగా ఉన్న చిత్రాలను నిలవరించడంలో లోటుపాట్లను గురించి తీవ్రమైన స్పందనను తెలిపింది. దేశ చట్టం అమలు కావాలి అని అధికారి అన్నట్టుగా జాతీయ పత్రిక ఒకటి పేర్కొంది.నిబంధనలను పాటించడంలో విఫలమైతే, ఎక్స్ భారతీయ చట్టాల ప్రకారం చట్టపరమైన రక్షణను కోల్పోవచ్చని అధికారులు హెచ్చరించారు.వారి ఏఐ చాట్‌బాట్‌లు కంటెంట్ నిబంధనలను ఉల్లంఘిస్తే, ఇతర ప్లాట్‌ఫామ్‌లపై కూడా ఇలాంటి చర్యలే తీసుకోవచ్చని వారు తెలిపారు. గ్రోక్ విషయానికి వస్తే, అది ఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్‌పై పని చేస్తున్నందున, దాని ప్రభావం వేగంగా ఉంటుంది, అని ఒక అధికారి అన్నారు. గ్రోక్ తటస్థ ప్లాట్‌ఫాం సాధనం కాదు: ఎంఇఐటివైగ్రోక్‌ను ఒక తటస్థ ప్లాట్‌ఫామ్ సాధనంగా పరిగణించలేమని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇప్పుడు ఆలోచనా విధానం మారింది. అంతకు ముందు, ఉన్నత స్థాయిలో చర్చించేవారం, కానీ ఇప్పుడు మేము ఈ సమస్యను చట్టపరిధిలోకి తెచ్చాము. గ్రోక్‌ను ఒక వేదికగా పరిగణించలేము. అది ఒక కంటెంట్ సృష్టికర్త, ఒక కృత్రిమ కంటెంట్ సృష్టికర్త అని ఒక అధికారి పేర్కొన్నారు.ఎక్స్ స్పందన పట్ల ప్రభుత్వ అసంతృప్తిమంత్రిత్వ శాఖ లేఖను అందుకున్న ఐదు రోజుల అనంతరం, ఎక్స్ స్పందించినట్టు తెలుస్తోంది, కానీ ఆ సమాధానంతో తాము సంతృప్తి చెందలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ స్పందనను వివరిస్తూ, ఎక్స్ సంస్థ మంత్రిత్వ శాఖ లేవనెత్తిన ప్రధాన ఆందోళనలను పరిష్కరించకుండా, ఐదు పేజీలలో ప్రాథమికంగా తన సొంత వినియోగదారు విధానాన్నే పునరావృతం చేసింది అని ఒక అధికారి పేర్కొన్నారు.అభ్యంతరాలు లేవనెత్తుతున్న ఇతర దేశాలుగ్రోక్ ఉత్పత్తి చేస్తున్న అశ్లీల చిత్రాలు, కంటెంట్ పట్ల అభ్యంతరం వ్యక్తం చేసిన దేశం భారత్ ఒక్కటే కాదు.ఎఐ ఉత్పత్తి చేసిన అశ్లీల, అసభ్య చిత్రాలు, కంటెంట్‌కు సంబంధించిన ఆందోళనల కారణంగా ఇండోనేషియా ఇటీవల చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. యుకె, ఫ్రాన్స్, మలేషియా కూడా గతంలో అసభ్యకర చిత్రాలను రూపొందించడం పై అభ్యంతరాలు వ్యక్తం చేశాయి.

# పేదల ఇళ్లే కూలుస్తారా?

**మొదటి పేజీ తరువాయి..**

పాలనపై కేంద్రీకరించాలని సూచించారు. "పదేళ్లు పందిలా బతకాల్సిన అవసరం లేదు.. గౌరవంగా బతకాలి" అంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అశోక్ నగర్, దిల్ సుఖ్ నగర్ ప్రాంతాల్లో విద్యార్థులు జాబ్ నోటిఫికేషన్ల కోసం ఆందోళన చేస్తున్నారన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు వెళ్లిన సీఎం, పక్కనే ఉన్న అశోక్ నగర్‌కు వెళ్లి నిరుద్యోగులతో కలిసి టీ తాగి, వారి సమస్యలను విని ఉంటే బాగుండేదన్నారు. విద్యార్థులను పిలిపించుకుని మాట్లాడాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పదిమంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్తున్నారో అర్థం కావడం లేదు. వారిది ఏ లింగమో వాళ్లకే తెలియదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రకాష్ గౌడ్ వంటి నేతలు పార్టీ మారుతున్నా, రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధిని మాత్రం ఎవరూ ఆపలేరని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సచివాలయంలో 'సస్పెన్స్ థ్రిల్లర్' సినిమా

- సంబంధిత మంత్రికి తెలియకుండా ప్రభుత్వ జీవోలా..?
- ప్రభుత్వాన్ని నడిపిస్తున్న అదృశ్య శక్తులు ఎవరూ
- మాజీ మంత్రి హరీశ్ రావు

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

ప్రస్తుతం రాష్ట్రంలో థియేటర్ల కంటే సచివాలయంలోనే ఒక పెద్ద 'సస్పెన్స్ థ్రిల్లర్' ' సినిమా నడుస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు.. కాంగ్రెస్ పాలన తీరును విమర్శించారు. సినిమా టికెట్ ధరల పెంపుతో ప్రజలపై భారం మోపుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఆదివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. ఒకవేళ ఉంటే ఎవరి ఆధీనంలో ఉంది అనే అనుమానం ప్రతి ఒక్కరికీ కలుగుతోందన్నారు. ఒకవైపు టికెట్ ధరలు పెంచుతూ జీవో బయటికి వస్తుందని.. మరోవైపు.. ఆ శాఖకు బాధ్యత వహించాల్సిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాత్రం తనకు తెలియదు.. తనప్రమేయం లేదనీ, తన దగ్గరికి ఫైల్ రాలేదు అని నిస్సహాయంగా చేతులెత్తేస్తారని తెలిపారు. శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిది.. జీవో ఇచ్చేది ఇంకొకరు అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సాక్షాత్తు ఒక క్యాబినెట్ మంత్రికి తెలియకుండానే.. ఆయన శాఖలో ఇంత పెద్ద నిర్ణయం జరిగిపోతుంటే.. అసలు ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ఎవరు అని ప్రశ్నించారు. అసలు మీరు నడుపుతున్నది సర్కారా.. లేక సర్కస్ కంపెనీనా అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. టికెట్ల పెంపు విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసినా.. ఈ ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమని విమర్శించారు. ఒక వైపు అసెంబ్లీ సాక్షిగా సొంత డబ్బా కొట్టుకుంటోన్న రేవంత్ సర్కార్.. మరొక వైపు క్షేత్రస్థాయిలో అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. తాను ఈ సీట్లో ఉన్నంత కాలం సినిమా టికెట్ రేట్ల పెంపు ఉండదనీ, బెనిఫిట్ షోలు ఉండవనీ, ఎవరికీ స్పెషల్ ప్రివిలేజ్ ఇవ్వం అని రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు, ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారని మండిపడ్డారు. నేడు మరో సినిమాకు కూడా జీవో ఇవ్వడానికి సిద్ధమయ్యారని హరీశ్‌రావు తెలిపారు.

# అశ్లీల పోస్టులపై

- దారికి వచ్చిన ఎక్స్

**మొదటి పేజీ తరువాయి..**

గ్రోక్ దుర్వినియోగంపై ప్రభుత్వ పరిశీలనగ్రోక్ దుర్వినియోగంపై ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక (ఎంఇఐటివై) మంత్రిత్వ శాఖ కఠిన పరిశీలన, పర్యవేక్షణ నడుమ ఈ చర్య తీసుకున్నట్టు తెలుస్తోంది. తను జారీ చేసిన తొలి నోటీసుకు ఎక్స్ స్పందనతో అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రభుత్వం. ఇటీవలే రెండవ నోటీసును జారీ చేసింది. యూజర్లు గ్రోక్ ను ఉపయోగించి అంగీకారం లేకుండా తీసిన అభ్యంతర చిత్రాలను, అంశాలను రూపొందిస్తున్నారని తెలిసిన ప్రభుత్వం జనవరి 2వ తేదీన ఎక్స్‌కు అధికారిక నోటీసు పంపింది. కాగా, భారతీయ చట్ట, న్యాయ ప్రమాణాలకు అనుగుణంగా తమ వేదికపై అసభ్యకరమైన చిత్రాలు రాకుండా చూస్తామని ఎక్స్ హామీ ఇచ్చినట్టు సమాచారం.తప్పును అంగీకరించిన ఎక్స్, చట్టాలకు అనుగుణంగా ఉంటామని హామీ

తన తప్పును ఎక్స్ అంగీకరించడమే కాక, అసభ్యకరమైన చిత్రాల ఉత్పత్తిని నిలిపివేస్తామని ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. తన జనవరి 2వ తేదీ లేఖలో ఎంఇ ఐటివై శాఖ లైంగికంగా అసభ్యకరంగా ఉన్న చిత్రాలను నిలవరించడంలో లోటుపాట్లను గురించి తీవ్రమైన స్పందనను తెలిపింది. దేశ చట్టం అమలు కావాలి అని అధికారి అన్నట్టుగా జాతీయ పత్రిక ఒకటి పేర్కొంది. నిబంధనలను పాటించడంలో విఫలమైతే, ఎక్స్ భారతీయ చట్టాల ప్రకారం చట్టపరమైన రక్షణను కోల్పోవచ్చని అధికారులు హెచ్చరించారు. వారి ఏఐ చాట్‌బాట్‌లు కంటెంట్ నిబంధనలను ఉల్లంఘిస్తే, ఇతర ప్లాట్‌ఫామ్‌లపై కూడా ఇలాంటి చర్యలే తీసుకోవచ్చని వారు తెలిపారు. గ్రోక్ విషయానికి వస్తే, అది ఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్‌పై పనిచేస్తున్నందున, దాని ప్రభావం వేగంగా ఉంటుంది, అని ఒక అధికారి అన్నారు.

గ్రోక్ తటస్థ ప్లాట్‌ఫాం సాధనం కాదు: ఎంఇఐటివైగ్రోక్‌ను ఒక తటస్థ ప్లాట్‌ఫామ్ సాధనంగా పరిగణించలేమని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇప్పుడు ఆలోచనా విధానం మారింది. అంతకు ముందు, ఉన్నత స్థాయిలో చర్చించేవారం, కానీ ఇప్పుడు మేము ఈ సమస్యను చట్టపరిధిలోకి తెచ్చాము. గ్రోక్‌ను ఒక వేదికగా పరిగణించలేము. అది ఒక కంటెంట్ సృష్టికర్త, ఒక కృత్రిమ కంటెంట్ సృష్టికర్త అని ఒక అధికారి పేర్కొన్నారు.ఎక్స్ స్పందన పట్ల ప్రభుత్వ అసంతృప్తిమంత్రిత్వ శాఖ లేఖను అందుకున్న ఐదు రోజుల అనంతరం, ఎక్స్ స్పందించినట్టు తెలుస్తోంది, కానీ ఆ సమాధానంతో తాము సంతృప్తి చెందలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ స్పందనను వివరిస్తూ, ఎక్స్ సంస్థ మంత్రిత్వ శాఖ లేవనెత్తిన ప్రధాన ఆందోళనలను పరిష్కరించకుండా, ఐదు పేజీలలో ప్రాథమికంగా తన సొంత వినియోగదారు విధానాన్నే పునరావృతం చేసింది అని ఒక అధికారి పేర్కొన్నారు.అభ్యంతరాలు లేవనెత్తుతున్న ఇతర దేశాలుగ్రోక్ ఉత్పత్తి చేస్తున్న అశ్లీల చిత్రాలు, కంటెంట్ పట్ల అభ్యంతరం వ్యక్తం చేసిన దేశం భారత్ ఒక్కటే కాదు. ఎఐ ఉత్పత్తి చేసిన అశ్లీల, అసభ్య చిత్రాలు, కంటెంట్‌కు సంబంధించిన ఆందోళనల కారణంగా ఇండోనేషియా ఇటీవల చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. యుకె, ఫ్రాన్స్, మలేషియా కూడా గతంలో అసభ్యకర చిత్రాలను రూపొందించడం పై అభ్యంతరాలు వ్యక్తం చేశాయి.

# ఇరాన్ ఉద్రిక్తం

**మొదటి పేజీ తరువాయి..**

పారిస్, బెర్లిన్ సహా ప్రధాన ఐరోపా నగరాలలో సంఘీభావ నిరసనలు జరుగుతున్నాయి. వాషింగటన్‌లోని వైట్ హౌజ్ ఎదుట నిరసనకారులు గుముగూడి తమ నిరసన తెలిపారు.హింసను ధృవీకరిస్తున్న అంతర్జాతీయ మీడియాగత రెండు రోజుల్లో 100కు పైగా మృతదేహాలను ఆసుపత్రులకు తీసుకువచ్చినట్టు రెండు ఆసుపత్రుల వైద్యులు వార్తా సంస్థలకు చెప్పినప్పటికీ, శనివారం రాత్రి ఇరాన్‌లో నిరసనకారులు ప్రభుత్వ అణచివేతను ధిక్కరించి వీధుల్లోకి వచ్చారు. నిరసనకారులు వీధులలోకి రావడం, ప్రభుత్వ భద్రతా యంత్రాంగం వారిపై హింసకు పాల్పడడానికి సంబంధించిన వీడియోలను బీబీసీ వంటి ప్రముఖ సంస్థలు ధృవీకరించినప్పటికీ, ఇరాన్ ప్రభుత్వం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. నిరసన ప్రదర్శనలో పాల్గొనేవారు ఎవరైనా, భగవంతుడికి శత్రువు అని ఇరాన్ అటార్నీ జనరల్ స్పష్టం చేశారు. దేవుడికి శత్రువు అయినందుకు ఇరాన్‌లో మరణ శిక్ష విధిస్తారు.ప్రజలను చంపడం మొదలుపెడితే, ఇరాన్ పై తీవ్రంగా దాడి చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందిస్తూ, ఒకవేళ అమెరికా ఇరాన్‌పై దాడి చేస్తే, ఆ ప్రాంతంలోని ఇజ్రాయెల్, అమెరికాకు చెందిన సైనిక, నావికాదళ స్థావరాలు చట్టబద్ధమైన లక్ష్యాలు అవుతాయని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ హెచ్చరించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రారంభమై, దాదాపు 100 నగరాలు, పట్టణాలకు ఈ నిరసనలు వ్యాపించాయి. ఇప్పుడు నిరసనకారులు ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మతపరమైన పాలనను అంతం చేయాలని పిలుపిస్తున్నారు.వారిని వీధి రౌడీలుగా అభివర్ణించి,తోసిపుచ్చుతూ వారు ట్రంప్‌ను సంతోషపెట్టేందుకు యత్నిస్తున్నారని ఖమేనీ అన్నారు.సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం: వాషింగ్టన్నిరసనకారులపై తీవ్ర హింసకు పాల్పడవద్దంటూ ట్రంప్ పదే పదే ఇరాన్ నాయకులను అప్రమత్తం చేస్తూ వచ్చారు. కాగా, శుక్రవారం నాడు ఇరాన్ పెద్ద సమస్యలో ఉందని, అయితే అమెరికా ప్రతిస్పందనలో మాత్రం పదాతి దళాల జోక్యం ఉండదని ఆయన అన్నారు. వారికి ఎక్కడ కొడితే ఎక్కువ బాధకలుగుతుందో అక్కడే కొడతామని విలేకరులకు చెప్పిన విషయం తెలిసంది. ఇప్పటికైనా, ఈ తీవ్రతను నివారించవచ్చని ఆశిస్తున్నానని అన్నారు. ఇరాన్ స్వేచ్ఛ కోసం చూస్తున్నందున సహాయమందించేందుకు యుఎస్ సిద్ధంగా ఉందంటూ ట్రంప్ శనివారం సోషల్ మీడియా ప్రకటన చేసిన విషయం తెలిసిందే.

**మానవ హక్కుల ఉల్లంఘనలు**

నిరసన చేస్తున్న ప్రజలపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతూ, డిసెంబర్ 28 నుంచి ఇప్పటివరకూ 2,500 మందికి పైగా నిరసన కారులను అరెస్టు చేసిందని మానవ హక్కుల సంస్థలు ఘోషిస్తున్నాయి. అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా ఇరాన్‌లోపల నుంచి రిపోర్టింగ్ చేయలేక పోతున్నాయి, పైగా గత గురువారం నుంచి ఇరాన్ ప్రభుత్వం ఇంటర్నెట్‌ను మూసివేసింది. దీనితో సమాచారం పంపడం, తెలుసుకోవడం కష్టం అవుతోంది.ఇరాన్ అణు కేంద్రాలపై గత ఏడాది యుఎస్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారంనాడు, ఇరాన్ ఆఖరు షా సంతతి అయిన రెజా పెహ్లావీ తనకు అనుకూలంగా నినాదాలు చేస్తున్న నిరసనకారుల వీడియోను ఎక్స్‌పై షేర్ చేశారు. దాని శీర్షికలో ట్రంప్‌ను, అమెరికా ప్రజల స్వేచ్ఛాకాముకతను కొనియాడారు. అంతేకాదు, ఇస్లామిక్ రిపబ్లిక్ కిరాయి సైనికుల తీవ్ర కొరతను ఎదుర్కొంటోందని, చాలా మంది సాయుధ, భద్రతా దళాలు తమ కార్యాలయాలను విడిచిపెట్టాయి లేదా ప్రజలను అణచివేయడానికి ఆదేశాలను ధిక్కరించాయి అని ఆయన పేర్కొన్నారు. ఈ వాదనలను మీడియా ధృవీకరించలేక పోయింది. తమ నిరసనలను కొనసాగించమని ప్రజలను కోరుతూనే, మీ జీవితాలు ప్రమాదంలో పడకుండా ఉండేందుకు గ్రూపుల్లో, గుంపుల్లో ఉండమని ఆయన సలహా ఇచ్చారు.మానవ హక్కుల సంస్థల ప్రకారం గత కొన్ని నెలల్లో భద్రతా దళాలు 550మందికన్నా ఎక్కువమందిని హతమార్చారని, 20,000 మందిని అదుపులోకి తీసుకున్నాయి.

# రేపు అన్వేషణ్ ప్రయోగం

**మొదటి పేజీ తరువాయి..**

అందించడంలో కీలక పాత్ర పోషించనుంది. ముఖ్యంగా విపత్తుల సమయంలో సమాచారం వేగంగా అందించడం ద్వారా ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

జనవరి 12న రాకెట్ ప్రయోగం

ఇస్రో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, జనవరి 12 ఉదయం 10:17 గంటలకు పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ షార్‌లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ ప్రయోగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలు వీక్షించనున్నారు.

షార్‌లో కట్టుదిట్టమైన భద్రత..

రాకెట్ ప్రయోగం నేపథ్యంలో షార్ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తలు ప్రతి దశనూ జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. పీఎస్ఎల్వీ-సీ62 ద్వారా EOS N1 (అన్వేషన్) శాటిలైట్ ప్రయోగం భారత అంతరిక్ష రంగానికి మరో గర్వకారణంగా నిలవనుంది. దేశ రక్షణ, వాతావరణ అధ్యయనం, విపత్తుల నిర్వహణలో ఈ శాటిలైట్ కీలక పాత్ర పోషించనుంది. షార్‌లో జరుగుతున్న ఈ ప్రయోగంపై దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# మేడారం పనులు

**మొదటి పేజీ తరువాయి..**

15లోపు పూర్తి అనంతరం మీడియాతో మాట్లాడారు. సమ్మక్క సారలమ్మ జాతర విశిష్టతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా శాశ్వత నిర్మాణాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు జరుగుతున్నాయని తెలిపారు. ఈ జాతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ. 260 కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. ఇందులో జాతర నిర్వహణ కోసం రూ. 150 కోట్లు, శాశ్వత గుడి నిర్మాణ పనులకు రూ. 110 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. నిధుల ఖర్చు చేయాల్సిన పనులు అన్ని విషయాలను మేడారంలో సమీక్షించి ఇక్కడికి ఇక్కడే నిర్ణయాలు చేసినట్టు డిప్యూటీ సీఎం మీడియాకు వివరించారు. రెండు రోజుల్లో పనులు పూర్తికాబోతున్నాయని తెలిపారు. ఇప్పటికీ జాతర పనులు సగటున 85శాతం పూర్తి చేశారన్న భట్టి.. మిగిలిన పనులు ఈ నెల 15వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర సందర్భంగా అవసరమైన నిధులు విడుదల చేశామనీ పూర్తి చేసిన పనులకు 24గంటల్లో బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. గతం లో జాతర నిర్వహణకు రూ. 75 కోట్లు, రూ. వంద కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం రూ. 260 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ప్రధానంగా ఆరోగ్య, విద్యుత్ శాఖ అధికారులు జాతర పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని వీరితో పాటు యావత్ శాఖల సిబ్బంది అధికారులు జాతర ను సీరియస్ గా తీసుకోవాలని ఆదేశించారు. భట్టి వెంట మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ఉన్నారు.

# అంతర్జాతీయ సంస్థలకు అమెరిక దూరం : దుష్ప్రభావాలు

**మొదటి పేజీ తరువాయి..**

అన్నది బహుళపాక్షికతకు ఘాతుకమే. అంతేకాదు, ఏకధృవ ప్రపంచ క్రమం లేదా ద్విధృవ ప్రపంచ క్రమం ఉన్నప్పటికన్నా బహుళధృవ ప్రపంచ క్రమం ఉన్నప్పుడే ఈ బహుపాక్షికత అన్నది సాపేక్షికంగా సమర్థవంతంగా పని చేస్తుంది. ప్రపంచం బహుళధృవ ప్రపంచ క్రమం దిశగా పయనిస్తున్న తరుణంలో, ట్రంప్ ప్రభుత్వం 2.0 ఈ బహుళపాక్షిక ప్రపంచ క్రమం తలెత్తడాన్ని నిరోధించాలన్న పట్టుదలతో ఉన్నట్టు కనిపిస్తోంది. ఫలితంగా బహుపాక్షికత హతం కానుంది.

అంతర్జాతీయ సంస్థల నుంచి ఉపసంహరించుకోవాలన్న ట్రంప్ ప్రభుత్వ సార్వభౌమ నిర్ణయాన్ని ఎవరూ సవాలు చేయలేరు, కానీ, ప్రమాదం ట్రంప్ ఏకపక్ష విధానంలో ఉంది, ఇందులో భాగంగా ట్రంప్ వైట్‌హౌస్ ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దారుణంగా ఉల్లంఘిస్తోంది. ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, సిరియా, నైజీరియా, ఇరాక్‌లపై వైమానికదాడులు, కెరీబియన్ లో పడవలు, ఓడలపై నావికాదళ దాడులు, వెనెజులా అధ్యక్షుడిని బందీ చేసి, అమెరికన్ కోర్టులలో అతడిని విచారణ చేసేందుకు న్యూయార్క్ తీసుకువెళ్లడం అన్న పరిణామాలు అంతర్జాతీయ శాంతి భద్రతలకు విఘాతాన్ని కలిగించేవి.

శాంతియుత వాణిజ్యం కోసం తాను వదిలిపెట్టిన అంతర్జాతీయ సంస్థలు నిర్దేశించిన నిబంధనలను పాటించాల్సిన బాధ్యత ఇకపై అమెరికాకు ఉండదు. అంతర్జాతీయ సమాజానికి ప్రయోజనకరంగా ఉంటూ, అమెరికా సాఫ్ట్ పవర్‌ను ప్రదర్శించేవి, స్వయంగా యునైటెడ్ స్టేట్స్ సృష్టించిన సంస్థల నుంచి ఉపసంహరించుకోవాలన్న నిర్ణయం పట్ల పలువురు అమెరికన్ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా సైనిక బలాన్ని బలోపేతం చేసుకోవాలన్నది ట్రంప్ విధాన లక్ష్యం, కానీ డబ్బును ఆదా చేయడం కోసం అన్న సాకుతో అంతర్జాతీయ హామీల నుంచి ఉపసంహరించుకోవడం నిస్సందేహంగా అమెరికా సాఫ్ట్ పవర్‌ను నిలబెట్టిన నిర్మాణాలను నిస్సందేహంగా కూల్చివేస్తుంది. అధ్యక్ష/డఉ ట్రంప్‌కు సలహా ఇస్తున్న సిద్ధాంతకర్తలకు సాఫ్ట్‌పవర్ శక్తి గురించే కాదు, రెండవ ప్రపంచ యుద్ధానంతరం కాలంలో అమెరికాకు అది ఎలా లబ్ధిని చేకూర్చిందో తెలియదన్నది స్పష్టం.

మొదట, అధ్యక్షుడు యుఎస్ విదేశీ సహాయాన్ని నిలిపివేసి, అనంతరం యుఎస్ఎఐడిని దాదాపుగా రద్దు చేసి, ప్రజాస్వామ్య ప్రోత్సహక పథకాలను పలచన చేశారు. ఇప్పుడు అనేకానేక అంతర్జాతీయ సంస్థల నుంచి ఉపసంహరించుకున్నారు. ట్రంప్ వివిక్తవాద విధానాల కారణంగా ఏర్పడే నాయకత్వ శూన్యాన్ని చైనా భర్తీ చేస్తుందని కొందరు వాదిస్తున్నారు. అయితే, ఒకవేళ ఏదైనా దేశం ప్రపంచ వ్యవహారాలలో తన నాయకత్వ పాత్రను వదిలేస్తే, మరొక ఆధిపత్యశక్తిని అంగీకరించేందుకు అంతర్జాతీయ సమాజం అప్పుడే సిద్ధంగా ఉన్నట్టు కనిపించడం లేదు. అమెరికా ఆధిపత్యం కొన్ని ప్రయోజనాలను తీసుకువచ్చినందున అంతర్జాతీయ సమాజం దానిని అయిష్టంగానైనా అంగీకరించింది, అయితే అమెరికా తన సైనిక బలాన్ని ప్రదర్శించడం, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వాలను మార్చడంతో సహా విదేశాలలో జోక్యం చేసుకోవడం నిస్సందేహంగా విస్తృతమైన ఆగ్రహానికి కారణమయింది.

ప్రపంచానికి మంచిది అయినది అమెరికాకు కూడా మంచిది అన్న విశ్వాసం అధ్యక్షుడు ట్రంప్‌కు ఉన్నట్టు కనిపించకపోవడం శోచనీయం. అతడి దృష్టిలో అమెరికాకు మంచిది అయినది ప్రపంచంలో ఇతరులకు హాని చేస్తుందనే భావన ఉంది. తోటి అమెరికన్లు అతడిని సైన్స్ వ్యతిరేకి అని విమర్శిస్తున్నారు. వాతావరణ మార్పుల ప్రమాదాన్ని ఆయన తిరస్కరించడం భవిష్యత్తులో ఒక రోజు ప్రపంచాన్ని బాధపెడుతుంది, ట్రంప్ అమెరికా వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో అధికారంలో కొనసాగని సమయంలో, అమెరికా కూడా వాతావరణ మార్పులకు బాధిత దేశంగా మారుతుంది.

# ప్రీ కాస్ట్‌తో కాలుష్యానికి చెక్

ముంబయి : భవన నిర్మాణ సమయంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రీకాస్ట్, స్టీల్ నిర్మాణ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. నిర్మాణ సమయంలో వెలువడే దుమ్ము కాలుష్యానికి దారితీస్తుందన్నారు. వీటిని నగరం బయటకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. ''ప్రపంచ వ్యాప్తంగా ఆర్‌సీ మిక్సర్లు కనిపించవు. స్టీల్, ప్రీకాస్ట్ నిర్మాణాలే ఉంటాయి. కానీ, కొంచెం ఖరీదు ఎక్కువ. వీటికి ఏమైనా రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వగలమా అని మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించాలని అనుకుంటున్నా'' అని గోయల్ పేర్కొన్నారు. వీటిపై ఆంక్షలు విధించడానికి బదులు.. ఈ పద్ధతులను అవలంబించేందుకు బిల్డర్లను ప్రోత్సహించాలన్నారు. పీయూష్ నార్త్ ముంబయి లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.